www.visalaandhra.com

శనివారం
4-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 104
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

చిలీలో భారీ భూకంపం

శాంటియాగో: చిలీలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 6.2గా నమోదైంది. 104 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు యురోపియన్ మెడిటెర్రేనియన్ సెస్మలాజికల్ సెంటర్ (ఈఎమ్‌ఎస్‌సీ) తెలిపింది.

భూకంపం ధాటికి భవనాలు ఊగడం, జనం పరుగులు తీయడం వంటి దృశ్యాలు సీసీ కెమెరాలకు చిక్కాయి. ఇవి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కొన్ని భవనాల కిటీల అద్దాలు దెబ్బతినడం వంటివి స్వల్ప ఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. భూకంపం వల్ల ఏ మేరకు ఆస్తి, ప్రాణ నష్టం సంభవించిందో తెలియాల్సి ఉంది.

ఇక తెలుగులోనూ ప్రభుత్వ ఉత్తర్వులు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఇక నుంచి ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనూ ఇవ్వాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో అనువదించడానికి డైరెక్టర్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్ సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు శుక్రవారం సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పనితీరులో ఉత్తర్వులు కీలక పాత్ర పోషిస్తాయని ప్రభుత్వం

- మిగతా 2 లో

ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టుల మృతి

విశాలాంధ్ర–చింతూరు: మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ తగిలింది. చత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. కొంతమంది గాయపడినట్లు తెలుస్తోంది. ఘటన స్థలంలో భద్రతా దళాలు కొన్ని ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌ను గరియాబంద్ జిల్లా ఎస్పీ ఎస్‌పీ నిఖిల్ రఖేచా ధృవీకరించారు. మరోవైపు మావోయిస్టుల కోసం భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు

- మిగతా 2 లో

అల్లు అర్జున్‌కు రెగ్యులర్ బెయిల్

విశాలాంధ్ర–హైదరాబాద్: సినీనటుడు అల్లు అర్జున్‌కు ఉపశమనం లభించింది. నాంపల్లి కోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. 'పుష్ప2' బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటకు సంబంధించి అల్లు అర్జున్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియగా... నాంపల్లి కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. రూ.50వేలు చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని, పోలీసుల విచారణకు సహకరించాలని అల్లు అర్జున్‌ను ఆదేశించింది. ప్రతి ఆదివారం చిక్కడపల్లి

- మిగతా 2 లో

ఆస్తి హక్కు రాజ్యాంగబద్ధం

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూదిల్లీ: ఆస్తి హక్కు.. రాజ్యాంగం కల్పించిన హక్కు అని, చట్ట ప్రకారం సరైన పరిహారం ఇవ్వకుండా ఎవరి ఆస్తి తీసుకోలేరని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. రాజ్యాంగ (44వ సవరణ) చట్టం, 198 ప్రకారం ఆస్తి హక్కు ప్రాథమిక హక్కు కాబోదని, అది మానవతా హక్కు అని, అధికరణ 300–ఏ ప్రకారం రాజ్యాంగం పౌరులకు కల్పించిందని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది.

బెంగళూరు–మైసూరు మౌలికవసతుల కారిడార్ ప్రాజెక్టు (బీఎంఐసీపీ) కోసం జరిగిన భూ సేకరణ వ్యవహారంలో కర్నాటక హైకోర్టు 2022 నవంబరులో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. చట్ట ప్రకారం సముచిత పరిహారం ఇవ్వకుండా ఏ వ్యక్తి ఆస్తిని లాక్కోవడం సరికాదని స్పష్టంచేసింది. అప్పిలేట్లుగా ఉన్న భూ యజమానులు గత 22 ఏళ్లలో అనేకసార్లు కోర్టుల తలుపు తట్టాల్సి వచ్చిందని పేర్కొంది. సముచిత పరిహారం ఇవ్వకుండా... వారి ఆస్తులు స్వాహా చేశారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రాష్ట్రం/కేఐఏడీపీ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగానే అప్పిలేట్లకు తగిన పరిహారం సకాలంలో లభించలేదని గుర్తించినట్లు తెలిపింది. ధిక్కరణ నోటీసులు జారీ అయిన తర్వాత మాత్రమే 2019 ఏప్రిల్ 22న ప్రత్యేక

- మిగతా 2 లో

'2050' జనాభా అవసరాలకు

మంచినీటి ప్రణాళిక

- మంజీరాకు అధునాతన పైప్‌లైన్
- సొంత ఆదాయ మార్గాలు అన్వేషించండి
- జలమండలి సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర–హైదరాబాద్: రెండున్నర దశాబ్దాల భవిష్యత్తు అవసరాలను అంచనా వేసి గ్రేటర్ హైదరాబాద్‌లో మంచినీటి సరఫరాకు ప్రణాళికను తయారు చేయాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి జలమండలి అధికారులను ఆదేశించారు. నగర విస్తరణ దృష్టిలో పెట్టుకొని 2050 నాటికి పెరిగే జనాభా అవసరాలకు సరిపడేలా ఫ్యూచర్ ప్లాన్ ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ తాగునీటితో పాటు సీవరేజీ ప్లాను రూపొందించాలని, అవసరమైతే ఏజెన్సీలు, కన్సల్టెన్సీలతో అధ్యయనం చేయించాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో శుక్రవారం జల మండలి బోర్డు సమావేశం జరిగింది. బోర్డు ఛైర్మన్ హోదాలో సీఎం అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రస్తుతం హైదరాబాద్ సిటీ జనాభాకు సరిపడే తాగునీటిని సరఫరా చేస్తున్నామని, 9,800 కిలోమీటర్ల తాగునీరు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా 13.79 లక్షల కనెక్షన్లకు నీటిని సరఫరా చేస్తున్నట్లు సీఎంకు అధికారులు నివేదించారు. మంజీరా, సింగూరు, గోదావరి, కృష్ణా నుంచి నీటి సరఫరా జరుగుతోందని, గోదావరి ఫేజ్ 2 ప్రాజెక్టు ద్వారా మరింత నీటిని తెచ్చుకొని ఉస్మాన్ సాగర్ , హిమాయత్ సాగర్ వరకు తాగునీటి సరఫరాకు డిజైన్ చేసిన ప్రాజెక్టుపై చర్చ జరిగింది. మల్లన్నసాగర్ నుంచి నీటిని తీసుకోవాలా, కొండపోచమ్మ సాగర్ ను నీటి వనరుగా ఎంచుకోవాలా

- మిగతా 2 లో

ఆర్ఆర్ఆర్ భూసేకరణ
తక్షణం పూర్తి చేయండి

2లో

ఫాసిస్టు విధానాలు

తిప్పికొడదాం

సీపీఐ బలపడితేనే మతవాద బీజేపీని గద్దె దించగలం

ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపు

పాట్నా: భారత కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేసుకోవాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. మనం బలంగా ఉంటేనే మతోన్మాద బీజేపీని కేంద్రంలో గద్దె దించగమని ఉద్ఘాటించారు. అందుకోసం ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. దేశాన్ని ఫాసిస్టు భారతంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని విమర్శించారు. ఫాసిస్టు విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీహార్‌లో పార్టీ మరింతగా బలం పెంచుకోవడం కోసం కృషి చేయాలని రాజా సూచించారు. బీహార్‌లోని సీపీఐ అధికారిక పత్రిక 'జనశక్తి' ఆవరణలో శుక్రవారం పార్టీ శతాబ్ది ఉత్సవం ఘనంగా జరిగింది. మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయనకు పార్టీ నాయకులు విప్లవాంజలి ఘటించారు. పార్టీ వ్యవస్థాపకులు, అమరుల చిత్రపటాలకు పూలమాల వేసి షహీద్ బేదీ స్మారకం వద్ద నివాళులర్పించారు. సీపీఐ పతాకావిష్కరణతో శతాబ్ది ఉత్సవాన్ని రాజా ప్రారంభించారు. సభలో రాజా మాట్లాడుతూ సీపీఐది పోరాటాలు, త్యాగాల చరిత్ర అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలంగా ఉంటేనే కేంద్రంలోని మతవాద బీజేపీని గద్దె దించగలమన్నారు. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని రాజా డిమాండ్ చేశారు. సీపీఐ

- మిగతా 2 లో

చైనాలో కొత్త వైరస్

కలకలం

రోగులతో ఆసుపత్రులు కిటకిట

న్యూదిల్లీ: చైనాలో హ్యూమన్ మెటానిమోవైరస్ (హెచ్‌ఎంపీవీ) కలకలం సృష్టిస్తోంది. కోవిడ్ తరహా లక్షణాలతో ఈ కొత్త వైరస్ చైనాను హడలెత్తిస్తోంది. శ్వాస సంబంధిత సమస్యలతో వచ్చే రోగులతో అక్కడి ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఈ పరిణామంతో ప్రపంచ దేశాలు అప్రమత్తమయ్యాయి. మరో కోవిడ్ వస్తుందన్న ఆందోళన ఇప్పటికే మొదలైంది. వాస్తవానికి ఈ వైరస్‌ను 2001లోనే గుర్తించారు. అయితే ప్రస్తుతం ఇది చైనాలో విజృంభిస్తోంది. ఉత్తర చైనాను వణికిస్తోంది. కేసులు భారీగా నమోదు అవుతుండటంతో చైనా వణుకుతోంది. యాంటీ వైరల్ చికిత్స కూడా ఏమీ లేకపోవడం ప్రజలను మరింతగా భయపెడుతోంది. ఈ కొత్త వైరస్ లక్షణాలు ఫ్లూను పోలి ఉంటాయి. ఈ వైరస్ సోకిన వారిలో దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడ, శ్వాసకు ఇబ్బంది వంటి లక్షణాలు ఉంటాయని, తీవ్రత ఎక్కువగా ఉంటేగనుక బ్రాంకైటిస్, నిమోనియాగా పరిణమించేందుకు అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి లక్షణాలు బయట పడాలంటే మూడు నుంచి ఆరు రోజులు పడుతుందని

- మిగతా 2 లో

వేడెక్కిన దిల్లీ రాజకీయం

ఆప్ ఒక విపత్తు: మోదీ

బీజేపీది విధ్వంస పాలన: కేజ్రీవాల్

న్యూదిల్లీ: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ దేశ రాజధాని దిల్లీ రాజకీయాలు వేడెక్కాయి. అధికార ఆప్, ప్రతిపక్ష బీజేపీ పరస్పర ఆరోపణలు గుప్పించుకుంటున్నాయి. మాటల తూటాలు పేల్చుకుంటున్నాయి. ఫిబ్రవరిలో దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. కొంతకాలంగా అధికార ఆమ్ ఆద్మీపార్టీ అభ్యర్థుల జాబితాలు, ఎన్నికలు హామీలు ఇస్తూ వేగంగా ముందుకు కదులుతోంది. తాజాగా ప్రధాని నరేంద్రమోదీ అభివృద్ధి కార్యక్రమాల పేరుతో దిల్లీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆప్‌ను, ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రావాల్‌పై ఎదురుదాడికి దిగారు. ఆప్‌ను ఓ పెద్ద విపత్తుగా పేర్కొన్నాయి. కేజ్రీవాల్ పార్టీని దిల్లీ నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. దీనిపై కేజ్రీవాల్ తీవ్రంగా స్పందించారు. బీజేపీపైనా, మోదీపైనా విరుచుకుపడ్డారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం సందర్భంగా మోదీ మాట్లాడుతూ దిల్లీ ముఖ్యమంత్రి నివాసంపై ఇటీవల వచ్చిన విపరీతమైన ఖర్చుల ఆరోపణలను ప్రస్తావించారు. తాను కావాలంటే శీష్ మహల్ (అద్దాల మేడ) కట్టుకోగలనని, అయితే పేదలకు ఇళ్లు నిర్మించాలన్నదే తన కోరిక అని ప్రధాని చెప్పుకొచ్చారు. కాగా, తనపై చేసిన ఆరోపణలను కేజ్రీవాల్ ఖండిస్తూ గత దశాబ్దంలో దిల్లీలో బీజేపీ విఫలమైందని ఆరోపించారు. మోదీ వ్యాఖ్యలను 'వ్యక్తిగత దాడులు' అని కొట్టిపారేశారు.

నేనూ అద్దాల మేడ నిర్మించుకునేవాడిని: మోదీ

దిల్లీకి ఆప్ ఒక 'విపత్తు' అని, గత 10 సంవత్సరాల్లో దాని ఉచ్చులో దేశ రాజధాని చిక్కుకుందని ప్రధాని మోదీ అన్నారు. దిల్లీ నుంచి కేజ్రీవాల్ పార్టీని తప్పనిసరిగా 'తొలగించాలి' అని తెలిపారు. గృహ, విద్యా రంగాలతో సహా జాతీయ రాజధానిలో అనేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించిన తర్వాత ప్రజలను ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తూ, ఆప్ నేతృత్వంలోని నగర ప్రభుత్వంపై మండిపడ్డారు. దాని పాలన కొనసాగితే దేశ రాజధానిలో పరిస్థితి మరింత దిగజారుతుందని అన్నారు 'ఒకవైపు కేంద్రం చాలా ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు, కేంద్ర పాలిత ప్రభుత్వం పచ్చి అబద్ధాల కోసం నిలుస్తోంది. పాఠశాల విద్య నుంచి కాలుష్యం, మద్యం వ్యాపారంపై పోరాటం వరకు అనేక రంగాలలో ఆప్ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. నగరంలో వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, ఈ 'అప్దా' (విపత్తు) పై దిల్లీ యుద్ధం ప్రారంభించిందని, దానిని వదిలించుకోవాలని నిర్ణయించుకున్నట్లు ప్రధాని చెప్పారు. ఈ ఏడాది దేశ నిర్మాణం, ప్రజల సంక్షేమం అనే కొత్త రాజకీయాలకు నాంది పలుకుతుందని, అందుకే 'విపత్తు' ను తొలగించాలని, బీజేపీని తీసుకురావాలని కోరారు. కేంద్ర ప్రాయోజిత వైద్య ఆరోగ్య పథకం ఆయుష్మాన్ భారత్‌ను, దేశ రాజధానిలో ఇతర కార్యక్రమాలను అనుమతించకపోవడం వల్ల... తాను ప్రయత్నించినప్పటికీ ఇక్కడ నివసించే ప్రజలకు పూర్తిగా సహాయం చేయలేకపోయానని మోదీ అన్నారు. రాజధానిలో రహదారులు నిర్మించడంతో

- మిగతా 2 లో

రైతుభరోసా ఎగవేతకు కుట్ర

- ప్రమాణపత్రాల పేరుతో రైతులపై కేసులకు యత్నం
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై కేటీఆర్ ధ్వజం

విశాలాంధ్ర–హైదరాబాద్: ప్రభుత్వం రైతు భరోసా ఎగ్గొట్టే కుట్ర చేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రమాణ పత్రాల పేరుతో రైతులపై కేసులు పెట్టే ప్రయత్నం చేస్తుందని దుయ్యబట్టారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సొమ్మును రైతన్నలు మాత్రమే తింటున్నారన్న దుష్ప్రచారం ఆపాలన్నారు. హామీలు అమలు చేసే సత్తా లేకుంటే రైతన్నలకు క్షమాపణ అడగాలన్నారు. ప్రమాణ పత్రం వేయాల్సిందే రైతన్నలు కాదు... హామీ ఇచ్చి మోసం చేసిన ప్రభుత్వమే అని పేర్కొన్నారు. రైతు భరోసాపై గ్రామగ్రామాన లబ్ధిదారుల జాబితా పెట్టాలన్నారు. గ్రామాల్లో కౌలు రైతులకు, రైతు కూలీలకు ఏ విధంగా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నేను మాత్రం ఔటు!

ఆర్థిక ఇబ్బందులున్నా

హామీలన్నీ అమలు చేస్తాం

- అమ్మ ఆదర్శ పాఠశాలలకు రూ.657 కోట్లతో మౌలిక వసతులు
- వివిధ అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన

2 లో

'గ్రీన్ పవర్'లో అద్భుత విజయాలు

- 2030 నాటికి 20 వేల మెగావాట్లే లక్ష్యం
- సమగ్ర అభివృద్ధికి ఏఐ, ఫ్యూచర్ సిటీలు, రీజినల్ రింగ్ రోడ్డు: భట్టి

విశాలాంధ్ర–హైదరాబాద్: గ్రీన్ పవర్ రంగంలో తెలంగాణ అద్భుత విజయాలు సాధించి, దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీపై వాటాదారులతో శుక్రవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ... సాంకేతికత, ఫార్మాస్యూటికల్స్, ఉత్పత్తి, వ్యవసాయరంగాల అభివృద్ధికి కేంద్రంగా ఉద్భవించిందన్నారు. స్వచ్ఛమైన శక్తి వనరుల వినియోగంలో ముందంజ వేస్తూ, 11,399 గ్రీన్ పవర్ సామర్థ్యాన్ని సొంతం చేసుకుందన్నారు. 2030 నాటికి 20,000 మెగావాట్ల లక్ష్యాన్ని చేరుకునే దిశగా సాగుతోందన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు, ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జనాభా అవసరాలను తీర్చే ఆకుపచ్చ స్థిరమైన పట్టణ పర్యావరణ వ్యవస్థ రూపకల్పనకు శ్రీకారం చుట్టామన్నారు. హైదరాబాద్ సమీపంలో అత్యాధునిక కృత్రిమ మేధస్సు

- మిగతా 2 లో

శతవసంతాల అరుణపథం 100

విప్లవాంకురం గదర్ పార్టీ

మొదటి ప్రపంచ యుద్ధం 1914లో ప్రారంభమైన తరవాత గదర్ పార్టీకి చెందిన కొంతమంది సభ్యులు పంజాబ్ చేరుకుని దేశ స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటం కొనసాగించాలని ప్రేరేపించారు. వారు దొంగచాటుగా ఆయుధాలు చేరవేశారు. భారత్‌లో ఉన్న బ్రిటీష్ సైనికులను తిరుగుబాటు చేయాలని రెచ్చగొట్టారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

సిరియాపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు

సైనిక స్థావరాలే లక్ష్యం

జెరూసలేం: సిరియాలోని సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయిల్ వైమానిక దాడులు జరిపింది. దక్షిణ అలెప్పోలో బాంబుల వర్షం కురిపించింది. రక్షణ, పరిశోధన స్థావరాలు లక్ష్యంగా ఇజ్రాయిల్ దళాలు వైమానిక దాడులు చేసినట్లు సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ పేర్కొంది. ఏడు భారీ పేలుళ్లు జరిగినట్లు తెలిపింది. పశ్చిమాసియాలో ఇజ్రాయిల్ భద్రతా దళాలు దురాక్రమణ, మారణహోమం కొనసాగిస్తున్నాయి.

20 లక్షల మంది భద్రతకు ముప్పు

గాజాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతూ పలస్తీనియన్లను హతమారుస్తున్నాయి. గాజా స్ట్రిప్‌లో వేలాది కుటుంబాలు ఆహారం, మందులు లేక ఇబ్బంది పడుతున్నాయి. కనీస వసతులు కరువయ్యాయి. ప్రస్తుతం చలి కాలం. గడ్డకట్టే చలిలో కప్పుకోవడానికి దుప్పట్లు లేవు. సరైన రక్షణ/వసతులు లేక చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు. పసిపిల్లలు చలికి గడ్డకట్టిపోతున్నారు. తమ కళ్ల ఎదురుగా కన్నబిడ్డలు ప్రాణాలు వదులుతుండటంతో తల్లిదండ్రుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది. ప్రాణాలపై ఆశలు లేకపోతేనే గాజాలో ఉండాలనే తరహా పరిస్థితులు నెలకొన్నాయని కన్నీటిపర్యంతమవుతున్నారు. అంతర్జాతీయ మానవతా సాయం కూడా గాజా ప్రజలకు అందకుండా ఇజ్రాయిల్ అడ్డుకుండటం తెలిసిందే. ఇదిలావుంటే రాబోయే రోజుల్లో మరింత కఠినమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని గాజా ఆరోగ్య శాఖ హెచ్చరించింది. ఎముకలు కొరికే చలితో సుమారు 20 లక్షల మంది భద్రతకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఉంటుందని పేర్కొంది.

చలితో శిశువులు, వృద్ధుల మరణాలు పెరుగుతాయని హెచ్చరించింది.

బ్రిటన్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలి: మస్క్

న్యూయార్క్: స్పేస్‌ఎక్స్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ బ్రిటన్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో 'గ్రూమింగ్ గ్యాంగ్స్' పేట్రేగిపోతున్నాయని, వారిని అదుపు చేయలేని ప్రభుత్వం అధికారంలో ఉండి లాభం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల సమస్యను పరిష్కరించలేని బ్రిటన్ రాజు కింగ్ ఛార్లెస్-3 పార్లమెంట్‌ను రద్దు చేసి... ఎన్నికల నిర్వహణకు ఆదేశించాలని ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌ను ఉద్దేశించి ఇటీవల ఓ నెటిజన్ బ్రిటన్ బాగుపడాలంటే దేశ పార్లమెంట్‌ను రద్దు చేసి... ఎన్నికలకు ఆదేశించాలా అని పెట్టిన పోస్ట్‌పై మస్క్ సానుకూలంగా స్పందించారు. పబ్లిక్ ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలోనూ రేప్ గ్యాంగ్‌లను అదుపు చేయడంలో ప్రధాని విఫలమయ్యారని ఆరోపించారు. వీటిని ప్రభుత్వ నేతలే నడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2011లో ఈ విషయంపై రోథర్‌హాం ఎంపీ సారా ఛాంపియన్ మాట్లాడుతూ గతంలో ఈ దుర్మార్గాలను రిపోర్టు చేయడానికి ప్రయత్నించిన సామాజిక కార్యకర్తలను బలవంతంగా 'రేస్ రిలేషన్స్' కోర్సులకు పంపారని చెప్పినట్లు మస్క్ పేర్కొన్నారు. ఈ విధంగా పిల్లలను వేధింపులకు గురిచేయడం సిగ్గుచేటని అన్నారు. '2008-2013 సమయంలో ఈ ముఠాలు ఎంతోమంది యువతుల జీవితాలను నాశనం చేశాయి. అప్పుడు సీపీఎస్ అధిపతిగా ఉన్న కీర్ స్టార్మర్ ఏమి చేశారు' అని మస్క్ ప్రశ్నించారు.

దక్షిణ కొరియాలో రాజకీయ గందరగోళం

ఉ.కొరియా

ప్యాంగ్యాంగ్: దక్షిణ కొరియా రాజకీయాలు గందరగోళంగా మారాయని, ఆ దేశంలో ప్రజాస్వామ్యం కుప్పకూలిందని ఉత్తర కొరియా విమర్శించింది. డిసెంబరు 3 తర్వాత పరిణామాలపై ఉత్తర కొరియా అధికారిక వార్తా సంస్థ కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ ఓ కథనాన్ని ప్రచురించింది. దక్షిణ కొరియా పరిణామాలపై ప్యాంగ్యాంగ్ పత్రిక స్పందించడం అరుదు. అయితే మార్షల్ లా అమలు క్రమంలో ఆ దేశంలో జరిగిన రాజకీయ పరిణామాలు, అధ్యక్షుడు, తాత్కాలిక అధ్యక్షుడిపై అభిశంసనలను అసాధారణ పరిణామాలుగా పేర్కొంది. అధ్యక్షుడి పేరిట అరెస్టు వారెంటు జారీ కావడం, దానిని ఆయన ఎదిరిస్తుండటం, అరెస్టు చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ వర్గీయులు హెచ్చరికలు చేయడం వంటివాటిపై స్పందిస్తూ 'దక్షిణ కొరియాలో సామాజిక, రాజకీయ గందరగోళం నెలకొంది' అని ఉత్తర కొరియా వ్యాఖ్యానించింది. దక్షిణ కొరియాలోని ప్రభుత్వ రంగ సంస్థలు, వ్యవస్థలను అమెరికా కీలుబొమ్మలుగా అభివర్ణించింది.

ఆస్తి హక్కు రాజ్యాంగబద్ధం

(మొదటిపేజీ తరువాయి)

భూసేకరణ అధికారి (ఎస్ఎల్ఏఓ) పరిహారం చెల్లింపునకు నిర్ణయం తీసుకున్నారని, సేకరించిన భూమి మార్కెట్ విలువ నిర్ధారించడానికి 2011 నాటి విలువలు పరిగణించారని తెలిపింది. 2003లో ఉన్న మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం ఇవ్వడమంటే రాజ్యాంగంలోని అధికరణ 300-ఏను అపహాస్యం చేయడమేనని ధర్మాసనం పేర్కొంది. ఈ పరిణామాల క్రమంలో రాజ్యాంగంలోని అధికరణ 142 కింద తమకున్న అధికారం మేరకు 2019 ఏప్రిల్ 22 నాటికి ఉన్న మార్కెట్ విలువ ఆధారంగా భూముల యజమానులకు పరిహారం ఇవ్వాలని ఎస్ఎల్ఏఓకు ఆదేశాలు జారీ చేయడమే సముచితమని సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. ఇందుకోసం రెండు నెలల సమయం ఇస్తున్నట్లు తెలిపింది. 22 ఏళ్లుగా న్యాయమైన పరిహారానికి దూరమైన అప్పిలేట్లకు ఇప్పటికైనా న్యాయం చేయాలని, వారికి సంతృప్తికరమైన పరిహారం ఇవ్వాలని, దీనిని మరింత జాప్యం చేయరాదని సుప్రీంకోర్టు ఉత్తర్వుల్లో ఆదేశించింది.

రైతుభరోసా ఎగవేతకు కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

రైతుబంధు ఇచ్చిరో స్వీయ ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లోనే ప్రజాపాలన - అభయ హస్తం పేరుతోనే ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుందన్నారు. రైతు భరోసాకు మరోసారి ఇవ్వాలంటూ డ్రామా మొదలెట్టిందన్నారు. ఆరు గ్యారంటీల కోసం అని చెప్పి కోటి ఆరు లక్షల మంది దగ్గర దరఖాస్తులు తీసుకుని సమాచారాన్ని సంపూర్ణంగా సేకరించిందన్నారు. గతంలో రైతును శాసించేటట్టు తమ ప్రభుత్వం తయారు చేస్తే, కాంగ్రెస్ యాచించే స్థితికి తీసుకువచ్చిందన్నారు. కావాలనే రైతు బంధులో 22 వేల కోట్లు పక్కదారి మళ్లాయని దుష్ప్రచారం చేస్తుందని, ఏ ఊర్లో ఎంత మేర రైతుబంధు దుర్వినియోగం అయిందో గ్రామ గ్రామాన జాబితా ప్రచురించాలన్నారు. పత్తి, కంది, చెరుకు, పసుపు, పోడు భూముల రైతన్నల కు ఇచ్చిన రైతుబంధు దుబారా అయిందని అడ్డగోలుగా ప్రభుత్వం అబద్ధాలు ఆడుతుందన్నారు. ప్రతి ఒక్క రైతన్న ... తాము ఎందుకు ప్రమాణపత్రం ఇవ్వాలి అని ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. ఒక్కో ఎకరానికి రూ.17,500 చొప్పున మొత్తం రాష్ట్ర రైతులకు రూ.26 వేల కోటకు పైగా బాకీ పడిందన్నారు. తాము రూపాయి లంచం లేకుండా కోటి 52 లక్షల మందికి రైతుబంధు ఇచ్చామన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సంపూర్ణంగా అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని పిలుపునిచ్చారు. వివిధ రూపాల్లో రాష్ట్ర రైతాంగాన్ని చైతన్యవంతం చేస్తామన్నారు. సంక్రాంతి లోగా రైతు భరోసా అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.

చైనాలో కొత్త వైరస్ కలకలం

(మొదటిపేజీ తరువాయి)

అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి ముప్పు ఎక్కువని అమెరికాకు చెందిన సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ పేర్కొంది.

ప్రస్తుతానికి ముప్పులేదు: డీజీహెచ్ఎస్

ప్రస్తుత పరిస్థితుల్లో ఆందోళన అక్కర్లేదని భారత ఆరోగ్య సంస్థ డైరెక్టరేట్ జనరల్ (డీజీహెచ్ఎస్) డాక్టర్ అతుల్ గోయల్ తెలిపారు. హ్యూమన్ మెటానిమోవైరస్ (హెచ్ఎంపీవీ) వైరస్‌ను ముందస్తు జాగ్రత్తలతో నివారించవచ్చన్నారు. హెచ్ఎంపీవీ వైరస్‌కు యాంటీ వైరల్ చికిత్స లేదన్నారు. దేశంలోని శ్వాస సంబంధిత వైరల్ వ్యాప్తికి సంబంధించిన డేటాను విశ్లేషించినట్లు తెలిపారు. 2024-డిసెంబరు డేటా ప్రకారం తమ సంస్థల్లో పెద్ద సంఖ్యలో నమోదైన కేసులు ఏమీ లేవన్నారు. శీతాకాలంలో శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు వ్యాప్తి చెందుతాయని, ఆసుపత్రులు అవసరమైన వైద్య సామగ్రి, పడకలను అందుబాటులో ఉంచాలన్నారు. శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల నియంత్రణకుగాను జన సమూహాలను నివారించాలని, దగ్గు, జలుబు ఉన్న వారితో దూరం పాటించాలని సూచించారు. దగ్గు, తుమ్ములు వచ్చినప్పుడు రుమాలు లేదా తువాలు వాడాలని, జలుబు, జ్వరం మందులు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండటం వల్ల వైరస్ వ్యాప్తిని కట్టడి చేయొచ్చని గోయల్ అన్నారు. ఇదిలావుంటే, సీజనల్ వ్యాధుల వ్యాప్తి క్రమంలో కొత్త వైరస్ సంబంధిత డేటాను నిశితంగా గమనిస్తున్నామని, అంతర్జాతీయ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నామని కేంద్ర ఆరోగ్య శాఖ పరిధిలోని రోగాల నిరోధానికి జాతీయ కేంద్రం (ఎన్‌సీడీసీ) వెల్లడించింది.

అల్లు అర్జున్‌కు రెగ్యులర్ బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని, సాక్షులను ప్రభావితం చేయొద్దని సూచించింది. అల్లు అర్జున్‌కు షరతులతో కూడిన రెగ్యులర్ బెయిల్ లభించినట్లు ఆయన తరపు న్యాయవాది అశోక్‌రెడ్డి తెలిపారు. బెయిల్ షరతులను వెల్లడించారు. మరోవైపు నాంపల్లి కోర్టు విధించిన రిమాండ్ ముగియడంతో అల్లు అర్జున్ వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. అదే రోజు అల్లు అర్జున్ తరపు న్యాయవాదులు రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన నాంపల్లి కోర్టు తాజా తీర్పు వెలువరించింది.

ఆర్థిక ఇబ్బందులున్నా

హామీలన్నీ అమలు చేస్తాం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నట్టు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. రూ.657 కోట్లు వెచ్చించి అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్టు వివరించారు. ఏజెన్సీ ప్రాంతమైన కొత్తగూడెం జిల్లాలో శుక్రవారం మంత్రి విస్తృతంగా పర్యటించారు. తొలుత సుజాతనగర్ మండలంలోని వేపలగడ్డ గ్రామం నుంచి బృందావనం వరకు ఆర్ అండ్ బీ నిధులు రూ. రెండు కోట్ల వ్యయంతో మూడు కిలోమీటర్ల వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేశ్ వి. పాటిల్ తో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధి లో వెనుకబడి ఉందన్నారు.

స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు. అనంతరం స్థానిక శ్రీ రామచంద్ర కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి సభలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని హాస్టల్స్ లో 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచినట్టు చెప్పారు. కొత్తగూడెం రుద్రంపూర్‌లోని సింగరేణి, అటవీ, ప్రైవేట్ భూములను తీసుకుని ఆరు నెలల్లో ఎయిర్ పోర్ట్ ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తగూడెంలో ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు.

పర్యాటక రంగం అభివృద్ధికి కలెక్టర్ ప్రత్యేక చొరవ

జిల్లాలో విస్తృతంగా పర్యాటక రంగం అభివృద్ధి చేయాలనే ఆలోచనలతో కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తీసుకుంటున్న ప్రత్యేక చొరవ అభినందనీయమని మంత్రి కొనియాడారు. 'ఏరు పండగను' రూపొందించడం జరిగిందన్నారు. ఈ నెల 9న వైకుంఠ ఏకాదశి శుభదినం సందర్భంగా నిర్వహిస్తామన్నారు. భద్రాచలం ఆలయం, గోదావరి నది, బోటింగ్, చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామ సమీపంలో ఉన్న కనకగిరి శిఖరం, కిన్నెరసాని డ్యామ్, జింకల పార్కు వంటి పర్యాటక ప్రదేశాలపై దృష్టిని సారించేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. అనంతరం పాల్వంచ మండలం రెడ్డిగూడెంలో రూ. కోటి 70 లక్షలతో హై లెవెల్ బ్రిడ్జి కు మంత్రి శంకుస్థాపన చేశారు. పాల్వంచ బైపాస్ రోడ్డుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి సీతారాంపట్నం - పాండురంగాపురం వరకు రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బ్రిడ్జికి పొంగులేటి శంకుస్థాపన చేశారు. ఐటీడీఏ పీవో రాహుల్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

'గ్రీన్ పవర్'లో అద్భుత విజయాలు

(మొదటిపేజీ తరువాయి)

స్మార్ట్ టెక్నాలజీలతో ఆధునిక నగర అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. తెలంగాణను గ్లోబల్ ఫార్మాస్యూటికల్ హబ్‌గా తీర్చిదిద్దుతూ, లైఫ్ సైన్సెస్ రంగంలో అగ్రగామిగా మార్చడం జరుగుతుందన్నారు. రీజినల్ రింగ్ రోడ్, మెట్రో రైలు విస్తరణ, విమానాశ్రయం, పారిశ్రామిక కారిడార్... రాష్ట్రాన్ని లాజిస్టిక్స్ పవర్‌హౌస్‌గా మారుస్తున్నాయని చెప్పారు. ప్రస్తుత పునరుత్పత్తి శక్తి సామర్థ్యం 11,399 మెగావాట్లు, 7,889 మెగావాట్ల సౌరశక్తి, 2,518 మెగావాట్ల జలశక్తి, 771 మెగావాట్ల పంపిణీ పునరుత్పత్తి శక్తి, 221 మెగావాట్ల ఇతర పునరుత్పత్తి శక్తి (128 మెగావాట్లు పవన శక్తి) కలిగి ఉందన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల్లో పంప్డ్ స్టోరేజ్ ఉన్నాయని, ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులు, గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ పరిశీలనలో ఉన్నాయన్నారు. 54,717 మెగావాట్ల పవన విద్యుత్ సామర్థ్యం కలిగి ఉండి, దేశంలో టాప్-8 రాష్ట్రాలలో ఒకటిగా నిలుస్తోందని చెప్పారు. విద్యుత్ వాహన అభివృద్ధి, 872 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయన్నారు. గత ఎఫ్ వై 24లో గరిష్ట విద్యుత్ డిమాండ్ 15,623 మెగావాట్ల నుంచి 2030 నాటికి 24,215 మెగావాట్ల, ఎఫ్ వై 35 నాటికి 31,809 మెగావాట్ల వరకు పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు. డిమాండ్‌ను నెరవేర్చేందుకు స్వచ్ఛమైన, నమ్మదగిన, సరసమైన, స్థిరమైన శక్తి వనరులు ముఖ్యమైనవన్నారు. 300 సూర్యకాంతి రోజులతో రాష్ట్రం ఫోటోవోల్టిక్ సోలార్ ప్రాజెక్టులకు అనుకూలమైన ప్రాంతంగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులు, గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ, పంప్‌డ్ స్టోరేజ్ వంటి ఆధునిక పద్ధతులను ప్రోత్సహిస్తోందన్నారు. విద్యుత్ వాహన చార్జింగ్ స్టేషన్ల సంఖ్య 872కి చేరుకుందని, పారిశ్రామికవేత్తలకు పన్ను మినహాయింపులు, చెల్లింపుల సబ్సిడీలు వంటి ప్రోత్సాహకాలు అందించడం ద్వారా పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నట్టు పేర్కొన్నారు. వ్యర్థాలను శక్తిగా మార్చే ప్రాజెక్టులను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. తెలంగాణ పునరుత్పత్తి శక్తి రంగంలో ఇతర రాష్ట్రాల కంటే ముందంజలో ఉందని, దేశంలోనే వివిధ రాష్ట్రాలకు ఆదర్శంగా మారిందన్నారు.

ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టుల మృతి

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది గరియాబంద్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశమైనట్లు భద్రతా బలగాలకు సమాచారం అందింది. దీంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషయాన్ని మావోయిస్టులు పసిగట్టి... భద్రతా బలగాలపై కాల్పులకు దిగారు. భద్రతా బలగాలు సైతం ఎదురు కాల్పులకు దిగాయి. కొన్ని గంటల పాటు ఎన్‌కౌంటర్ కొనసాగింది. కాల్పుల్లో మరణించిన మావోయిస్టులను గుర్తించాల్సి ఉందని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు.

మంచినీటి ప్రణాళిక

(మొదటిపేజీ తరువాయి)

అనే అంశంపై చర్చించారు. సలహా మండలి రిపోర్టుతో మల్లన్నసాగర్ నుంచే తాగునీటి సరఫరా ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. గతంలో ప్రతిపాదించిన 15 టీఎంసీలకు బదులు, సిటీ అవసరాల దృష్ట్యా 20 టీఎంసీల నీటిని తెచ్చుకునేందుకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జలమండలి ఆదాయ వ్యయాల నివేదికను ఎండీ అశోక్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. ఆదాయం... ఉద్యోగుల జీతభత్యాలకు, తాగునీటి సరఫరా నిర్వహణ ఖర్చులకు సరిపోతుందని చెప్పారు. వివిధ ప్రభుత్వ విభాగాలు, కార్యాలయాల నుంచి రూ.4,300 కోట్ల బకాయిలు రావాల్సి ఉందన్నారు. కరెంటు బిల్లులకు జలమండలి రూ.5,500 కోట్లు బాకీ పడిందని, రూ.1,847 కోట్లు అప్పులున్నాయని, రూ.8,800 కోట్ల రెవిన్యూ లోటు ఉందని వివరించారు. ఆదాయ వ్యయాలు ఆశాజనకంగా లేవని, వీటిని అధిగమించేందుకు ఆర్థికశాఖ సమన్వయంతో తక్షణ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సొంత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని, అందుకు అనుసరించాల్సిన విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. నల్లా బిల్లు బకాయిలు క్రమం తప్పకుండా వసూలయ్యేలా చూడాలని అన్నారు. కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు అవసరమయ్యే నిధులను సమకూర్చుకోవాలని, తక్కువ వడ్డీతో రుణాలు తెచ్చుకునే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అందుకు ప్రాజెక్టు డీపీఆర్ తయారు చేయించాలని చెప్పారు. 1965 నుంచి మంజీరా ద్వారా సిటీలో పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్న పైపు లైన్లకు కాలం చెల్లిందని, రిపేర్లు వస్తే దాదాపు పది నుంచి 15 రోజులు నీటి సరఫరా నిలిచిపోతోందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రత్యామ్నాయంగా మరో అధునాతన లైన్ నిర్మించేలా కొత్త ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల జీవన్ మిషన్ ద్వారా నిధులు తెచ్చుకునేందుకు వీలుగా ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

వేడెక్కిన ఢిల్లీ రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

పాటు ఢిల్లీ అభివృద్ధి మండలి (డీడీఏ) పేదలకు ఇళ్లు కట్టించగలిగింది. ఎందుకంటే ఈ రంగాల్లో 'విపత్తు' కు పెద్ద పాత్ర లేకపోవడమేనని చెప్పారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై విరుచుకుపడిన మోదీ... తాను కూడా తన కోసం శీష్ మహల్ (అద్దాల మేడ) ను నిర్మించుకుని ఉండేవాడినని, అయితే దేశంలోని ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఉండేలా చూడాలన్నదే తన కల అని అన్నారు. 'ఈ వ్యక్తులు అవినీతికి పాల్పడి, దానిని కీర్తిస్తారు' అని ఆయన అన్నారు, ఆప్ నాయకులు తప్పుడు వాగ్దానాలు చేస్తున్నారని ఆరోపించారు. కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన అధికారిక నివాసం కోసం భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేశారనే ఆరోపణలపై బీజేపీ లక్ష్యంగా చేసుకుంది. కేజ్రీవాల్ పూర్వ నివాసాన్ని 'శీష్ మహల్' గా అభివర్ణించింది.

బీజేపీ చేసిందేమిటి : కేజ్రీవాల్

ఢిల్లీలో బీజేపీ నేతృత్వంలోని కేంద్రం ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని, లేకుంటే ప్రధాని నరేంద్ర మోదీ తన 43 నిమిషాల ప్రసంగంలో 39 నిమిషాలు రాజధాని ప్రజలను, వారు అత్యధిక ఆధిక్యతతో ఎన్నుకున్న ప్రభుత్వాన్ని తిట్టాల్సిన అవసరం ఉండేది కాదని కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పాలనపై మోదీ చేసిన వ్యాఖ్యలపై మీడియా సమావేశంలో కేజ్రీవాల్ స్పందిస్తూ, బీజేపీ కేవలం 'దుర్వినియోగ రాజకీయాలు' వ్యక్తిగత దాడులు' కు మాత్రమే పాల్పడుతుందని అన్నారు. 'గత పదేళ్లలో మా ప్రభుత్వం చేసిన పనిని జాబితా చేయడానికి రెండు మూడు గంటలు కూడా సరిపోవు. మరోవైపు మోదీజీ ప్రసంగంలో మాట్లాడగలిగే ఏ పనీ బీజేపీ ప్రభుత్వం చేయలేదు. అది చేసి ఉంటే. అతను ఏ పని చేసినా ఢిల్లీ ప్రజలను దుర్భాషలాడాల్సిన అవసరం ఉండేది కాదు' అని తెలిపారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనలో తమ ప్రభుత్వం సాధించిన రికార్డులు బీజేపీ విరాళాలను అధిగమించాయని కేజ్రీవాల్ పేర్కొన్నారు. 'గత 10 సంవత్సరాలలో బీజేపీ ఢిల్లీలో ఒక్క ముఖ్యమైన పని కూడా చేయలేదు. వారు 2022 నాటికి శాశ్వత గృహాలను వాగ్దానం చేశారు. కానీ ఐదేళ్లలో 4,700 ఇళ్లు మాత్రమే నిర్మించారు' అని తెలిపారు. ప్రత్యామ్నాయాలను అందించకుండానే మురికివాడలను బీజేపీ కూల్చివేస్తోందని కేజ్రీవాల్ ఎదురుదాడికి దిగారు. మీరు బీజేపీకి ఓటేస్తే ఢిల్లీలోని అన్ని మురికివాడలను కూల్చివేసి ఉండేవారని అన్నారు. ఢిల్లీలో ఆప్దా (విపత్తు) లేదు... అసలైన విపత్తు బీజేపీ' అని స్పష్టం చేశారు.

ఆర్ఆర్ఆర్ భూసేకరణ

తక్షణం పూర్తి చేయండి

- ప్రతి గ్రామానికి బీటీ రహదారి
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రోడ్డు వెడల్పు: రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్)కు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌కు తెలంగాణ జిల్లాల్లో అసంపూర్తిగా మిగిలిన భూసేకరణ ప్రక్రియను సంక్రాంతిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సచివాలయంలో శుక్రవారం ఆర్ఆర్ఆర్, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవే ప్రాజెక్టులపై అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. రేవంత్ మాట్లాడుతూ అటవీశాఖ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అటవీశాఖ, ఆర్ అండ్ బీ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. రెండు శాఖల్లో ఒక్కో అధికారిని ఇందుకు ప్రత్యేకంగా నియమించాలని సూచించారు. సంబంధిత శాఖల పరిధిలోని భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్రంలో ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రోడ్డు వెడల్పు ఉండేలా డిజైన్ చేయాలని పేర్కొన్నారు. విడతల వారీగా నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. మా గ్రామానికి రోడ్డు లేదు అనే మాట వినబడొద్దన్నారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండాసురేఖ పాల్గొన్నారు.

ఫాసిస్టు విధానాలు తిప్పికొడదాం

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి నాగేంద్రనాథ్ ఓఝా మాట్లాడుతూ సీపీఐ చరిత్ర చాలా గొప్పదని, దేశంలో సంక్షేమ పథకాల అమలులో కీలకపాత్ర పోషించిందని అన్నారు. కేంద్రప్రభుత్వం దేశాన్ని ఫాసిస్టు మార్గంలోకి తీసుకెళుతోందదన్నారు. ఇటువంటి ప్రయత్నాలను తిప్పికొట్టడం అవసరమని నొక్కిచెప్పారు. సీపీఐ బీహార్ రాష్ట్ర కార్యదర్శి రామ్ నరేశ్ పాండే, కార్యదర్శివర్గ సభ్యులు జానకి పాశ్వాన్, రామచంద్ర మహంతో, ఓంప్రకాశ్ నారాయణ్, ప్రమోద్ ప్రభాకర్, సంజయ్ కుమార్, అజయ్ కుమార్ సింగ్, విజయ్ నారాయణ్ మిశ్రా, మిథిలేశ్ కుమార్ ఝా, ఎమ్మెల్యే రామ్ రతన్ సింగ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామ్‌బాబు కుమార్ తదితరులు ప్రసంగించారు. సీపీఐ 'ఉదయ్', 'వికాస్' పుస్తకాలను ఆవిష్కరించారు.

నేడు కిసాన్ మహాపంచాయత్

ఖనౌరీకి తరలి రండి: దలేవాల్ పిలుపు

చండీగఢ్: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికిగాను కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు కిసాన్ మహా పంచాయత్‌కు రైతు నేతలు పిలుపునిచ్చారు. పంజాబ్-హర్యానా సరిహద్దు దగ్గర ఖనౌరీ దీక్షా శిబిరం వద్ద ఈ మహా పంచాయత్ శనివారం జరగనుంది. రైతుల కోసం వారి నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ 40 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. ఖనౌరీ వద్దకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని రైతులను ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం 70 నిమిషాల నడివిగల వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 'ఎంఎస్‌పీకి చట్టబద్ధత కోసం పోరాటంలో భాగస్వాములైన వారంతా ఖనౌరీకి రండి. నేను మీ అందరినీ చూడాలని కోరుకుంటున్నా' అని దలేవాల్ పేర్కొన్నారు. మహా పంచాయత్‌లో దలేవాల్ రెండు-మూడు నిమిషాలు మాట్లాడతారని రైతు నేత అభిమన్యు కోహర్ వెల్లడించారు. శంభు, ఖనౌరీ సరిహద్దుల వద్ద పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయనున్నట్లు సీనియర్ నేత సర్వన్ సింగ్ పంధేర్ తెలిపారు. తమ సమస్యల పరిష్కారంలో కేంద్రం మొండి వైఖరిని ఖండించారు. మా డిమాండ్లు పరిష్కరించాల్సింది కోర్టులు కాదు కేంద్రమని నొక్కిచెప్పారు. ఆందోళన చేస్తున్న రైతులతో మోదీ ప్రభుత్వం నేరుగా మాట్లాడాలని పంధేర్ డిమాండ్ చేశారు.

ఇక తెలుగులోనూ ప్రభుత్వ ఉత్తర్వులు

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొంది. 90శాతం మంది తెలుగు మాట్లాడే ప్రజలు ఉన్న రాష్ట్రంలో తెలుగులో ఉత్తర్వులు జారీ చేయడం సహేతుకమని తెలిపింది. మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏపీలో తెలుగు భాషా సమగ్రతకు ఇలా ఉత్తర్వులు జారీ చేయడం తోడ్పడుతుందని తెలిపింది. ఆంగ్లం, తెలుగు రెండు భాషల్లోనూ ఉత్తర్వులు ఇవ్వాలని వివిధ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. మొదట ఆంగ్లంలో ఉత్తర్వులు జారీ చేసి దాన్ని అప్‌లోడ్ చేయాల్సిందిగా పేర్కొంది. రెండు రోజుల్లోగా తెలుగులోనూ అదే ఉత్తర్వు జారీ అయ్యేలా చర్యలు చేపట్టాలని సాధారణ పరిపాలన శాఖ వివిధ శాఖలకు సూచించింది.

ప్రజలందరూ సోదర భావంతో మెలగాలి : ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఈ నూతన సంవత్సరం సందర్భంగా అని రంగంలో అభివృద్ధి జరగాలని ప్రజలందరూ సోదర భావంతో శాంతి యూతంగా మెలగాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. నూతన సంవత్సరం 2025 నేపథ్యంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో శు క్రవారం ఉర్దూగర్ అధ్యక్షులు, రాష్ట్ర మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి సారథ్యంలో కూనంనేని, సాబీర్ పాష లను శాలువాలు కప్పి సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షల మేరకు నియోజక వర్గాన్ని బహుముఖ అభివృద్ధి దిశగా తాను కృషి చేస్తున్నట్లు కూనంనేని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇక్బాల్ ఖురేషి, సిపిఐ నాయకులు నేరెళ్ల రమేష్, ఎండి అమీర్ ఖాద్రి, సీనియర్ న్యాయవాది ఎం ఏ రజాక్, జల్లేపల్లి కాశీ విశ్వనాథం, మంచి కంటి వెంకయ్య, ఎండి అన్వర్, ఆటో యూనియన్ సహాయ కార్యదర్శి ఎండి బాబు జాని ఖాన్, ఎండి జమాల్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు మల్లు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబూబాబాద్: దొరలను, దేశ్ ముక్‌లను తరిమికట్టిన చరిత్ర వెంకట మల్లుదని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి అన్నారు. శుక్రవారం భారత కమ్యూనిస్టు పార్టీ ఈ ప్రాంత సీనియర్ నేత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరజీవి మాస బత్తిని వెంకట మల్లు 11వ వర్ధంతి సభను మూడు కోట్ల జంక్షన్‌లో వెంకట మల్లు స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఈ ప్రాంతంలో వెంకటమల్లు పాత్ర అమోఘం అన్నారు. దొరలను దేశ్ ముక్ లను తరిమి కొట్టిన చరిత్ర వెంకట మల్లుది, ఈ ప్రాంతంలో సాయుధ పోరాట దళ కమాండర్‌గా అతని పాత్ర చరిత్రలో మిగిలిపోతుంది అన్నారు. భారత్ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో ఈ ప్రాంతంలో అనేకమందికి సలహాలు సూచనలు ఇచ్చి పార్టీ ఎదుగుదలకు తన వంతు కృషి చేశాడని పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాటం పై వెంకట మల్లు పుస్తకం కూడా రచించారని కొనియాడారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్ చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వెలుగు శ్రావణ్, మేక వీరన్న, మాలోతు రవీందర్, నాగేల్లి యాకమ్మ, తోట రాజకుమారి, మంద శంకర్, ఎర్రోజు పద్మ, ముడుసు రాణి, తండా శ్రీనాథ్, కూరాకుల పాల్, తోట రమేష్, చిలువేరు వికాస్, మేక వెంకటేష్, దొనికిని రమేష్ ,నునావతు బాలు, మాలి సమ్మక్క, పూజారి ఐలయ్య, రమేష్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

విశాలాంధ్ర - ముదిగొండ : ముదిగొండ మండలానికి చెందిన సెల్‌ఫోన్‌లు బాధితులు ముదిగొండ పోలీసస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ యాప్‌ను ఉపయోగించి సెల్‌ఫోన్‌లను 13 గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అట్టి సెల్‌ఫోన్‌లను సిఐ మురళి ఎస్సై నరేష్ శుక్రవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ముదిగొండ సిఐ మాట్లాడుతూ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ విధానంతో సుమారు రెండు లక్షల విలువ గల 13 ఫోన్లను బ్లాక్ చేసి, వాటిని ట్రేస్ చేసి, నిజమైన యజమానులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జూలై లోగా రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేయాలి

మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : దశాబ్దాల నుండి ఖమ్మం పాలేరు నియోజకవర్గం ప్రజలు ఎదుర్కొంటున్న మున్నేరు వాగు ముప్పు సమస్యకు మరో ఏడు నెలల్లోగా శాశ్వత పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మున్నేరు నది ఒడ్డున ముంపునకు గురవుతున్న నివాస కాలనీలకు శాశ్వత పరిష్కారం చూపుతూ నదీ తీరం వెంబడి రూ.690 కోట్లతో 17 కిలోమీటర్ల ఆర్‌సిసి రిటైనింగ్‌వాల్ నిర్మిస్తున్నామని తెలిపారు. వచ్చే వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జూలై 15 వ తేదీలోగా ఎట్టి పరిస్దితులలోనూ పనులను పూర్తి చేసి తీరాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంత్రి, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, భూసేకరణ పై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి 234 ఎకరాల భూమి అవసరం ఉండగా 64 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉండగా 170 ఎకరాలు పట్టా భూములు ఉన్నాయని వెంటనే ఈ భూములను సేకరించడానికి యజమానులతో మాట్లాడి యుద్ధ ప్రతిపాదికన భూసేకరణ జరపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో మున్నేరు వాగు పొంగి పొర్లడం వల్ల ఖమ్మం, పాలేరు నియోజకవర్గం ప్రజలు తరచూ వరద సమస్యలు ఎదుర్కొంటున్నారని ఇటువంటి పరిస్థితిని నియంత్రించడానికి రిటర్నింగ్ వాల్ నిర్మాణం ఒకటే పరిష్కారం అని అన్నారు. మున్నేరు నది ఎఫ్.ఎస్.టి. వివరాలు తెలుసుకున్న మంత్రి, గత సెప్టెంబర్‌లో వచ్చిన విధంగా భారీ వరదలు వస్తే ఎంత మేరకు నీరు చేరు తుంది. అధికంగా ఫోర్స్‌తో నీటి ప్రవాహం వచ్చినప్పుడు తట్టుకునేందుకు రిటైనింగ్ వాల్‌లో పాటించాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ ఎంజాయ్ మెంట్ సర్వే రెండు రోజులలో పూర్తి చేసి వివరాలు సమర్పించాలని కలెక్టర్‌కు తెలిపారు. మున్నేరు నది బఫర్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాల వివరాలు, ఖమ్మం అర్బన్ పరిధిలో ప్రభుత్వ భూములలో జరిగిన ఆక్రమణలకు సంబంధించి వారం రోజులలో పూర్తి నివేదిక అందించాలని రెవెన్యూ డివిజన్ అధికారిని ఆదేశించారు. భూ సేకరణ కోసం సంబంధిత రైతులతో సంప్రదింపులు జరిపేందుకు నిపుణుల కమిటీ నియమించుకోవాలని అన్నారు. ఆర్డీఓ నరసింహారావు, ఇరిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వర రావు, ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడే 'నూరేళ్ల నా ఊరు' గేయ కళాకారుల ఎంపిక

విశాలాంధ్ర - పినపాక : ప్రముఖ సినీగేయ రచయిత, వాగ్గేయకారుడు ప్రజా కవి వరంగల్ శ్రీనివాస్ రచించిన "నూరేళ్ల నా ఊరు" గేయ కావ్యం 243 చరణాలతో 243 మంది గాయనీ గాయకులతో పోటీ నిర్వహించనున్నారని ప్రజా గాయకుడు సిద్దుల హుస్సేన్ తెలిపారు. ఈ గేయ సంకల్పం తో కళాకారుల ఎంపిక జనవరి 4 శనివారం నుండి ఖమ్మం పట్టణంలోని అంబేద్కర్ భవనంలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అని హుస్సేన్ శనివారం మీడియా సమావేశంలో తెలిపారు. అనంతరం పెద్ద ఎత్తున ఆవిష్కరణ కార్యక్రమం పాట ప్రదర్శన ఉంటుందన్నారు. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అనేక మట్టి గొంతులను వెలికి తీసి ఈ పాటలో భాగస్వామ్యం చేయాలని నూరేండ్ల ఊరు ఎట్లుండెదో ఆనాటి ప్రజల జీవన స్థితిగతులు ఏ విధంగా ఉండేవో ప్రస్తుత సమాజం ఎంత మార్పు జరిగిందో విశదీకరించి కవితాత్మకంగా రాసిన సుదీర్ఘ గేయ కావ్యం పాడడం కోసం కళాకారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్య సంకల్పానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా కళాకారులకు దక్కడం వరంల భావిస్తున్నామన్నారు. గాయకులు పాడే పాటలకు న్యాయ నిర్ణేతగా నూరేళ్ళ నా ఊరు రచయిత వరంగల్ శ్రీను పాల్గొంటారన్నారు. ఇందులో ఉమ్మడి జిల్లా కళాకారులు పాల్గొని తమ ప్రతిభ కనబరచాలని ఆయన కోరారు.

ఏజెన్సీ గిరి పుత్రికను వరించిన మాస్టర్ ఆఫ్ డాక్టర్స్

విశాలాంధ్ర - గార్ల : పక్క ఏజెన్సీ ప్రాంతమైన మండల పరిధి లోని దేశ్యాతండా గ్రామానికి చెందిన గిరిజన బిడ్డ మాలోత్ సంధ్యకు గాంధీ ఆసుపత్రిలో మాస్టర్ ఆఫ్ డాక్టర్ జనరల్ మెడిసన్ విభాగంలో సీటు దక్కింది. దీంతో ఈ ప్రాంతంలో ఆమెకు అభినందనలు వ్యక్తమౌతున్నాయి. ఈ గ్రామ రైతు మాలోత్ మాన్సింగ్, నీలాదేవి దంపతుల కుమార్తె అయిన సంధ్య ఇటీవల నీట్, పీజీ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. గాంధీ ప్రభుత్వాసుపత్రి లో ఎండీ విభాగం నందు సీటు సాధించింది. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ లో ఎంబిబిఎస్ పూర్తి చేసుకున్న ఆమె ఇక్కడి ఎంజిఎం ఆస్పత్రిలో ఒక సంవత్సరం ఇంటర్షిప్ అయ్యాక మొదటి ప్రయత్నంలోనే యం.డి సీటు సాధించటం గర్వించదగ్గ విషయమని మండల ప్రముఖ నాయకులు పలువురు అభినందించారు. చిన్ననాటి నుండి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి అంకిత భావం, పట్టుదలతో చదివి మొదటి ర్యాంకు విధ్యార్థిగా ప్రతిభ కనబరుస్తూ వచ్చింది. తండ్రి చిన్నకారు రైతు కాగా తల్లి అంగన్వాడీ టీచర్ గా వుంటూ ఎన్నో కష్టనష్టాలకోర్చి తమ కూతురు సంధ్యను ఈ స్థాయి దాకా చదివిస్తూ ఏజెన్సీ ప్రాంత వాసులకు ఆదర్శంగా నిలిచారు. ఆమె ఇంకా అంచలంచలుగా ఎదుగుతూ వైద్య వృత్తిలో ఉన్నత శిఖరాలు అందుకోవాలని మండల ప్రజానీకం ఆకాంక్షిస్తుంది.

మంత్రి పొంగులేటిని సన్మానించిన సీతారాములు దంపతులు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : కొత్తగూడెం జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం పర్యటనకు వచ్చిన రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సుజాతనగర్ గ్రామంలోని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు, కుటుంబ సభ్యులను కలిసి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో యువకుడైన నాగ సీతారాములు పార్టీలో నిబద్ధత, క్రియాశీల నాయకుడని మంత్రి పొంగులేటి కొనియాడారు. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటితోపాటు ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులను నాగా సీతారాములు దంపతులు శాలువాలు కప్పి ఆత్మీయంగా సన్మానించారు.

ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టుల మృతి

విశాలాంధ్ర - చర్ల : మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్ర బలగాలు నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్ నేపధ్యంలో పచ్చటి అడవి ప్రాంతంలో తుపాకుల మోత, రక్తం పారుతుంది. ఈ క్రమంలోనే శుక్ర వారం చత్తిస్ ఘడ్ రాష్ట్రం, గరియా బంద్ జిల్లాలో కేంద్ర బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగినట్టు సమాచారం అందింది. ఈ కాల్పులు అమలిపాదార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంద సర్, నాగోస్ గ్రామాల మధ్య గల అటవీ ప్రాంతంలో జరిగిందని సమాచారం. మావోయిస్టులకు, భద్రత బలగాల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో సుమారు ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లు అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తుంది. ఇప్పటికే ఒక మావోయిస్టు మృతదేహాన్ని బలగాలు స్వాధీనం చేసుకున్నారని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని సమాచారం. ఈ ఎన్కౌంటర్లో సంయుక్తంగా ఈ -30, యంగ్ ప్లాటూ న్, సీఆర్పీఎఫ్, ఎస్‌ఓజి బలగాలు పాల్గొన్నారు. ఈ దట్టమైన అటవీ ప్రాంతంలో ఇంకా కాల్పులు కొనసాగుతున్నట్లు తెలిసింది.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

విశాలాంధ్ర - కారేపల్లి : తొలి చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జీవితం నేటి మహిళా లోకానికి ఆదర్శమని రాష్ట్ర అంబేద్కర్ సంఘం నాయకులు ఆదెర్ల రాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సింగరేణి గ్రామంలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద భారత దేశ తొలి చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 194వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఆశయాలతోనే నేటి మహిళలు చదువులలో రాణించి ఎంతో ఉన్నత పదవులు పొంది కీర్తి ప్రతిష్టలు గడిస్తున్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ రాములు, తలారి చంద్ర ప్రకాష్, జడల వెంకటేశ్వర్లు, మేదరి టోని, పొక్కిలి యుగంధర్, సమ్మయ్య, సోమందుల నాగరాజు, దానబోయిన సమ్మయ్య, తడికమల్ల నరేష్, శనగ రాంబాబు, బండెల రామారావు, తాజుద్దీన్, గంపల వేణు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - పెబ్బేరులో: ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి మహిళా ఉపాధ్యాయుల పాత్ర గణనీయమైనదని మండల విద్యాశాఖాధికారి జయరాములు అన్నారు. పెబ్బేరు పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖాధికారి జయరాములు తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే గొప్పతనం గురించి బాలికల విద్య కోసం ఆమె చేసిన కృషి గురించి ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి మహిళా ఉపాధ్యాయుల పాత్ర గణనీయమైనదని తమ అమూల్య సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ అక్కమ్మ సావిత్రీబాయి పూలే జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు గణిత బోధిని (ఎక్కాల పుస్తకం) లను అందించడం జరిగింది. ఈ సమావేశంలో అరుంధతి విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - వనపర్తిలో: సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో సమాజ మార్పు, మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు ఈ కళావతమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఐ ఆఫీసులో ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలను నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కళావతమ్మ మాట్లాడుతూ 1848లో పూణేలో తొలి బాలికల పాఠశాలను ఏర్పాటు చేసి దేశంలోని తొలి మహిళా టీచర్‌గా చదువులు చెప్పారన్నారు. సిపిఐ జిల్లా నేత గోపాలకృష్ణ సావిత్రిబాయి పూలే చరిత్రను వివరించారు. వనపర్తి పట్టణ కన్వీనర్ జయమ్మ కో కన్వీనర్ శిరీష, నాయకులు జయశ్రీ, శ్రీదేవి, జ్యోతి, నాగమణి, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీ రామ్, శ్రీహరి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబూబాబాద్‌లో: ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల (కలెక్టరేట్)లోనీ ప్రధాన సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే.వీరబ్రహ్మాచారి, ఇతర జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలోనూ తన భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో సావిత్రిబాయి చదువు నేర్చుకుని ఉపాధ్యాయురాలు అయ్యారని గుర్తు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, సిపిఓ సుబ్బా రావు, జడ్పీ సీఈఓ పురుషోత్తం, డిహెచ్ఓ మరియన్న, డిపిఓ హరిప్రసాద్, కలెక్టరేట్ ఏ.ఓ పవన్ కుమార్, పర్యవేక్షకులు మదన్ గోపాల్, భద్రకాళి, పాల్గొన్నారు.

మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో : అట్టడుగు వర్గాల అభివృద్ధికి కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేక అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆనాటి కాలంలో స్త్రీలు చదువుకోనని రోజులలో బాలికలకు ప్రత్యేక పాఠశాలలు ప్రారంభించి, బాలికల విద్యకు ప్రోత్సహించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు.ఏ.ఆర్ డిఎస్పీలు శ్రీనివాస్, విజయప్రతాప్, ఆర్.ఐ భాస్కర్, సోములు, అధికారులు, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లాలో: ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఇతర జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. జిల్లా విద్యా శాఖ అధికారి రామారావు, సిపిఓ జీవరత్నం, డిఆర్డిఓ విజయలక్ష్మి, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి శ్రీనివాస్, పరిశ్రమల మేనేజర్ నరసింహ రెడ్డి, ఏవో సూర్యారావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కొండమల్లేపలిలో : అక్షర దీపాన్ని వెలిగించిన చదువుల తల్లి సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా కొండమల్లేపల్లిలోని మాజీ ఎంపీపీ రేఖా శ్రీధర్ రెడ్డి కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సమాజంలో బాలికల చదువుల కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త సామాజిక కార్యకర్త సావిత్రిబాయి పూలే అని వారి సేవలను మాజీ ఎంపీపీ గారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఊట్కూరి వేమన్ రెడ్డి మాజీ ఉపసర్పంచ్ గంధం సురేష్,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మంగ్యా నాయక్, యేకుల అనిత, ప్రెస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏరుకొండ రాము, జితేందర్, అనిల్,నవకాంత్, పసుపులేటి శివ పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో - మెదక్‌లో: సావిత్రిబాయి పూలే జయంతి, జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, ఇతర జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళల అభ్యున్నతి కోసం కృషి చేయాలని, అప్పుడే ఆమె ఆశయ సాధనకు కృషి చేసినట్లు అవుతుందని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, ముఖ్య ప్రణాళిక అధికారి బద్రీనాథ్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, యువజన క్రీడల నిర్వహణ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ ఉదయ్ కుమార్, అడిషనల్ ఎస్పీ మహేందర్, డిఆర్ఓ భుజంగరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, ఆర్డీవోలు నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, తూప్రాన్ జయచంద్రారెడ్డి, సంబంధిత కలెక్టరేట్ సూపర్డెంట్ సంబంధిత జిల్లా అధికారులు, టీజిఓస్, టీఎన్జీవోస్ నాయకులు కలెక్టరేట్ రెవిన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది కలెక్టర్‌ను కలిశారు.

భూకంపంతో అతలాకుతలమైన వనాటుకు భారత్ సాయం

న్యూఢిల్లీ: వనాటులో 7.4 తీవ్రతతో సంభవించిన భూకంపం కారణంగా ఆ దేశానికి భారత్ 5 లక్షల డాలర్ల తక్షణ సహాయ సాయాన్ని ప్రకటించింది. ఈ చర్య గ్లోబల్ సౌత్ పట్ల భారతదేశం నిబద్ధతను, ఫోరం ఫర్ ఇండియా-పసిఫిక్ ఐలాండ్స్ కోఆపరేషన్ (ఎఫ్ఐపిఐసి)తో దాని నిమగ్నతను నొక్కి చెబుతుంది. 2024 డిసెంబర్ 17న దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న వనాటు తీరంలో సంభవించిన భారీ భూకంపం భారీ విధ్వంసానికి దారితీసి, గణనీయమైన ప్రాణ, ఆస్తినష్టానికి దారితీసింది. ద్వీప దేశం పునర్నిర్మాణం, సహాయక చర్యలకు మద్దతు ఇవ్వడానికి భారతదేశం నుండి ఆర్థిక సహాయం లక్ష్యంగా పెట్టుకుంది. భారత-పసిఫిక్ దీవుల సహకార ఫ్రేమ్‌వర్క్ కింద సన్నిహిత మిత్రుడిగా, భాగస్వామిగా, వనాటులోని స్నేహపూర్వక ప్రజలకు సంఘీభావంగా, వారి సహాయ, పునరావాసం, పునర్నిర్మాణ ప్రయత్నాలకు మద్దతుగా భారత ప్రభుత్వం 500,000 డాలర్ల సహాయ సహాయాన్ని అందిస్తోందని విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడిన కష్ట, వినాశన సమయాల్లో వనాటుకు భారత్ అండగా నిలిచిందని మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఫిలిప్స్ విటాఅప్‌ని పరిచయం చేసిన సిగ్నిఫై

ముంబయి: లైటింగ్‌లో ప్రపంచ అగ్రగామి సిగ్నిఫై, భారతదేశంలో తన విప్లవాత్మక ఉత్పత్తి ఫిలిప్స్ విటాఅప్‌ని ప్రారంభించామని ప్రకటించింది. ఈ వినూత్న ఉత్పత్తి చాలా కాలం పాటు ఇండోర్ సెట్టింగ్‌లో యూవీబీని తక్కువ-తీవ్రత డోస్‌ను అందించడం ద్వారా వ్యక్తిగత శ్రేయస్సును అందించేందుకు మద్దతుగా రూపొందించారు. ఎముకలు, దంతాలు ధృఢంగా ఉండేలా ప్రోత్సహించడం, రోగనిరోధక పనితీరుకు మద్దతు ఇవ్వడం, మానసిక స్థితిని, మానసిక పనితీరును మెరుగుపరచడం ద్వారా మొత్తం ఆరోగ్యాన్ని, శ్రేయస్సును మెరుగుపరచడం ఫిలిప్స్ విటాఅప్ లక్ష్యంగా పెట్టుకుంది. నేడు ప్రజలు ఎక్కువ సమయం ఇంటి లోపల గడుపుతున్నారు. కనుక, ఆరోగ్యకరమైన ఇండోర్ వాతావరణాలను సృష్టించవలసిన ప్రాముఖ్యత మరింత ఎక్కువైంది. ఫిలిప్స్ విటాఅప్ విటమిన్ డి ఉత్పత్తిని ప్రేరేపించేందుకు కాంతిని ఉపయోగించడం ద్వారా ఈ అవసరాన్ని పరిష్కరించడంతో పాటు మొత్తం ఆరోగ్యాన్ని, శ్రేయస్సును ప్రోత్సహిస్తుంది. ప్రపంచ జనాభాలో దాదాపు 50% మంది విటమిన్ డి లోపంతో బాధపడుతున్నారని పరిశోధనలు తేటతెల్లం చేశాయి. ఇది సహజమైన సూర్యరశ్మికి గురికావడాన్ని పరిమితం చేసే ఆధునిక జీవనశైలికి అత్యుత్తమమైనది. సందర్‌ల్యాండ్‌లో నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, ఇదే విధమైన సాంకేతికతను ఉపయోగించి, విటమిన్ డి స్థాయిలను పెంచడంలో తక్కువ-తీవ్రత యూవీబీ ఎక్స్‌పోజర్ ప్రభావాన్ని ప్రదర్శించింది.

వైభవోపేతంగా ముజిగల్ ఎడ్యుటెక్ మీట్ అండ్ మింగిల్ కార్యక్రమం

హైదరాబాద్: సంగీత విద్య కోసం భారతదేశ ప్రీమియర్ హైబ్రిడ్ ప్లాట్‌ఫారమ్‌గా వెలుగొందుతున్న, ముజిగల్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్, భారతదేశం అంతటా 100కిపైగా అకాడమీ భాగస్వామ్యాలను అధిగమించడంతో పాటుగా 2024లో 8,000కిపైగా విద్యార్థులతో వృద్ధి చెందుతున్న కమ్యూనిటీగా ముందుకు సాగుతుంది. ఈ విజయాలను స్మరించుకోవడానికి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి ముజిగల్ తమ భాగస్వాములు, ఉపాధ్యాయులు, కార్పొరేట్ ఉద్యోగుల కోసం ఒక గొప్ప వేడుక కార్యక్రమం నిర్వహిస్తోంది. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన బ్రాండ్‌లతో ముజిగల్ బలమైన సహకారాన్ని ప్రదర్శిస్తూ ఆల్‌ఫ్రెడ్, రాక్‌స్కూల్, ప్రోక్రాఫ్ట్, యమహాతో సహా సంగీత విద్య, వాయిద్యాలలో గ్లోబల్ లీడర్‌లచే ఈ మైలురాయి వేడుకను జరుపుకుంటుంది. ఈ క్రమంలో ముజిగల్ ఇటీవల కర్ణాటకకు చెందిన దాని భాగస్వాములు, ఉపాధ్యాయుల కోసం విజయవంతమైన మీట్ అండ్ మింగిల్ పార్టీని నిర్వహించింది. ముజిగల్ విజయగాథ తమ భాగస్వాములు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల అంకితభావానికి నిదర్శనమని ముజిగల్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు డాక్టర్ లక్ష్మీనారాయణ ఏలూరి అన్నారు.

సామ్‌సంగ్ ఇండియా 'బిగ్ టీవీ డేస్' ఆఫర్లు

గురుగ్రామ్: భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, నూతన సంవత్సరం, గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ 'బిగ్ టీవీ డేస్' ఆఫర్‌ను తీసుకువచ్చింది . నియో క్యూఎల్‌ఈడీ 8కే, నియో క్యూఎల్‌ఈడీ 4కే, ఓఎల్‌ఈడీ, 4కే యూహెచ్‌డీ టీవీ మోడల్‌లతో సహా దాని ప్రీమియం బిగ్-స్క్రీన్ టీవీలపై ఆకర్షణీయమైన డీల్‌లను అందిస్తోంది. ఈ ఆఫర్ జనవరి 3 నుండి జనవరి 31, 2025 వరకు అందుబాటులో ఉంటుంది. తమ హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ అనుభవాన్ని మెరుగుపరచుకోవాలని చూస్తున్న వినియోగదారులు రూ. 2,04,990 విలువైన ఉచిత సామ్‌సంగ్ టివిలు, ఎంపిక చేసిన కొనుగోళ్లతో గరిష్టంగా రూ.99,990 విలువైన సౌండ్‌బార్‌లతో సహా అద్భుతమైన ఆఫర్‌ల నుండి ప్రయోజనం పొందవచ్చు. కస్టమర్‌లు గరిష్టంగా 20% క్యాష్‌బ్యాక్, జీరో డౌన్ పేమెంట్, గరిష్టంగా 30 నెలల కాలవ్యవధితో ఈఎంఐ అవకాశాలను కూడా పొందవచ్చు. భారతదేశంలోని ప్రముఖ ఆన్‌లైన్ పోర్టల్‌లు, సామ్‌సంగ్ రిటైల్ అవుట్‌లెట్‌లలో శామ్‌సంగ్.కామ్‌లో ఈ ఆకర్షణీయమైన ఆఫర్‌లు అందుబాటులో ఉంటాయి.

సావిత్రిబాయి మార్గం నేటి తరం మహిళలకు ఆదర్శం

విశాలాంధ్ర - చర్ల : కులవ్యవస్థలో దుష్ట సంప్రదాయాల ముసుగులో ఘోర అవస్థలు ఎదుర్కొన్న ఆనాటి భారతీయ మహిళలల్లో చైతన్యం నింపిన ఆదర్శమూర్తి సావిత్రి బాయి పూలే నేటితరం మహిళలకు దిక్సూచి అని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు అన్నారు. శుక్రవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతిని నిర్వహించారు. ఆమె ఫోటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి తన భర్త ప్రోత్సాహంతో అంటరాని, పితృస్వామ్య వ్యవస్థను ఢీకొని విద్యావంతురాలై తన జీవితకాలం సంఘ సంస్కర్తగా సమాజ మార్పుకు పని చేశారని గుర్తు చేశారు. నేటి మహిళలు ఆమెను ఆదర్శంగా తీసుకొని సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కారం సరేష్, పామర్ బాలాజీ, వరదల వరలక్ష్మి, శ్యామల కాంతయ్య, సోడి నరసింహారావు, భద్రయ్య పాల్గొన్నారు.

ప్రయాణీకుల ఇబ్బందులు పట్టించుకోరా?

విశాలాంధ్ర - కొమరం భీం : బెజ్జూర్ మండలంలోని పాపన్నపేట గ్రామానికి ఉదయం 7.30 గంటలకు రావలసిన ఆర్టీసీ బస్సు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నామని ప్రతినిత్యం పాపన్నపేట గ్రామం నుండి బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, పెంచికల్పేట్, చెడ్వాయి, తదితర గ్రామాల నుండి విద్యార్థులు ఈ ఆర్టీసీ బస్సులో విద్యార్థులు వచ్చేవారిని ఉదయం సమయంలో ఆర్టీసీ బస్సు రాకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తెలుపుతున్నారు. ప్రతినిత్యం రాత్రి సమయంలో వచ్చిన బస్సులు తెల్ల వారుజామున వెళ్లిపోవడంతో మళ్లీ ఉదయం రావాల్సిన ఆర్టీసీ బస్సు రాకపోవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి అధిక డబ్బులు చెల్లించి నష్టపోతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సు రావడం లేదని డిపో మేనేజర్‌కు ఫోన్ చేసినప్పటికీ ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని ప్రయాణికులు తెలుపుతున్నారు. ఆసిఫాబాద్ డిపో మేనేజర్ స్పందించి సమయపాలనతో ఆర్టీసీ బస్సులు నడిపేలా చూడాలని విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి : బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధం ఆజ్ఞలు రామగుండం కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో ఫిబ్రవరి 1 వరకు పొడిగించినట్లు రామగుండం పోలీసు కమిషనర్ ఐ.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా డీజే సౌండ్‌ల వినియోగంపై కూడా అమల్లో ఉన్న నిషేధాజ్ఞలు పొడగించామని ఆయన తెలిపారు. ఈ నిబంధనలను అనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సాధారణ పౌరులు ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన వివరించారు.

సంపాదకీయం

తల్లికి 'వందనమే'

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టి ఆరు మాసాలు దాటింది. చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన 'అద్భుత ఆరు' పథకాలు ఇంకా పట్టాలెక్కనేలేదు. తాజాగా జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ పథకాలపై ఒక నిర్ణయం వెలువడుతుందని సర్వత్రా ఆశాభావం వ్యక్తం చేసినా, భంగపాటు తప్పలేదు. పైగా ఎంతో కీలకమైన అమ్మకు వందనం పథకం ఒక ఏడాది వాయిదాపడటం విద్యార్థుల విద్యాభవితకు తీవ్ర విఘాతం. విద్యాదీవెన, వసతిదీవెన పథకాలకు పేర్లు మారినా, వాటికింకా ప్రభుత్వ దీవెనలు లేకపోవడం ఒకింత బాధాకరమే. ఉన్నట్టుండి విద్యార్థిలోకం డోలాయమానంలో పడిపోవడం అనూహ్యమే. జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించాడనో, అతని పత్రిక ఏకిపారేసిందనో, విద్యార్థిసంఘాలు విరుచుకుపడ్డాయనో, సామాజిక మాధ్యమాలు చెలరేగిపోతున్నాయనో కాదు. అసలు వాస్తవమైతే అదే కదా!

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంచలన పథకాలకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత చంద్రబాబు ప్రభుత్వం వాటిని ఇంకో పేరుతో కొనసాగించక తప్పలేదు. కాకపోతే అమరావతిపై అధికంగా దృష్టిపెట్టడంవల్ల ఆ పథకాలు కాస్త గాడితప్పాయి. ఆ తర్వాత జగన్ వచ్చాక నవరత్నాలు పేరుతో ఇంకొన్ని పథకాలను ప్రవేశపెట్టారు. పథకాలే గెలిపిస్తాయన్న భ్రమలో 'పరిపాలన'ను పక్కనపెట్టడంతో మొన్నటి ఎన్నికల్లో 'ఏదో గాలి'లో ఆయన పార్టీ తుడిచిపెట్టుకుపోయింది. ప్రస్తుతం చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటినుంచి కేవలం 'రెండే రెండు' అంశాలకు ప్రాధాన్యతనిస్తూ 'ముందుకు పోతున్నారు'. ఆరు అద్భుతాలు (సూపర్ సిక్స్) పేరుతో ప్రకటించిన పథకాలకు ఇంకా విధివిధానాలే తయారుకాలేదు. ఏడాదిపాటు ఈ పథకాలు ఉండబోవని స్పష్టమైంది. అంటే 2024-25 ఆర్థిక సంవత్సరం 'సూపర్ సిక్స్' జీరో సంవత్సరమన్నమాట! మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లాంటివి పక్కనబెడితే, విద్యార్థులకు సంబంధించిన అమ్మ ఒడి (ఇప్పుడది అమ్మకు వందనం), విద్యాదీవెన (ఫీజు రీయింబర్స్‌మెంట్) వంటి పథకాలను సంవత్సరాల తరబడి వాయిదావేయడం విద్యార్థులను దెబ్బతీయడమే. జగన్ హయాంలోనే ఈ పథకాలకు ఒకటి రెండుసార్లు తూట్లుపడ్డాయి. కొన్ని విడతల డబ్బులు తల్లుల ఖాతాల్లో పడకపోవడం బాధించింది. ఇప్పుడు ఏకంగా విద్యాసంవత్సరం మొత్తాన్నే వాయిదా వేయడం మహాదారుణం. తల్లికి వందనం పథకం కింద ప్రతి ఒక్క విద్యార్థికీ 15 వేల రూపాయలను ఇవ్వాల్సి ఉంటుంది. 2023-24 విద్యాసంవత్సరంలో అంటే జగన్ కాలంనాటి అమ్మఒడి పథకం కింద 85 లక్షలమంది లబ్ధిదారులు ఉండేవారు. ఇప్పుడూ అటుఇటుగా అదే సంఖ్యలో లబ్ధిదారులున్నారు. అంటే 2024-25 విద్యాసంవత్సరంలో 1275 కోట్ల రూపాయలను కూటమి ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాలి. చంద్రబాబు కేబినెట్ తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం, వచ్చే జూన్ నుంచి తల్లికి వందనం పథకం అమలు చేయడమంటే, ఈ విద్యాసంవత్సరం మురిగిపోయినట్లే.

తల్లికి వందనం ఒక ఏడాది 'పోలవరం'లో కొట్టుకుపోగా, ఇప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి సంబంధించిన నాలుగు త్రైమాసిక ఫీజులు 'అమరావతి'లో కలిసిపోయాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు స్కాలర్‌షిప్ బకాయిలనూ కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక త్రైమాసిక ఫీజు ఎన్నికల కోడ్ వల్ల రాలేదు. కూటమి ప్రభుత్వం గడిచిన ఆరు నెలల్లో మూడు త్రైమాసిక ఫీజులు ఇవ్వకుండా ఎగ్గొట్టింది. అంటే మొత్తం నాలుగు త్రైమాసిక ఫీజులు సుమారు రూ.2,800 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. స్కాలర్‌షిప్‌లు రూ.1100 కోట్లు బకాయిపడ్డాయి. మొత్తం రూ.3,900 కోట్లు ఫీజులు చెల్లించకపోవడమంటే, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటమే. పైగా ఈ ఫీజుల చెల్లింపు ఎప్పుడుంటుందన్న విషయంపైనా స్పష్టత లేదు. ఫీజులు కట్టని కారణంగా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నాయి. మొత్తం ఫీజు చెల్లిస్తేనే ధృవీకరణ పత్రాలు ఇస్తామంటూ వేధిస్తున్నాయి. దీని వల్ల ఈ విద్యాసంవత్సరంలో 10 లక్షల మంది గ్రాడ్యుయేట్లకు సర్టిఫికెట్లు రాక వారి ప్లేస్‌మెంట్లు నిలిచిపోయాయి. ఇంతటి అన్యాయంపై ఎవరు మాట్లాడినా మాట్లాడకపోయినా కనీసం పవన్‌కళ్యాణ్ మాట్లాడుతారని విద్యార్థిలోకం ఆశిస్తోంది. కానీ 'పవర్‌స్టార్' సైతం మౌనం వహించారు. ఇంజినీరింగ్ విద్యార్థుల బాధలు వర్ణనాతీతం. పరీక్ష ఫీజులు చెల్లించాలంటే ముందుగా కళాశాల ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు వారిని బయటకు పంపించేస్తున్నాయి. తల్లిదండ్రులు, విద్యార్థుల నుంచి బలవంతపు అంగీకార పత్రాలు రాయించుకోవడం మరో విచారకరమైన నాటకీయ పరిణామం.

వెలుగులోకి రాని ఇంకో అంశమేమిటంటే, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పేరుతో ఇంటర్ విద్యార్థులకు 2025 జనవరి 1 నుంచి ఒక కొత్త పథకాన్ని అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఎట్టకేలకు అది జనవరి 4వ తేదీ నుంచి అమలు కావడానికి రంగం సిద్ధమైంది. అయితే ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలు మార్చి 1వ తేదీన ప్రారంభం కాబోతున్నాయి. అనంతరం వేసవి సెలవులు వస్తాయి. అంటే ఈ విద్యా సంవత్సరం ఈ పథకం కేవలం రెండు మాసాలు మాత్రమే అమలవుతుందని తేలిపోయింది. గత ఆరేడునెలల పుణ్యకాలం కాస్త గడిచిపోయింది. దాదాపు రెండు దశాబ్దాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఆ తర్వాత ఏర్పడిన ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కేవలం ఓట్ల కోసమేనని సర్వవిదితం. వారి చిత్తశుద్ధి ఏ మాత్రం ఉందనేది ఆ పథకాలు అరకొరగా అమలు జరుగుతున్న తీరు చూస్తేనే అర్థమవుతుంది. ముఖ్యంగా విద్యార్థులకు సంబంధించిన పథకాల విషయంలో సర్కార్లకు నిబద్ధత ఉండి తీరాల్సిందే. ఎందుకంటే, పథకం అమలును ఒక ఏడాది వాయిదావేస్తే, దాని విలువ 365 రోజులు మాత్రమే కాదు, ఒక విద్యాసంవత్సరం అని గ్రహించాలి. ఈ నిజం ప్రభుత్వ పెద్దలకు తెలియనిదికాదు. పథకాలపై రాజకీయాలు సరికాదు. ఒక్కసారి పథకం అమలయ్యాక, దాని ప్రభావం లబ్ధిదారులపై కొనసాగుతూనే ఉంటుంది. సంక్షేమ పథకాలను జగన్ పథకంగానో, చంద్రబాబు పథకంగానో చూడకుండా ఏపీ ప్రభుత్వ పథకంగా పరిగణించే రోజులు రావాలి. పథకాలను ఆపడం లేదా వాయిదా వేయడం, లేదా వాటికి విరామం ఇస్తూపోతే, జగన్‌కూ, చంద్రబాబుకూ, పవన్‌కల్యాణ్‌కు మధ్య తేడా ఏముంటుంది? అందరూ ఆ తాను ముక్కలేనని ప్రజలు భావించక తప్పదు.

సాహిత్యంలో కొత్తా దేవుళ్లు..

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

అవును. తెలుగు సాహిత్యంలో కొత్త దేవుళ్లు ప్రత్యక్షమయ్యారు. ఇంతకు ముందు వీరి జాడ లేదు. ఇదిగో ఈ మధ్యనే వీరు సరికొత్త పేర్లతో, మురిపించే నామములతో తెలుగు సాహిత్య ప్రవేశం చేశారు. వీరిని గతంలో ఎన్నడూ వినని, కనని సాహిత్య లోకం వారి వెంట పడుతోంది. ఈ కొత్తా దేవుళ్లకు తెలియకుండానే తమ సాహిత్య సంపదని ఇచ్చేస్తోంది. ఇంతకీ వారెవరంటే పబ్లిషర్లు. ఈ కొత్తా దేవుళ్లు ఈ మధ్యనే పబ్లిషర్స్ అవతారం ఎత్తి తెలుగు కథ, కవిత్వం, విమర్శలను రక్షించే పనిలోపడ్డారు. దేశభక్తి కంటే హీనమైన పాపానికి ఒడిగడుతూ తెలుగు కవులు, రచయితలను ఉద్ధరించే పనిలో చాలా బిజీగా గడుపుతున్నారు. తెలుగు సాహితీవేత్తలు ఏం చేయనక్కర లేదు. వారి వారి సాహిత్య సృష్టిలో బిజీగా ఉంటే చాలు. మిగిలిన పని ఈ పబ్లిషర్స్ చూసుకుంటారు. మీరు గుడికి వెళ్లి కొబ్బరికాయ, పువ్వులు ఇచ్చి దండం పెట్టుకుంటే చాలు... ఆ పూజారులు అష్టోత్తర, శత నామాలతో సహా అభిషేకం చేసి పుణ్యాన్ని నీ ఖాతాలో జమ చేసినట్లు ఈ పబ్లిషర్స్ కూడా ఇంచుమించు సరిసాటిగా అదే పని చేస్తున్నారు. తెలుగు సాహిత్యకారులవి బీద, బిక్కి బతుకులు కదా. నాలుగు అక్షరాలు రాయడం తప్ప నాలుగు రాళ్లు వెనుకేసుకోవడం రాదు కదా. వారి సాహిత్యాన్ని పాఠకులకు చేరవేయడం తెలియని వారు కదా. అదిగో, అలా చేరవేయడం రాదు కనుకనే "ఆ పనిని మేం చేస్తాం" అంటూ ముందుకొస్తున్నారు ఈ పబ్లిషర్లు. కవులు, రచయితల సాహిత్య సంపదని ప్రపంచానికి అందజేసే పనిలో ఈ పబ్లిషర్లు అనబడే వారంతా క్యూలో నిలబడి ఉంటారు. నువ్వు అలా పువ్వులు, కొబ్బరికాయ మీద చేయివేసి నీ సాహిత్య సృజనతో సంకల్పం చెప్పుకోవడమే... మిగిలిన తంతు అంతా ఈ పబ్లిషర్లు చాలా కష్టనష్టాలకు వోర్చి చేసేస్తారు. అంటే పళ్లెంలో అన్నం, కూర, పప్పు, కాసింత నెయ్యి వేసుకుని ఓ ముద్ద నోట్లో పెట్టుకునేందుకు సిద్ధమవుతుండగా ఈ పబ్లిషర్లు వచ్చేస్తారు. రెండో ముద్ద నుంచి వాళ్లే కలుపుతారు. వాళ్లే నీ నోట్లో పెడతారు. కాకపోతే నీ ఆకలి తీరదు అంతే. కాకపోతే నీకు మళ్లీ ఆకలేయదంతే. కాకపోతే నీకు చేతి చమురు వదలలేదంతే. వాళ్లకి మాత్రం అదేంటో ఆ చమురు దేదీప్యమానంగా వెలుగుతూ మరింత మందిని ఆకర్షించేంతగా వెలుగు ప్రసారమవుతుంది. తెలుగు కవులు, రచయితలు ఆ వెలుగు వచ్చిన వైపు ఆశగా పరుగులు తీస్తారు. అంతే దీపం పురుగులు తెలుసు కదా... అలా ఆ పబ్లిషర్స్ అనే వేడిని తట్టుకోలేక దీపం పురుగులు తమ రెక్కల్ని రాల్చుకుని తనువు చాలించినట్లుగా ఈ సాహితీవేత్తలు కూడా మిగిలిపోతున్నారు.

మహా రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి సినిమా రంగం వదిలేసి వచ్చేసిన తర్వాత "సినీ రంగం ఎలా ఉందండి" అని ఓ అభిమాని అడిగారట. దానికి రావిశాస్త్రి "మన పని మనల్ని చేయనివ్వరు. మన కాఫీ మనల్ని తాగనివ్వరు. మన రాతల్ని కూడా మనల్ని రాయనివ్వరు" అంటూ సమాధానం చెప్పారు. ఈ పబ్లిషర్లు కూడా అంతే. మన సృజనకారుల్ని వాళ్ల పని వాళ్లని చేయనివ్వడం లేదు. ఈ మధ్య ఓ కవి కవిత్వ సంకలనాన్ని అచ్చేసిన ఓ పబ్లిషర్ ఆ కవి కవిత్వానికి మరో ప్రముఖ కవి రాసిన ముందుమాటని వెనుక పేజీలో వేశారు. ఇదేమిటంటూ ఆ కవి అడిగితే... "ఈ ముందుమాటలో సంకలనం అమ్ముకునే కమర్షియల్ హంగులు లేవు. అందుకే వెనుక పేజీల్లో వేశాం" అని చెప్పారు. ఇలా ఉంది ఈ పబ్లిషర్ల తీరు. మన కవిత్వంపై ఆ పెద్దల అభిప్రాయాలను మనమే అడిగి రాయించుకున్నా అది ఈ పబ్లిషర్లకు నచ్చాలి. లేకపోతే "ఇదిగో ఇక్కడిదాకానే" మీకు పేజీల కేటాయింపు అంటున్నారు ఈ పబ్లిషర్లు. కవులు, రచయితలు తమ పుస్తకావిష్కరణను కూడా వారికి నచ్చినట్లుగా చేసుకుందుకు లేదు. దాన్నీ ఆ పబ్లిషర్లే డిజైన్ చేస్తున్నారు. ఆవిష్కరణ సభ ఎక్కడ, ఎలా, ఎన్నింటికి, ఎవరెవరి సమక్షంలో జరగాలో కూడా వారే నిర్ణేతలు. కార్పొరేట్ వ్యవస్థపై ఆగ్రహంతో కవిత్వం రాస్తున్న, చర్చిస్తున్న లోకమే ఆ కార్పొరేట్ పబ్లిషర్ల మాఫియా చేతుల్లోకి వెళ్లిపోవడం అంటే ఇదేనేమో!.

ఎవరైనా కవో, రచయితో తన పుస్తకం వేయమని పబ్లిషర్‌ని అడిగితే ఆ సాహిత్య కారుడికి వారిచ్చే గౌరవం కేవలం పది కాపీలు. లేదూ మరో పాతిక. ఈ సృజనకారుడికి అనేకానేక మంది సాహిత్య, సాహిత్యేతర బంధువులు. స్నేహితులు ఉంటారు కదా... వారికి ఓ కాపీ ఇవ్వాలంటే మళ్లీ వీళ్లే ఆ పబ్లిషర్ దగ్గర కొనుక్కోవాలి. బలే ఉంది కదా సాహిత్య మాఫియా. ఈ పబ్లిషింగ్ హౌస్‌లు వచ్చిన తొలిరోజుల్లో బలే మురిసిపోయారు. చాలా మంది తమ పుస్తకాలు వెలుగులోకి వస్తాయని ఆనందించిన వాళ్లు ఉన్నారు. ఇదిగో ఇప్పుడు అర్థం అవుతోంది ఈ సృజనకారుల పట్ల పెరిగిన ప్రేమ వ్యాపారం. ఇప్పుడు నడుస్తున్నది పబ్లిషర్ల యుగం. ఇప్పుడు వీస్తున్న గాలి పబ్లిషర్లు పీల్చి వదిలేస్తున్న గాలి. మనుషులకేం కాదు. సాహిత్య పర్యావరణానికే ఇది చేటు చేస్తుందేమో..! చూడాలి...!

సెల్: 99120 19929

వామపక్ష సెక్యులర్ శక్తుల బలమైన పోరు అవశ్యం

పి.సుధీర్

జాతీయ, అంతర్జాతీయ రంగాలలో 2024లో పరిస్థితులు అల్లకల్లోలంగా ఉన్నాయి. అయోధ్యలో అసంపూర్తిగా రామాలయాన్ని నిర్మించడంతో మతవాద బీజేపీ శక్తులు ఒక బలమైన స్థితికి చేరుకున్నాయి. బీజేపీ పాలకులు హిందురాష్ట్ర ఏర్పాటుకోసం అధికారం చేపట్టిన నాటి నుంచి వివిధ ఎత్తుగడలు వేస్తున్నాయి. నరేంద్ర మోదీ మూడవసారి అధికారం చేపట్టిన అనంతరం అంతరంగికంగా హిందురాష్ట్ర ఏర్పాటుకోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతిపక్షాలను అన్నివిధాలుగా అణచివేసేందుకు ఏమాత్రం వెనుకాడడంలేదు. ఇద్దరు ముఖ్యమంత్రులను అరెస్టు చేయించారు. అన్ని రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిటపెట్టుకున్నారు. ఈ దశలో మతశక్తులను ఎదుర్కొని రాజ్యాంగాన్ని, స్వాతంత్ర్యాన్ని కాపాడుకునేందుకు అన్ని ప్రతిపక్షాలు కలిసి బలమైన పోరాటం నిర్వహించాలి. ముఖ్యంగా వామపక్ష, ప్రజాస్వామిక శక్తులు కలిసికట్టుగా గ్రామస్థాయినుంచి పోరాటాన్ని రూపొందించుకోవాలి. 240 సీట్లను గెలుచుకున్న బీజేపీ రెండు ప్రాంతీయపార్టీల మద్దతుతో పాలిస్తున్నది. సరిపడినన్ని సీట్లు రాకపోయినంతమాత్రాన ప్రతిపక్షాలతో కూడిన ఇండియా ఐక్యసంఘటన బీజేపీని తక్కువగా అంచనా వేయకూడదు.

జమిలీ ఎన్నికలకోసం ముందుగానే ఏర్పాట్లు చేసుకున్న ప్రధాని మోదీ నిరంకుశ వైఖరితో తాను అనుకున్నది సాధించాలన్న పట్టుదలతో ఉన్నారు. హిందుత్వ-కార్పొరేట్ ఎజండాతో ముందుకు నడవాలని నిర్ణయించుకున్నారు. నయాఉదారవాద విధానాలు దేశ ప్రజలమీద మరింత భారంగా తయారుకానున్నాయి. ధరల పెరుగుదల, నిరుద్యోగం, అసమ్మతి, గ్రామీణ, పట్టణ పేదలలో మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షం బలోపేతమైతేనే నిరంకుశ మోదీ పాలనను ఎదుర్కొనే అవకాశం కలుగుతుంది. హిందూ నిరంకుశ శక్తులను దేశవ్యాప్తంగా ఎదుర్కోవడం అంతతేలిక కాదు. ఇప్పటినుంచే ప్రభుత్వ దుష్టవిధానాలను ఎదుర్కొనేందుకు సంసిద్ధం కావాలి. మోదీ ప్రభుత్వం బలహీనంగా ఉన్నదని భావించడానికి వీలులేదు. అన్నిరంగాలలోనూ హిందూ భావజాలాన్ని చొప్పించారు. విద్య, సామాజిక, సాంస్కృతిక రంగాలలో హిందూ భావజాలాన్ని విద్యార్థుల మనసుల్లో చొప్పిస్తున్నారు. పాఠ్యాంశాలను మార్చి వేస్తున్నారు. చరిత్రను తిరగదోడుతున్నారు. మసీదులను కూలగొట్టి వాటికింద ఆలయాలు ఉన్నాయని చెబుతున్నారు. వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులు తమ భావజాలంతో దిగువస్థాయిలో ప్రజలను చైతన్యం చేయాలి. 2024లో

మతతత్వ-కార్పొరేట్ శక్తుల మధ్య బంధం బలపడింది. మోదీ ప్రభుత్వంలో బడా కార్పొరేట్లు మరింత సంపదను సమకూర్చుకున్నారు. వ్యాపారాలలో అపారమైన లాభాలను పొందారు. ఇదంతా మోదీ ప్రభుత్వ మద్దతుమూలంగానే జరిగింది. అంబానీ, అదానీ, టాటా, బిర్లా, మిట్టల్ లాంటి ఐదు బడా కార్పొరేట్లు ఎనలేని సంపదను సమకూర్చుకున్నాయి. కార్పొరేట్ రంగంలోనే బడా వాణిజ్యవేత్తలు మొత్తం సంపదలో 26శాతం కలిగి ఉన్నారు. అన్ని రంగాలను ప్రైవేటీకరించేందుకు మోదీ గత 10ఏళ్లుగా కంకణం కట్టుకున్నారు. ఇప్పటికే విద్యుత్ పంపిణీరంగంలో డిస్కమ్‌లను ప్రైవేటీకరించారు. చండీఘడ్‌లో దీనిపై తీవ్ర పోరాటం జరుగుతోంది. కేంద్ర పాలితప్రాంతం చండీఘర్ ప్రభుత్వం నిర్వహిస్తున్న డిస్కమ్‌లకు అపారలాభాలు ఉన్నప్పటికీ వాటిని ప్రైవేటు వ్యక్తులకు అమ్మివేశారు. అలాగే లాభాలలో నడుస్తున్న ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్ లాంటి సంస్థలను అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. ఈ విధానాలను, వాటి ప్రభావాన్ని ప్రజలు ఏ మాత్రం ఎదుర్కొనే స్థితిలోలేరు. ప్రజావ్యతిరేక విధానాలను సవాలుచేస్తూ కార్మికవర్గం అనేక పోరాటాలను నిర్వహించింది.

> జమిలీ ఎన్నికలకోసం ముందుగానే ఏర్పాట్లు చేసుకున్న ప్రధాని మోదీ నిరంకుశ వైఖరితో తాను అనుకున్నది సాధించాలన్న పట్టుదలతో ఉన్నారు. హిందుత్వ-కార్పొరేట్ ఎజండాతో ముందుకు నడవాలని నిర్ణయించుకున్నారు. నయాఉదారవాద విధానాలు దేశ ప్రజలమీద మరింత భారంగా తయారుకానున్నాయి.

అంగన్‌వాడి, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలు, పోరాటాలు నిర్వహించారు. విశాఖపట్టణంలో స్టీలుప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు పూనుకున్న ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ సుదీర్ఘకాలంగా పోరాటం సాగిస్తున్నారు. విద్యుత్‌రంగ కార్మికులు, బొగ్గు కార్మికులు, పోస్టల్, బ్యాంకు, ఇన్సూరెన్స్ ఉద్యోగులు సమ్మెలు చేశారు. తమిళనాడు కాంచీపురంలో శామ్‌సంగ్ కంపెనీ కార్మికులు 37రోజులపాటు సమ్మె చేశారు. ఎట్టకేలకు ఈ సమ్మె విజయవంతమైంది. కార్మికుల శక్తిని బహుళజాతి కంపెనీ గుర్తించింది. సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు, సంయుక్త కిసాన్ మోర్చా కలిసికట్టుగా 37రోజుల సమ్మెను నిర్వహించాయి. వివిధ నేరాలు, మహిళలపై హింసాకాండ అత్యాచారాలకు నిరసనగా దేశవ్యాప్త ఆందోళనలు జరిగాయి. పరీక్షల నిర్వహణకు ముందే ప్రశ్నాపత్రాలు లీక్ కావడం వీటికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాటాలు చేయడం లాంటి ఘటనలు అనేకం జరిగాయి. జాతీయ విద్యావిధానం హీనంగా తయారైంది. ఇలాంటి వాటిపై 2025లోనూ పోరాటాలు జరగనున్నాయి. పలస్తీనా, గాజాపై ఇజ్రాయిల్ మారణకాండ సాగుతూనేఉంది. అయినప్పటికీ ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని అరికట్టి మారణకాండను నిలువరించడానికి సామ్రాజ్యవాద దేశాలు ఎంతమాత్రం ముందుకు రావడంలేదు. ఇజ్రాయిల్ దుర్మార్గాలు కొనసాగుతూనే ఉన్నాయి. పలస్తీనాను స్వతంత్రదేశంగా ఏర్పాటు చేసేందుకు అగ్రరాజ్యం అమెరికా తొలినుంచి అంగీకరించడంలేదు. ఇప్పటికైనా ప్రపంచదేశాలు కలిసికట్టుగా పలస్తీనాను స్వతంత్రదేశంగా ఏర్పాటుచేసేందుకు పూనుకోవాలి. లేకపోతే ఈ మారణకాండ కొనసాగుతూనే ఉంటుంది.

విప్లవాంకురం గదర్ పార్టీ

ఆర్వీ రామారావ్

మొదటి ప్రపంచ యుద్ధం 1914లో ప్రారంభమైన తరవాత గదర్ పార్టీకి చెందిన కొంతమంది సభ్యులు పంజాబ్ చేరుకుని దేశ స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటం కొనసాగించాలని ప్రేరేపించారు. వారు దొంగచాటుగా ఆయుధాలు చేరవేశారు. భారత్‌లో ఉన్న బ్రిటీష్ సైనికులను తిరుగుబాటు చేయాలని రెచ్చగొట్టారు. ఆ తరవాత వచ్చిన తిరుగుబాటును బ్రిటిష్ ప్రభుత్వం కర్కశంగా అణచివేసింది. లాహోర్ కుట్ర కేసు పర్యవసానంగా 42 మందికి మరణశిక్ష విధించారు. 1914 నుంచి 1917 వరకు గదర్ పార్టీ పోరాటం కొనసాగించింది. ఈ తిరుగుబాటుకు జర్మనీ, ఒట్టమాన్ సామ్రాజ్యం మద్దతు ఉండేది. ఈ రెండు పక్షాలూ బ్రిటిష్ వారికి వ్యతిరేకమే. గదర్ పార్టీ ఏర్పడడానికి ముందే అదే పేరుతో ఓ వారపత్రిక ఉండేది. ఆ గదర్ పత్రిక పేరుపైన అంగ్రేజీ రాజ్యానికి శత్రువు అన్న మాటలు ఉండేవి. దేశంలో తిరుగుబాటు లేవదీయడానికి "సాహసవంతులైన సైనికులు" కావాలి అని గదర్ పార్టీ ప్రకటించింది. "భారత్‌లో తిరుగుబాటు రగిలించడానికి వేతనం - మృత్యువు, మూల్యం "బలిదానం", పింఛన్ "స్వేచ్ఛ", యుద్ధ రంగం "భారత్" అని గదర్ పార్టీ ప్రచారం చేసేది. గదర్ పార్టీ నిజానికి మొదట్లో విదేశాల నుంచి మన దేశంలో విప్లవ కార్యకలాపాలు నిర్వహించేది. హిందువులు, సిక్కులు, ముస్లిం నాయకులు కలిసి 1913లో విదేశీ గడ్డపై గదర్ పార్టీ ఏర్పాటు చేశారు. అయితే భారత విప్లవకారులతో కలిసి పనిచేసేవారు.

గదర్ పార్టీ ప్రధాన కార్యాలయం శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉండేది. భాయ్ పరమానంద్, సోహన్ సింగ్ భక్న, హర్ దయాళ్, మహమ్మద్ ఇక్బాల్ షెదాయ్, కర్తార్ సింగ్ సరాభా, అబ్దుల్ హఫీజ్ మహమ్మద్ బర్కతుల్లా, సులేమాన్ చౌదరి, అమీర్ చౌదరి, రాస్బిహారీ బోస్, గులాబ్ కౌర్ మొదలైనవారు గదర్ ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారు. విదేశాల్లో ఉన్న భారతీయుల్లో విప్లవాగ్ని రగలడానికి బలమైన కారణమే ఉంది. 1910లో చాలామంది కార్మికులు మిల్లుల్లో పనిచేయడానికి వాషింగ్టన్, కాలిఫోర్నియా లాంటి చోట్లకు వెళ్లారు. అక్కడ భారతీయులపట్ల తీవ్ర వివక్ష చూపేవారు. తెల్లవారికన్నా తక్కువ వేతనం ఇచ్చేవారు. దేశం స్వతంత్రం అయితే తప్ప తమ పరిస్థితి మారదన్న అభిప్రాయం విదేశాల్లోని ఆ కార్మికులలో కలిగింది. ఇలా ఆగ్రహంతో ఉన్న భారతీయులు 1913లో ఒరెగావ్‌లోని అస్టోరియాలో సమావేశమై "పసిఫిక్ కోస్ట్ హింది సొసైటీ" ఏర్పాటు చేశారు. గదర్ వారపత్రిక ప్రారంభించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని హిందీ సొసైటీ కార్యాలయం "యుగాంతర్ ఆశ్రం" నుంచి సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే వారు తమ కార్యకలాపాలు నిర్వహించే వారు.

గదర్ కార్యకలాపాలు ప్రారంభం కావడానికి కనీసం 56 ఏళ్ల ముందు జరిగిన 1857నాటి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామాన్ని బ్రిటిష్ వారు గదర్ అంటే విప్లవం అనేవారు. భారత్‌కు స్వాతంత్ర్యం సంపాదించడం, బానిస సంకెళ్లు తెంచడం గదర్ లక్ష్యం. అందుకే తమ పత్రికకు గదర్ అన్న పేరు పెట్టారు. ఆ తరవాత వారి సంస్థ పేరే గదర్ అయింది. ఈ పార్టీది పూర్తిగా సెక్యులర్ వాదం అని సోహన్ సింగ్ భక్నా అనేవారు. ఆ తరవాత ఆయన పంజాబ్‌లో పెద్ద రైతునాయకుడయ్యారు. "మేం సిక్కులమూ కాము, పంజాబీలం కాము. దేశభక్తి మా మతం" అని ఆయన అనేవారు. "ప్రస్తుతానికి విప్లవం విదేశాలనుంచే ఉండొచ్చు. కానీ మా యుద్ధం బ్రిటిష్ ప్రభుత్వం మీదే. మా పేరేమిటి? గదర్. మా పనేమిటి? గదర్. తిరుగుబాటు ఎక్కడ? భారత్‌లో." గదర్ మొదటి సంచికలో కర్తార్ సింగ్ సరాభా ఇలా రాశారు. "త్వరలో కాగితాలు, సిరా స్థానంలో ఆయుధాలు వస్తాయి" అన్నారు. గదర్ పార్టీ ఏర్పడిన మరుసటి సంవత్సరమే తమ పార్టీలో వేలాదిమంది చేరినట్టు గదర్ నాయకులు చెప్పేవారు. ప్రపంచ వ్యాప్తంగా తమ పార్టీ శాఖలు ఉన్నాయనేవారు. వాంకూవర్, పోర్ట్‌లాండ్, అస్తోరియా, సెయింట్ జాన్, సాక్రమెంటో, శాక్టన్, పనామా, మణీలా, హాంగ్‌కాంగ్, షాంఘైలో కూడా గదర్ పార్టీ శాఖలు ఉండేవంటారు. గదర్ పత్రిక 2500 ప్రతులు గురుముఖి లిపిలో, 2200 ప్రతులు ఉర్దూ లిపిలో పంపిణీ అయ్యేవి. ఆరు నెలలు తిరిగే లోగా ఈ పత్రిక భారత్, చైనా, జపాన్, మణీలా, సుమత్ర, ఫిజీ, జావా, సింగపూర్, ఈజిప్ట్, పారిస్, దక్షిణాఫ్రికా, బ్రిటిష్ తూర్పు ఆఫ్రికాలో కూడా పంపిణీ అయ్యేది. గదర్ పార్టీ సభ్యుల్లో ఎక్కువ మంది బ్రిటిష్ ఏలుబడిలోని భారత సైన్యంలో పనిచేసినవారే.

ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, తూర్పు ఆసియాలోని దాదాపు ఎనిమిది వేలమందిని గదర్ పార్టీ పోరాటంకోసం సమీకరించగలిగింది. స్వదేశం తిరిగి వస్తున్న అనేకమందిని బ్రిటిష్ అధికారులు నిర్బంధించారు. వారు నౌకల్లో ఉండగానే పట్టుకున్నారు. అరెస్టు కాకుండా తప్పించుకున్నవారు భారత విప్లవకారులను సంప్రదించి 2015 ఫిబ్రవరి 21న భారత్ అంతటా తిరుగుబాటు లేవదీయాలని అనుకున్నారు. ముందు బ్రిటీష్ అధికారుల మీద దాడిచేస్తే తరవాత జనం బ్రిటిష్ వారి మీద తిరగబడతారనుకున్నారు. తమ తరఫున పోరాడడానికి సైనికులుగా చేర్చుకోవడానికి గదర్ నాయకులు వివిధ కంటోన్మెంట్లు కూడా సందర్శించారు. కానీ బ్రిటిష్ గూఢచారులు ఈ పథకాలన్నింటినీ వమ్ము చేయగలిగారు. గదర్ పార్టీతో ఉన్న వారిలో అనేకమంది తరవాత భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

గదర్ పార్టీ వారపత్రిక

బ్రిటిష్ వారి అణచివేతవల్ల గదర్ ఉద్యమం బలహీన పడింది. మొదటి ప్రపంచ యుద్ధం అంతంలో 1917లో గదర్ పార్టీ రెండు పాయలుగా చీలింది. ఒక వర్గం కమ్యూనిజం బాటపడ్తే మరోవర్గం సోషలిస్టుదారి అనుసరించింది. అయినా స్వాతంత్ర్య పోరాటంలో గదర్ పార్టీ అనేకమందికి స్ఫూర్తి కలిగించింది. భగత్ సింగ్ అలా ప్రేరేపితుడైన వారే. గదర్ పార్టీతో సంబంధం ఉన్న తెలుగువారిలో దర్శి చెంచయ్య ప్రముఖుడు. ఆయన కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో వ్యవసాయశాస్త్రం చదువుతుండగా భారత విప్లవకారుడు లాలా హర్ దయాళ్‌తో పరిచయం అయింది. చెంచయ్య కూడా గదర్ పార్టీలో చేరారు. దేశభక్తులం తామేనని పంజాబీలు భావించడం చెంచయ్యకు నచ్చేదికాదు. ఎవరికైనా దేశభక్తి ఉండొచ్చుననేవారు.

పట్టాలపై పబ్జీ ఆట...

ముగ్గురు యువకుల దుర్మరణం

పాట్నా: రైలు పట్టాలపై కూర్చొని పబ్జీ ఆడుతుండగా రైలు ఢీకొనడంతో ముగ్గురు యువకులు మృతిచెందారు. ఈ ఘటన బీహార్‌లో చోటుచేసుకుంది. పాట్నాలోని పశ్చిమ చంపారన్ జిల్లాకు చెందిన ముగ్గురు యువకులు నార్కటియాగంజ్-ముజఫర్‌పూర్ రైల్వే మార్గంలో పట్టాలపై కూర్చొని పబ్జీ ఆడుతుండగా అదే మార్గంలో వచ్చిన రైలు వారిపై నుంచి దూసుకువెళ్లింది. దీంతో వారు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. యువకులు ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని ఉండడం వల్ల తమవైపు వస్తున్న రైలును గమనించకపోవడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. మృతులను ఫర్కాన్ ఆలం, సమీర్ ఆలం, హబీబుల్లా అన్సారీగా గుర్తించామన్నారు. కేసు విచారణ కొనసాగుతోందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా బహిరంగ ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత గురించి తల్లిదండ్రులు, అధికారులు పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు.

దిల్లీ ఎన్నికలకు బీజేపీ అధ్యక్షుడు దూరం

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ దిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ పోటీ చేసే అవకాశాలు లేవని తెలుస్తోంది. దిల్లీలో ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగుతాయి. ఇప్పటికే అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పూర్తి అభ్యర్థుల జాబితా విడుదల చేసింది. మరోవైపు బీజేపీ ఇప్పటి వరకు ఒక్క జాబితా కూడా విడుదల చేయలేదు. సచ్‌దేవ పోటీ అంశంపై చర్చ జరుగుతుండగా... ఆయన ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే... దీనిపై స్పష్టత లేదు. మరోవైపు ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. దిల్లీలో ఓటర్లకు బీజేపీ నగదు పంపిణీ చేస్తోందని ఆప్ ఆరోపిస్తోంది. ఈ మేరకు ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్‌కు ఇటీవల లేఖ రాశారు. ఈ లేఖపై బీజేపీ స్పందిస్తూ... మీడియా దృష్టిని ఆకర్షించడం కోసం భగవత్‌కు లేఖ రాయడానికి బదులు ఆ సంస్థ నుంచి సేవా స్ఫూర్తిని నేర్చుకోవాలని కేజ్రీవాల్‌కు హితవు పలికింది.

మార్గదర్శి సావిత్రీబాయి పూలే: మోదీ

న్యూఢిల్లీ: మహిళా సాధికారతలో సావిత్రీబాయి పూలే మార్గదర్శి అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమెకు ప్రధాని శుక్రవారం నివాళులర్పించారు. ఆమె విద్య, సామాజిక సంస్కరణల రంగంలో అగ్రగామి, మహిళా సాధికారతలో మార్గదర్శి అని ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడంలో ఆమె స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. 1831లో మహారాష్ట్రలో జన్మించిన ఆమె సంఘసంస్కర్త జ్యోతీరావు పూలేను వివాహం చేసుకున్న తర్వాత మహిళల కోసం ప్రత్యేకంగా పాఠశాలను ప్రారంభించారు. మహిళలకు విద్య అందించడంలో విశేష కృషి చేశారు. భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా నిలిచారు.

ఆప్ హయాంలో 24 ఆలయాల కూల్చివేత: బీజేపీ

న్యూఢిల్లీ: ప్రార్థనా మందిరాల కూల్చివేతకు బీజేపీ ఆదేశాలిచ్చిందంటూ దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ చేసిన ఆరోపణలపై బీజేపీ శుక్రవారం స్పందించింది. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం 2016-2023 మధ్య 24 ఆలయాలు కూల్చేసిందని ఎదురుదాడికి దిగింది. ఆలయాలు కూల్చేందుకు కేజ్రీవాల్ 'ఫత్వాలు' జారీ చేసినట్లు బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాల్ చెప్పారు. 'మీడియా ద్వారా ప్రజాక్షేత్రంలో ఉన్న పత్రాలు చూస్తే దేశాన్ని, ప్రపంచాన్ని మోసం చేసిన పార్టీల్లో ఆప్‌ను మించిన పార్టీ లేదని అర్థమవుతుంది. ఇతరులను విమర్శిస్తున్న వారి సొంత చరిత్ర ఏమిటి? 2016 నుంచి 2023 వరకూ సంతకాలతో కూడిన డాక్యుమెంట్లు చూస్తే సుమారు 24 కట్టడాలు కూల్చివేయడానికి ఆప్ ముఖ్యమంత్రి, మంత్రులు ఫత్వాలు జారీ చేసినట్లు స్పష్టమవుతుంది' అని పూనావాలా అన్నారు. 2016లో 8 ఆలయాలు కూల్చేందుకు అప్పటి హోం మంత్రి సత్యేంద్రజైన్ సంతకంతో ఆదేశాలు ఇచ్చారని, కానీ ఎలాంటి చారిత్రక ప్రాధాన్యత లేని రెండు మసీదులను పరిరక్షించేందుకు ఆయన జోక్యం చేసుకున్నారని అన్నారు. దేశంలోనే 'ఆప్' అతిపెద్ద హిందూ వ్యతిరేక పార్టీ అని పూనావాలా విమర్శించారు. ఆప్ భాగస్వామ్య పార్టీలైన డీఎంకే, టీఎంసీ, వామపక్షాలు, కాంగ్రెస్ ఎప్పుడూ సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడతారని, దీనిపై ఆప్ మాత్రం స్పందించదని, ఇప్పుడు పూజారులకు పరిహారం ఇస్తామని ఆప్ మాట్లాడుతోందని అన్నారు.

ఫడ్నవీస్ చర్యలు అభినందనీయం: రౌత్

ముంబై: అసెంబ్లీ ఎన్నికల తర్వాత మహారాష్ట్ర రాజకీయాలు శాంతించినట్లు కనబడుతోంది. ఓ వైపు నిట్టనిలువున చీలిన శరద్ పవార్ కుటుంబం తిరిగి కలిసే అవకాశముందని ప్రచారం జరుగుతుండగా... ఇండియా కూటమిలో భాగమైన శివసేన(ఉద్ధవ్) పార్టీ కీలక నేత సంజయ్ రౌత్ ... సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌పై తాజాగా ప్రశంసలు కురిపించడం హాట్‌టాపిక్‌గా మారింది. గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టుల లొంగుబాటు కోసం ఫడ్నవీస్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని రౌత్ అన్నారు. మీడియాతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 'గతంలో మేం ఫడ్నవీస్‌తో కలిసి పనిచేశాం. మా సంబంధాలు కొనసాగుతాయి. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతమైన గడ్చిరోలి విషయంలో ఫడ్నవీస్ తీసుకుంటున్న చర్యలు బాగున్నాయి'అని రౌత్ ప్రశంసించారు. ఇటీవల కోట్ల రూపాయల రివార్డులున్న మావోయిస్టు అగ్రనేతలు స్వయంగా ఫడ్నవీస్ ముందే లొంగిపోయిన విషయం తెలిసిందే.

వణుకుతున్న ఉత్తరాది

200 విమానాలు, రైళ్లు ఆలస్యం

న్యూఢిల్లీ: చలి తీవ్రతతో ఉత్తర భారతం వణుకుతోంది. కొన్ని రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయి మంచు దట్టంగా కురుస్తోంది. పొగమంచు కారణంగా విమాన, రైల్వే సేవలకు ఆటంకం కలిగింది. 200కు పైగా విమానాలు, రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. భారత వాతావరణ విభాగం డేటా ప్రకారం... దిల్లీలో గత 24 గంటల్లో 16 డిగ్రీల గరిష్ఠ, 7.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించలేనంతగా పొగమంచు కమ్మేసింది. దిల్లీ విమానాశ్రయంలో విజిబిలిటీ 50 మీటర్లకు తగ్గిపోయింది. జనవరి 8వ తేదీ వరకు దేశ రాజధానిలో మంచు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ మధ్య తేలికపాటి వర్షాలు కూడా పడొచ్చని తెలిపింది. దీంతో దిల్లీకి ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. సర్వీసులు రద్దు, ఆలస్యమయ్యే సూచనలు కన్పిస్తున్న నేపథ్యంలో ప్రయాణికులు ఓసారి షెడ్యూల్ చూసుకొని బయలుదేరాలని విమానయాన సంస్థలకు ప్రకటన విడుదల చేశాయి. ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కన్పించింది. చలిగాలుల దృష్ట్యా నోయిడాలోని అన్ని స్కూళ్లలో 8వ తరగతి వరకు సెలవులు ప్రకటించారు. బీహార్, పంజాబ్, రాజస్థాన్, హర్యానాలోనూ దట్టంగా మంచు కురుస్తోంది.

రాజస్థాన్‌లోని ఫతేపూర్‌లో గత 24 గంటల్లో 3.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, విజిబిలిటీ సున్నాకి తగ్గడంతో 200 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రకటించింది. దిల్లీ, లక్నో, బెంగళూరు, అమృతసర్, గువహతి మీదుగా దట్టమైన పొగమంచు కొనసాగుతోందని, దీంతో అనేక విమానాలు ప్రభావితమైనట్లు స్పైస్‌జెట్, ఇండిగో, ఎయిర్ ఇండియా ప్రకటించాయి. దిల్లీ నుండి వెళ్లే సుమారు 24 రైళ్లు ఆలస్యమైనట్లు రైల్వే శాఖ ప్రకటించింది. అయోధ్య ఎక్స్‌ప్రెస్, గోరఖ్‌ధామ్, బీహార్ క్రాంతి ఎక్స్‌ప్రెస్, శ్రమశక్తి ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా నడుస్తున్నాయి..

జీఎస్టీ వసూళ్ల క్షీణతపై కాంగ్రెస్ ఆందోళన

ఆర్థిక వ్యవస్థ సంక్లిష్టతలపై దృష్టి సారించాలని ప్రభుత్వానికి సూచన

న్యూఢిల్లీ: జీఎస్టీ వసూళ్లు మందగించడంపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. పాప్‌కార్న్‌పై పన్ను విధించే బదులు ఆర్థిక వ్యవస్థ యొక్క సంక్లిష్టతలపై దృష్టి పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "తక్కువ వినియోగం - తక్కువ పెట్టుబడి - తక్కువ వృద్ధి - తక్కువ వేతనాలు" అనే వినాశకర చక్రంలో భారత ఆర్థిక వ్యవస్థ కూరుకుపోయిందని జైరామ్ పేర్కొన్నారు. వృద్ధి క్షీణత నుండి పేలవమైన జీఎస్టీ రాబడి వరకు ఆర్థిక రంగానికి సంబంధించిన వార్తలు నిరాశపరుస్తున్నాయని తెలిపారు. వచ్చే నెలలో సమర్పించనున్న కేంద్ర బడ్జెట్, దేశంలోని పేదలకు ఆదాయం పెంచే విధంగా ఉండాలని, మధ్యతరగతి వర్గాలకు పన్ను మినహాయింపును అందించాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తన న్యాయ పత్రలో పేర్కొన్నవిధంగా సరళమైన పన్నులతో కూడిన ఉత్తమ జీఎస్‌టి 2.0ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జైరామ్ కోరారు. ప్రైవేట్ పెట్టుబడులను అడ్డుకునే, పారిశ్రామికవేత్తల పారిపోవడానికి దారితీసే పన్ను, దర్యాప్తు ఏజెన్సీ ఉగ్రవాదం అంతం కావాలన్నారు. గత డిసెంబరులో వెల్లడైన జీఎస్టీ వసూళ్లు... తీవ్ర నిరాశ కలిగించాయని... గత మూడున్నరేళ్లలో రెండవసారి అత్యంత తక్కువగా నమోదయ్యాయని పేర్కొన్నారు. 'నికర జీఎస్టీ వసూళ్లు, రీఫండ్‌ల కోసం సర్దుబాటు చేసిన తర్వాత 3.3 శాతం వృద్ధి రేటుకు పడిపోయాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇది అత్యంత కనిష్ఠ స్థాయిగా రమేశ్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి మూడు త్రైమాసికాల్లో ప్రభుత్వం జీఎస్టీ వసూళ్లలో 8.6 శాతం వృద్ధిని నమోదు చేసిందని, గ్రామీణ వేతనాలు నిలిచిపోయి, వినియోగం మందగమనంలో ఉన్న సమయంలో ఉపాధి హామీ పథకం వంటి సామాజిక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం మరింత తగ్గించడాన్ని సమర్థించలేమని ఆయన అన్నారు. ప్రభుత్వ వ్యయాన్ని ఆర్థిక వ్యవస్థకు ఉద్దీపనగా ఉపయోగించాలని జైరామ్ స్పష్టం చేశారు.

విద్యా వ్యవస్థ రూపురేఖలు మార్చాం

దిల్లీ సీఎం ఆతిశీ

న్యూఢిల్లీ: దిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా విప్లవం విద్యావ్యవస్థను మార్చిందని, పిల్లలకు ఇప్పుడు అవకాశాల కొరత లేదని దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ శుక్రవారం అన్నారు. జిల్‌మిల్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన తరగతుల బ్లాకును ప్రారంభించిన అనంతరం ఆతిశీ మాట్లాడుతూ ఇక్కడ చదువుతున్న చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు విరజిమ్మడం చూస్తుంటే కొత్త భవనం ప్రాధాన్యత ఏమిటో అర్థమవుతోందన్నారు. కొత్తగా ప్రారంభించిన బ్లాక్‌లో 45 గదులు ఉన్నాయి. 25 తరగతి గదులు, మూడు రకాల మైక్రోస్కోప్‌లు సహా ఆధునిక ఉపకరణాలతో కూడిన ఆరు అధునాతన ప్రయోగశాలలు ఉన్నాయి. ఈ సౌకర్యాలు జీవశాస్త్రం వంటి అంశాలను మరింత క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికి, వైద్యం, ఇంజినీరింగ్ వంటి రంగాలలో వృత్తిని కొనసాగించడానికి వీలు కల్పిస్తాయని ఆమె చెప్పారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వర్షాకాలంలో తరగతి గదులు, మైదానాలు జలమయమై తరగతులకు వెళ్లలేని పరిస్థితి ఉండేదని, ల్యాబ్‌లు, లైబ్రరీలు, క్రీడా మైదానాలు వంటి సౌకర్యాలు కేవలం కలగానే ఉండేవన్నారు.

కోల్‌కతాలో పాఠశాల ఉద్యోగ అభ్యర్థుల నిరసన

కోల్‌కతా: నియామక పరీక్షలో ఉత్తీర్ణత సాధించినప్పటికీ న్యాయపరమైన చిక్కుల కారణంగా తమకు ఉద్యోగం లభించలేదని, త్వరగా నియామకాలు జరపాలని కోరుతూ వందలాది మంది పాఠశాల ఉద్యోగ ఔత్సాహికులు శుక్రవారం పశ్చిమ బెంగాల్ విద్యాశాఖ ప్రధాన కార్యాలయం 'బికాష్ భవన్' ముందు ధర్నా చేశారు. 25 వేలకు పైగా ఖాళీ పోస్టుల కోసం 2016లో 23 లక్షల మంది అభ్యర్థులు రాష్ట్రస్థాయి ఎంపిక పరీక్ష (ఎస్‌ఎల్‌ఎస్‌టీ)కు హాజరయ్యారు. 25,753 మందికి నియామక లేఖలు జారీ చేయగా, గత ఏడాది ఏప్రిల్‌లో కలకత్తా హైకోర్టు వారి నియామకం చెల్లదని ఉత్తర్వులు ఇచ్చింది. అనంతరం ఈ ఉత్తర్వులపై స్టే విధించిన సుప్రీంకోర్టు... దీనిపై విచారణ జరుపుతామని తెలిపింది. '25,753 మంది అభ్యర్థుల్లో ఎక్కువ మంది ఎస్‌ఎల్‌ఎస్‌టీ 2016 పరీక్షల్లో అర్హత సాధించారు. అయితే, న్యాయపరమైన సమస్యల కారణంగా వారు అనిశ్చిత భవిష్యత్‌ను ఎదుర్కొంటున్నారు. రోజులు, నెలలు గడిచిపోయాయి. మేము ఎంతకాలం వేచి ఉంటాం? అనిశ్చితి ముగిసి ఉద్యోగంలో చేరాలని కోరుకుంటున్నాం' అని నిరసనకారులలో ఒకరు ఉజ్వల్ సమంత విలేకరులతో అన్నారు. 25 వేల మంది అభ్యర్థుల్లో కొంతమంది అన్యాయమైన మార్గాన్ని అనుసరించారని ఆరోపణలు ఎదుర్కొన్నారని, అయితే అందరూ అనిశ్చిత భవిష్యత్‌ను ఎదుర్కొంటున్నారని మరో అభ్యర్థి మీనాక్షి ధార అన్నారు. సాల్ట్‌లేక్‌లోని కరుణామోయి క్రాసింగ్ నుంచి బికాశ్ భవన్ వైపు ప్రదర్శన చేసిన నిరసనకారులను భవనం ముందు పోలీసులు అడ్డుకున్నారు. సీనియర్ పాఠశాల విద్యాశాఖ అధికారులను కలిసేందుకు అభ్యర్థుల ప్రతినిధులలో ఆరుగురిని అనుమతించారు.

కాగా, ఈ నెలలో ఈ కేసు మళ్లీ సుప్రీం కోర్టు ముందుకు రానుందని పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 'విషయం న్యాయ స్థానంలో ఉన్నందున... మేము న్యాయస్థానం సలహా, ఆదేశాల ప్రకారం వెళతాం' అని తెలిపారు. కోల్‌కతా నడిబొడ్డున ఉన్న ఎస్ప్లనేడ్ ప్రాంతంలో మరో వర్గం అభ్యర్థులు నిరసన ప్రదర్శనలు నిర్వహించడంతో కొంత సేపు వాహనాల రాకపోకలపై ప్రభావం పడింది.

దేరా బాబాకు 'సుప్రీం' నోటీసులు

న్యూఢిల్లీ: దేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్(దేరా బాబా)కు సుప్రీంకోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. 2002లో జరిగిన దేరా మాజీ మేనేజర్ రంజిత్ సింగ్ హత్య కేసులో గుర్మీత్‌తో పాటు మరో నలుగురికి అత్యున్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. ఆ కేసు నుంచి గుర్మీత్ పేరును తొలగించాలని పంజాబ్, హర్యానా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సీబీఐ సవాల్ చేసింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు నోటీసు జారీకి ప్రాధాన్యం సంతరించుకుంది. జస్టిస్ బేలా ఎం త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారిస్తున్నదని చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం తెలిపింది.

బేలా త్రివేది బెంచ్ ముందుకు ఈ కేసును పంపనున్నట్లు చెప్పారు. హర్యానాలోని కురక్షేత్రలో ఉన్న ఖాన్పుర్ కాలనీలో 2002, జూలై 10న రంజిత్ సింగ్ హత్యకు గురయ్యాడు. అనేక మంది మహిళలపై గుర్మీత్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు రాసి ఉన్న ఓ లేఖను రంజిత్ సింగ్ సర్క్యులేట్ చేసినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆ మర్డర్ కేసులో పంచకుల సీబీఐ కోర్టు 2021లో రామ్ రహీమ్‌తో పాటు మరో నలుగురిని దోషులుగా ప్రకటించింది. ఈ ఐదుగురికి జీవితఖైదు శిక్ష విధించింది. వీరంతా జైలుశిక్ష అనుభవిస్తున్నారు. గుర్మీత్‌కు 31 లక్షల జరిమానా కూడా వేసింది.

బీహార్ విద్యార్థులకు అండగా ఉంటాం: రాహుల్

న్యూఢిల్లీ: బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) అభ్యర్థుల నిరసనకు కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం సంఘీభావం ప్రకటించారు. విద్యార్థుల హక్కుల కోసం జరిగే పోరాటంలో అండగా ఉంటామని అన్నారు. 'ప్రభుత్వ నియామకాల్లో వైఫల్యం పెద్ద అన్యాయం. మొదటి రిక్రూట్‌మెంట్ ప్రకటించలేదు. రిక్రూట్‌మెంట్ ప్రకటించినా సకాలంలో పరీక్షలు నిర్వహించడం లేదు. ఒకవేళ పరీక్షలు నిర్వహించినా ప్రశ్నపత్రాలు లీకవుతున్నాయి. న్యాయం కోరిన యువత గొంతుకను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నారు' అని రాహుల్ సోషల్‌మీడియా ఎక్స్‌లో విమర్శించారు. మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో అవతవకలకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన ఇద్దరు విద్యార్థులను అరెస్ట్ చేశారని గుర్తుచేశారు. డిసెంబర్ 13న నిర్వహించిన బీపీఎస్సీ పరీక్షా పేపర్ లీకైందని, పరీక్షను మళ్లీ నిర్వహించాలని విద్యార్థులు కొన్ని రోజులుగా ఆందోళన చేపడుతున్న సంగతి తెలిసిందే. విద్యార్థులకు మద్దతుగా శుక్రవారం తెల్లవారుజామున పూర్నియా ఎంపి పప్పుయాదవ్ మద్దతుదారులు సచివాలయ్ హాల్ట్ రైల్వేస్టేషన్‌లో రైల్ రోకో చేపట్టారు. రైల్‌రోకోను పోలీసులు అడ్డుకున్నారు.

డీఎంకే ఎంపీ ఇంట్లో ఈడీ సోదాలు

చెన్నై: డీఎంకే ఎంపీ కదిర్ ఆనంద్ ఇంటితో పాటు ఆయనకు చెందిన ఇతర ప్రదేశాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోదాలు చేస్తోంది. వెల్లూరు జిల్లాలోని కదిర్ ఆనంద్ నివాసంలో శుక్రవారం ఉదయం ప్రారంభమైన సోదాలు కొనసాగుతున్నాయి. ఎంపీ సన్నిహితులు, బంధువుల ఇళ్లల్లోనూ ఈడీ సోదాలు చేస్తోంది. ఐటీ శాఖకు పన్ను ఎగవేసిన కేసులో గతంలో ఆనంద్ దగ్గరి బంధువుల ఇళ్లలో రూ.11.48 కోట్ల నగదు పట్టుబడింది. ఈ వ్యవహారంలోనే ఈడీ సోదాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ డబ్బులు ఓటర్లకు పంచిపెట్టేందుకే దాచారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో 2019లో ఆనంద్‌తో పాటు అతని బంధువులపై క్యాష్ ఫర్ ఓట్ స్కామ్ కేసు నమోదైంది. ఈ కేసులో అప్పటి రాష్ట్రపతి కోవింద్ ... కదిర్ ఆనంద్ ఎన్నికను రద్దు చేశారు. తిరిగి నిర్వహించిన ఉప ఎన్నికల్లో ఆనంద్ మళ్లీ ఎంపీగా గెలిచారు. గతేడాది జరిగిన లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో ఆనంద్ ఏకంగా రెండు లక్షలకుపైగా భారీ మెజారిటీతో గెలుపొందారు. డీఎంకే సీనియర్ నేత దురైమురుగన్ కుమారుడే కదిర్ ఆనంద్.

సహజవాయువు కేటాయింపుల్లో కోత

న్యూఢిల్లీ: ఎల్పీజీ (వంట గ్యాస్) ఉత్పత్తికి ఉపయోగించే సహజ వాయువు కేటాయింపును కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. ఆ మేరకు సిఎన్‌జీ/పైపు ద్వారా సరఫరా చేసే వంట గ్యాస్ అవసరాల కోసం ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్, అదానీ-టోటల్ గ్యాస్ లిమిటెడ్ వంటి నగర గ్యాస్ రిటైలర్లకు తక్కువ ధరకు లభించే ఈ ఇంధనాన్ని మళ్లించినట్లు అధికారిక ఉత్తర్వు వెల్లడించింది. తక్కువ ఉత్పత్తి కారణంగా బంగాళాఖాతంలోని ముంబై హై, బస్సేన్ వంటి క్షేత్రాల నుండి వచ్చే చౌక సహజ వాయువును గత ఏడాది అక్టోబర్, నవంబర్‌లో నగర గ్యాస్ రిటైలర్లకు ప్రభుత్వం గ్యాస్ కేటాయింపును 40 శాతం వరకు తగ్గించింది. దీంతో సిటీ గ్యాస్ రిటైలర్లు సీఎన్‌జీ ధరలను కిలోకు రూ. 2-3 పెంచడానికి దారితీసింది. కోల్పోయిన వాల్యూమ్‌లను అధిక ధర కలిగిన ఇన్‌పుట్ ఇంధనంతో భర్తీ చేయడంతో ధర మరింత పెరుగుతుందని బెదిరించారు. డీజిల్ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలతో పోల్చినప్పుడు సీఎన్‌జీ ధరల పెంపు తక్కువ గా ఉంది. దీనిని పరిష్కరించడానికి, పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ డిసెంబరు 31 నాటి ఆర్డర్‌లో భూగర్భం, సముద్రగర్భం నుండి ఉత్పత్తి చేయబడిన కొన్ని గ్యాస్ కేటాయింపులను పునరుద్ధరించింది. ఎల్పీజీ ఉత్పత్తి కోసం ప్రభుత్వ యాజమాన్యంలోని గెయిల్ , ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జిసి)కి సరఫరా చేసే గ్యాస్‌ను తగ్గించాలని మంత్రిత్వ శాఖ ఆదేశించింది మరియు ఆ వాల్యూమ్‌లను సిటీ గ్యాస్ సంస్థలకు మళ్లించింది.

వైద్య సీట్లు ఖాళీగా ఉండకూడదు

కేంద్రానికి సూచించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: వైద్య కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉండకూడదని, దీనిపై రాష్ట్రాలు సహా సంబంధిత భాగస్వాములందరితో సమావేశం నిర్వహించాలని, ఈ అంశంపై నియమించిన కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీం కోర్టు శుక్రవారం కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ఈ వ్యాజ్యాన్ని విచారిస్తున్నప్పుడు 'సీట్లు ఖాళీగా ఉండకూడదు' అని పేర్కొంది. ఏప్రిల్, 2023లో వైద్య కోర్సుల్లో సూపర్ స్పెషాలిటీ సీట్లు భర్తీ చేయకుండా మిగిలిన అంశాన్ని సుప్రీం కోర్టు ఎత్తి చూపింది. సమస్యను పరిష్కరించడానికి ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ అధ్యక్షతన రాష్ట్రాలు, ప్రైవేటు వైద్య కళాశాలల ప్రతినిధులు సహా భాగస్వాములందరితో కూడిన కమిటీని నియమించాలని కేంద్రం ప్రతిపాదించింది. కాగా, శుక్రవారం కేంద్రం తరపు న్యాయవాది మాట్లాడుతూ భాగస్వాములందరితో కమిటీని ఏర్పాటు చేశామని, ఈ అంశంపై సిఫార్సులు ఇచ్చామని చెప్పారు. దీంతో ఈ సమావేశాన్ని కేంద్రం నిర్వహించాలని ధర్మాసనం ఆదేశించింది. మూడు నెలల్లోగా పూర్తి చేయాలని ఆదేశిస్తూ... తదుపరి విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేసింది.

మన్మోహన్‌కు ఘన నివాళి

న్యూఢిల్లీ: దివంగత నేత, మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌కు నివాళిగా శుక్రవారం ఇక్కడ ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన 'అఖండ్ పథ్' (ప్రార్థనా సమావేశం)కు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ హాజరయ్యారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణించిన తర్వాత 'ఎక్స్'లో ఖర్గే స్పందిస్తూ 'నిస్సందేహంగా చరిత్ర మిమ్మల్ని దయతో తీర్పునిస్తుంది. డాక్టర్ మన్మోహన్ సింగ్ జీ! మాజీ ప్రధాని మరణంతో భారతదేశం ఒక దూరదృష్టిగల రాజనీతిజ్ఞుడిని, అభిశంసించలేని సమగ్రతను, అసమానమైన ఆర్థిక వేత్తను కోల్పోయింది' అని అన్నారు. డిసెంబరు 26న మరణించిన మాజీ ప్రధానికి పెద్ద సంఖ్యలో శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులతో పాటు ప్రముఖులు నివాళులర్పించారు. సోనియా గాంధీ మన్మోహన్ సింగ్‌ను 'స్నేహితుడు, తత్వవేత్త, మార్గదర్శకుడు' అని అన్నారు. 'డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణంతో వివేకం, గొప్పతనం, వినయానికి ప్రతిరూపమైన, మన దేశానికి హృదయపూర్వకంగా, మనస్ఫూర్తిగా సేవ చేసిన నాయకుడిని మనం కోల్పోయాం. కాంగ్రెస్ పార్టీకి ప్రకాశవంతమైన, అతని ప్రియమైన మార్గదర్శక కాంతి, ఆయన కరుణ, దృష్టి లక్షలాది మంది భారతీయుల జీవితాలకు బలం చేకూర్చింది' అని సోనియా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రార్థనా సమావేశంలో సింగ్ భార్య గురుశరణ్ కౌర్ సిక్కు గ్రంథాల నుంచి 'షాబాద్ (పద్య)' పఠించారు. సింగ్ కోసం అధికారిక ప్రార్థన సమావేశం శుక్రవారం తర్వాత గురుద్వారా రకాబ్ గంజ్‌లో జరుగుతుంది. మన్మోహన్ సింగ్ 2004 నుంచి 2014 వరకు దేశాన్ని ప్రధాన మంత్రిగా నడిపించారు. భారతదేశ ఆర్థిక సరళీకరణ, సంస్కరణల రూపశిల్పిగా పరిగణించబడ్డారు. సోనియాగాంధీ మాటల్లో చెప్పాలంటే, 'డాక్టర్ మన్మోహన్ సింగ్ తాను నిర్వహించే ప్రతి అత్యున్నత పదవికి ప్రతిభను, ప్రత్యేకతను తెచ్చిపెట్టారు. భారతదేశానికి గౌరవాన్ని తెచ్చారు'.

ఐదేళ్లలో కాలుష్య రహిత దిల్లీ: గడ్కరీ



న్యూఢిల్లీ: రాబోయే ఐదేళ్లలో దిల్లీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు రూ.12,500 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.కాలుష్యాన్ని తగ్గించడానికి రహదారుల మంత్రిత్వశాఖ ఏయే ప్రాజెక్టులను ప్రారంభించబోతుందో ఆయన వివరించారు. వాయు కాలుష్యం, ట్రాఫిక్ జామ్‌లతో దిల్లీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రధాని మోదీ నాయకత్వంలో దిల్లీని ఆయా సమస్యల నుంచి గట్టెక్కించేందుకు ప్రాజెక్టులను ప్రారంభించిందన్నారు. దిల్లీలోకి ప్రవేశించే వాహనాల రద్దీని తగ్గించేందుకు కొత్త రోడ్డు ప్రాజెక్టులు ఎంతో దోహదపడుతాయన్నారు. కాలుష్యాన్ని క్లీన్ ఎనర్జీ ద్వారా తగ్గించనున్నట్లు పేర్కొన్నారు. దిల్లీ కాలుష్యంలో 40శాతం శిలాజ ఇంధనాల వినియోగమే కారణమని చెప్పారు. దీంతో ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులు, కార్లు, స్కూటర్లు, సీఎన్‌జీ వాహనాలను ప్రవేశపెట్టిందన్నారు. కొత్త రోడ్ నెట్‌వర్క్‌తో వాహనాల రద్దీ తగ్గుతుందన్నారు. ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ చుట్టూ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఇప్పటికే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించిందని... అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ ప్రాజెక్ట్ కింద... దిల్లీ-కత్రా ఎక్స్‌ప్రెస్ వేతో కుండ్లి మనేసర్ పాల్వాల్ ఎక్స్‌ప్రెస్ వే లేదంటే వెస్ట్రన్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్ వే ద్వారా కనెక్టివిటీని అందించే ఫేజ్-2ని మంత్రిత్వ శాఖ ఖరారు చేస్తోంది. ఆయా రోడ్‌నెట్ వర్క్‌ల ద్వారా జమ్మూ కశ్మీర్, పంజాబ్ నుంచి వచ్చే వాహనాలు నేరుగా విమానాశ్రయం, దిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేకు చేరుకునేలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కొత్త రోడ్ నెట్‌వర్క్ దిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వేకి నేరుగా కనెక్టివిటీని అందిస్తుందని.. దాంతో రాజధానిలో రద్దీని తగ్గించడంలో సహాయపడుతుందన్నారు. మహిపాల్‌పూర్, రంగ్‌పురి ప్రాంతాల్లో రోజువారీ ట్రాఫిక్ జామ్‌ను నివారించేందుకు ఐదు కిలోమీటర్ల పొడవైన సొరంగాన్ని నిర్మించే యోచనలో ఉన్నట్లు గడ్కరీ వివరించారు. రూ.3,500 కోట్లతో ఈ సొరంగాన్ని నిర్మించనున్నారు. ఈ సొరంగం వసంత్ కుంజ్‌లోని శివమూర్తి, నెల్సన్ మండేలా మార్గ్‌లను కలుపుతుంది.

విశాలాంధ్ర హైదరాబాద్

విలువలతో కూడుకున్న పత్రిక విశాలాంధ్ర

మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్

విశాలాంధ్ర-దుండిగల్: సమ సమాజంలో విలువలతో కూడుకున్న పత్రిక విశాలాంధ్ర అని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. శుక్రవారం ఈటెల రాజేందర్ నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం విశాలాంధ్ర నూతన క్యాలెండర్‌ను, 125 డివిజన్ గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ బిజెపి నాయకులు పీసరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ శాలువాలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాలాంధ్ర గత 73 సంవత్సరాలుగా పనిచేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర కుత్బుల్లాపూర్ జోన్ ఇంచార్జ్ శంకర్, రిపోర్టర్ మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ జెకె శేఖర్ యాదవ్, పార్లమెంట్ కో కన్వీనర్ రాజు, జిల్లా అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్, అసెంబ్లీ కన్వీనర్ గోనె మల్లారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సీతారాం రెడ్డి, మురళి కృష్ణ పాల్గొన్నారు.

నిబద్ధత గల కమ్యూనిస్టు రొయ్యల కృషమూర్తి : విఎస్ బోస్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వినాయక్ నగర్ సిపిఐ పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ రొయ్యల కృష్ణమూర్తి సంతాప సభ సిపిఐ మండల కార్యదర్శి టి.యాదయ్య గౌడ్ అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.ఎస్.బోస్ పాల్గొని మాట్లాడుతూ నిబద్ధతగల కమ్యూనిస్టు యోధులు రొయ్యల కృష్ణమూర్తి అని ఆయన ఆశయాల కోసం మనమంతా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఏ పార్టీలో మరణించిన దక్కని గౌరవం కమ్యూనిస్టు పార్టీలో మరణించిన వారికి దక్కుతుందని ఏ కార్యక్రమం చేసిన ముందుగా సంతాప తీర్మానం ప్రవేశపెట్టి వారిని స్మరించుకుంటూ ముందుకెళ్తామన్నారు. అది అమరవీరులకు ఇచ్చే గౌరవం అని తెలిపారు. వారు భౌతికంగా మన మధ్య లేకపోయినా వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు సిహెచ్ దామోదర్ రెడ్డి, ఉమా మహేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ్, తోటపల్లి శంకర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ధర్మేంద్ర, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు కాసర్ల నాగరాజు, కె.అశోక్, సీనియర్ నాయకులు పి.సత్యనారాయణ, జె రాములు, ఎస్.కె అజిత్, బి.యాదగిరి, కే.ప్రభాకర్, బి.లింగం, సిపిఎం నాయకులు చింతల యాదయ్య, గుంటి లక్ష్మణ్, ఎం.కృపాసాగర్ తదితరులు పాల్గొని రొయ్యల కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించారు.

ప్రైవేటు బస్సుల దోపిడీని అరికట్టాలి: టీడీపీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : రానున్న సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణ, ఆంధ్ర ఇతర రాష్ట్రాల ప్రజలు పెద్ద ఎత్తున తమ తమ గ్రామాలకు వెళ్తుంటారు. సందర్భంగా ప్రైవేటు ట్రావెల్స్ ఇష్టా రాజ్యంగా సాగిస్తున్న దోపిడిని అరికట్టాలని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంటు అధ్యక్షులు సాయిబాబా అన్నారు. ప్రభుత్వాల అసమర్థత వల్లే ప్రైవేటు ట్రావెల్స్ ప్రజలను దోపిడికి గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రజలకు సరిపడా బస్సులను కేటాయించక, ప్రైవేటు వాహనాలను నియంత్రించాల్సిన ప్రభుత్వం పట్టించుకోకుండా చోద్యం చూడడమేనని అన్నారు. పండుగ సందర్భంగా 3వేల రూపాయల ఒక్కో టిక్కెట్లు 6వేల వరకు విక్రయించి ప్రజలను దోచుకుంటున్నారు. ప్రజల్ని దోచుకుంటుంటే ప్రభుత్వానికి ఆనందంగా ఉందా? అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు ఆపరేటర్లకు పర్మిషన్లు ఇవ్వకుండా ప్రభుత్వాలు నియంత్రించాలని కోరారు. ప్రభుత్వ బస్సుల సంఖ్య పెంచి, అధిక మొత్తంలో బస్సులను నడిపి నష్టాల్లో ఉన్న ఆర్టీసీని కాపాడాల్సిన ప్రభుత్వం తమకేమీ పట్టనట్లు చూస్తోందని, ఇష్టారాజ్యంగా ప్రైవేటు వాహనాలు దాచుకుంటున్నా సంబంధిత శాఖాధికారులు తమకేమి పట్టనట్టు ప్రవర్తించడం సిగ్గుచేటని అన్నారు. ఈ విషయంపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

సత్తా చాటాలి... పథకాలు సాధించాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : గచ్చిబౌలి స్టేడియంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న రాష్ట్ర మాస్టర్స్ అథ్లెట్ పోటీల్లో రంగారెడ్డి జిల్లా అత్యధికంగా మెడల్స్ సాధించాలని రంగారెడ్డి జిల్లా మాస్టర్ అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్ తెలిపారు. పోటీల్లో పాల్గొననున్న రంగారెడ్డి జిల్లా మాస్టార్లకు శుక్రవారం చందానగర్ పీజెఆర్ స్టేడియంలో ట్రాక్ సూట్లను అందచేయడం జరిగింది. కార్యక్రమాలో కొండ విజయ్ మాట్లాడుతూ మాస్టర్స్ అథ్లెట్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించడం మన నిర్వహించే టోర్నమెంట్‌లో మన రంగారెడ్డి మాస్టర్స్ సత్తా చాటాలని కొండ విజయ్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ నూనె సురేందర్, ట్రెజరర్ స్వాతి, శివలీల. స్వప్న, శైలజ తదితరులు పాల్గొన్నారు.

యూనిసెఫ్ సహకారంతో

పాఠశాలల్లో ట్రాఫిక్ అవేర్నెస్ పార్కుల ఏర్పాటు

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : చిన్నప్పటినుండే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించేందుకు యూనిసెఫ్ సహకారంతో ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. మంత్రి తొలుత పాఠశాల విద్యార్థులతో కలసి రోడ్డు భద్రతపై ప్లకార్డులతో రోడ్డు భద్రత అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం రోడ్డు ప్రమాదం నివారిద్దాం పోస్టర్, పాంప్లెట్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను ఈరోజు నుండి జనవరి 31 వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. తెలంగాణలో రవాణా శాఖ, పోలీస్ శాఖ విద్యాశాఖ అన్ని శాఖలు ఈ కార్యక్రమాన్ని రోడ్డు భద్రతపై అవగాహన చేసుకొని అమలు చేయాలని అలాగే ప్రజలను చైతన్యవంతులను చేసి సామాజికంగా ముందుకు వెళ్లాలని అన్నారు. ఏ కార్యక్రమమైనా చిన్నప్పుడు నేర్చుకున్నది పెద్దయిన తర్వాత ఉపయోగ పడుతుందని ఆ ఉద్దేశంతోనే చిన్నతనం నుండి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యూనిసెఫ్ వారి సహకారంతో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సంవత్సరం 500 నుంచి 1000 పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జనవరి 7న జాతీయ రోడ్డు రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిచే జాతీయ రవాణా సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు. ట్రాఫిక్ రూల్స్‌ను బ్రేక్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఇప్పటివరకు 7000 మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. అనంతరం ఎలక్ట్రికల్ స్టేషను మంత్రి ప్రారంభించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ చిన్నపిల్లల నుండి పెద్ద వాళ్ల వరకు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్నప్పటి నుండే ట్రాఫిక్‌పై అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో ట్రాఫిక్ అవేర్నెస్ పార్కులను ఏర్పాటు చేసి పిల్లలకు రోడ్డు భద్రత పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రవాణా శాఖ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వ ప్రసాద్, జాయింట్ కమిషనర్లు రమేష్, మామిళ్ల చంద్రశేఖర్ గౌడ్, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

బీసీలు జ్ఞాపకం వచ్చారు అంటే బీసీల శక్తి మీకు తెల్సింది : మంత్రి పొన్నం

అధికారంలో ఉన్నపుడు గుర్తుకు రాని బీసీలు ఈరోజు మీకు బీసీలు జ్ఞాపకం వచ్చారు అంటే బీసీల శక్తి మీకు తెల్సింది అంటూ బీఆరెస్‌ను ఉద్దేశించి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉండి బీసీల ఊసెత్తని వారు రాజ్యాంగ బద్ధంగా బలహీన వర్గాలకు అవకాశం ఉండి న్యాయం చేయని వారు సంస్థాగతంగా న్యాయం చేయని వారు ఈరోజు దయ్యాలు వేదాలు వల్లిస్తున్న సోదరి కవితకి అభినందనలు అంటూ ఏదేవా చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సమితి అలియాస్ భారతీయ రాష్ట్ర సమితి మీ పార్టీ అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్ష, ప్రతిపక్ష నేత పదవి ఒకటి ఉంచుకొని మిగిలినవి బలహీన వర్గాలకు ఇవ్వండని ఈ సందర్భంగా పొన్నం డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు బలహీన వర్గాలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదని, నేను హక్కుదారు అని చెప్పిన ఈటెల రాజేందర్‌ను బయటకు పంపించారని దుయ్యబట్టారు. జయశంకర్, దేశిని చిన్న మల్లయ్య, శ్రీకాంత్ చారి తల్లిని అవమాణించినప్పుడు మీరు ఎందుకు మాట్లాడలేదని మండిపడ్డారు. ప్రభుత్వం తరుపున బలహీన వర్గాల కోసం ఏమైనా చేశారా అని ప్రశ్నించారు. మేము కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ప్రతి కార్పొరేషన్‌కు 50 కోట్లు కేటాయించామన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా బీసీల హామీలు అన్ని అమలు చేస్తామని, రాహుల్ గాంధీ చెప్పినట్టు ఎవరెంతో వారికంత న్యాయం చేస్తామని అన్నారు. అవసరమైతే షెడ్యూల్ మార్చి న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

షాద్‌నగర్‌లో మంత్రి సీతక్క పర్యటన నేడు

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: విద్య, వైద్యం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టేందుకు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం కష్టపడుతూ ప్రత్యేక కృషి చేస్తున్నారని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, గిరిజన విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తూరు, నందిగామ, ఫరూక్ నగర్ మండలాల్లో రాష్ట్ర పంచాయతీరాజ్, గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈనెల 4వ తేదీ శనివారం పర్యటిస్తున్నట్టు తెలిపారు. ఫరూక్ నగర్ మండలంలోని మధురపురం గ్రామంలో రూ. 8 కోట్ల రూపాయల నిధులతో కమ్మదనం నుండి మధురాపురం శేరిగూడ వరకు బిటి రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో 35 లక్షల రూపాయలతో మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభిస్తారని, అదేవిధంగా 15 లక్షల రూపాయలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. కొత్తూరు మండలంలో నాట్కో సహకరంతో నిర్మించిన జెడ్పిహెచ్ఎస్ స్కూల్ ప్రారంభోత్సవం, మేకగూడలో గ్రామపంచాయతీ భవనం ప్రారంభోత్సవం, నందిగామ మండలంలో అంగన్వాడి భవనం ప్రారంభోత్సవం కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. అదేవిధంగా నందిగామ మండలంలోని వీర్లపల్లి గ్రామంలో రూ. 19 కోట్ల 4 లక్షల రూపాయల నిధులతో ఫరూక్ నగర్ నుండి వీర్లపల్లి మీదుగా చేగుర్ వరకు బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసున్నట్లు తెలిపారు. అప్పారెడ్డి గూడ గ్రామంలో 23 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం శంకుస్థాపన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా చేగూరు నుండి సింబయిసిస్ కళాశాల వరకు 7 కోట్ల రూపాయల నిధులతో బిటి రోడ్డు కోసం శంకుస్థాపన కార్యక్రమాలు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క చేపడుతున్నట్లు వారు ప్రకటించారు. ఈ కార్యక్రమాలకు కాంగ్రెస్ శ్రేణులు అన్ని విభాగాల బాధ్యులు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, ఇబ్రహీం, బస్వం, ముబారక్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 6, 7 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్-1 లో కలబ్ గూర్ నుంచి లింగంపల్లి వరకు గల పీఎస్సీ, ఎంఎస్ పైపులైనుకు జాయింట్ లీకేజీలు ఏర్పడ్డాయి. ఈ లీకేజీలు అరికట్టడానికి మరమ్మతులతో పాటు జంక్షన్ పనులు సైతం చేపట్టనున్నారు. ఈనెల 6వ తేదీ సోమవారం ఉదయం 6 గంటల నుంచి 7వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటల వరకు ఈ పనులు జరుగుతాయి. కావున ఈ 24 గంటలు క్రింది పేర్కొన్న ప్రాంతాల్లో పలు చోట్ల తాగునీటి సరఫరాలో అంతరాయం, కొన్ని చోట్లలో-ప్రెజర్‌తో నీటి సరఫరా జరుగుతుంది.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలు..

ఓ అండ్ ఎం డివిజన్-8 : పటాన్ చెరు ఇండస్ట్రియల్ ఏరియా, హెచ్‌సీయూ, బీహెచ్ఈఎల్ టౌన్ షిప్, బీహెచ్ఈ ఎల్ ఫ్యాక్టరీ., ఓ అండ్ ఎం డివిజన్-15 : ఎస్బీఐ ట్రైనింగ్ సెంటర్, డోయెన్స్ కాలనీ, హఫీజ్ పేట్, మదీనాగూడ, గంగారం, చందానగర్, లింగంపల్లి, జ్యోతి నగర్, అశోక్ నగర్, ఆర్సీ పురం, పటాన్ చెరు. కావున అంతరాయం ఏర్పడే ప్రాంతాల్లోని వినియోగదారులు తాగునీటిని పొదుపుగా వినియోగించుకోగలరని కోరడమైనది.

విద్యుత్ కష్టాలకు చెక్ పెట్టేందుకు కృషి : ఎమ్మెల్యే మర్రి



విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి నియోజకవర్గంలో కరెంట్ కష్టాలు శాశ్వతంగా పరిష్కరించేందుకు కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణం, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, సింగిల్ ఫేస్ నుండి త్రీ ఫేస్‌కు మార్పిడి చేయాలని కోరుతూ గతంలోనే ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అనేక సార్లు అధికారులను కలిసి చర్చించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గౌతమ్ నగర్ ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్లో ఎస్.ఈ. బ్రహ్మంను కలిశారు. కొత్త సబ్ స్టేషన్లు ఏర్పాటు కొరకు ప్రభుత్వ స్థలం కోసం చూస్తున్నామని, ఎస్.ఈ చెప్పగా వెంటనే స్పందించి స్వయంగా ఎమ్మెల్యే మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని పలు ప్రభుత్వ స్థలాలను ఎస్.ఈ. ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే సూచిన నేరేడ్‌మెట్ ప్రభుత్వ స్థలంలో త్వరలోనే సబ్ స్టేషన్ నిర్మాణం కోసం భూమి పూజ చేయనున్నారు. అదే విధంగా ఇతర సమస్యలైన సింగిల్ ఫేజ్ నుండి త్రీ ఫేస్‌కు మార్పిడి, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, కొత్త కరెంట్ పోల్స్ ఏర్పాటు తదితరల పనులకు కొరకు డివిజన్ల వారీగా పంపిన ప్రతిపాదనలు ఆమోదించినదుకు ఎస్.ఈ.ని అభినందించారు. గత సంవత్సరాల కాలంగా విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి ప్రతి సమస్యను తీసుకెళ్లి, ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తూ దాదాపు విద్యుత్ శాఖ నుండి అన్ని పనులను మంజూరు చేయించుకున్నామన్నారు. త్వరలోనే ప్రభుత్వ స్థలాల్లో సబ్ స్టేషన్లు ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమైన కొత్త కరెంట్ పోల్స్, పోల్స్ షిఫ్టింగ్ ఏర్పాటు తదితర పనుల కోసం 8 కోట్లు మంజూరయ్యాయని తెలియజేస్తూ, సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గౌతమ్ నగర్ కార్పొరేటర్ సునీత యాదవ్, డి.ఈ.అన్వర్ పాషా, ఏ.డీ.ఈ. శ్రీనివాస్ రెడ్డి, చంద్ర శేఖర్ బి.ఆర్.ఎస్.నాయకులు బద్దం పరశురామ్ రెడ్డి, రావుల అంజయ్య, రాము యాదవ్, చిన్న యాదవ్ తదితరులు ఉన్నారు.

మహిళల అభ్యున్నతి కోసం పోరాడిన సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహిళల విద్యాహక్కుల కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరుగని పోరాటం చేసిన తొలితరం ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలో ఆయన పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందరేగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని ఆమె సేవలను కొనియాడారు. అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలోనూ తన భర్త సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో సావిత్రిబాయి చదువు నేర్చుకుని ఉపాధ్యాయురాలు అయ్యారని గుర్తు చేశారు. విద్యను అభ్యసిస్తేనే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని గ్రహించిన సావిత్రిబాయి, సాటి మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో బాలికల పాఠశాలలను ప్రారంభించి మహిళా చైతన్యానికి బాటలు వేశారని, తద్వారా ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా కీర్తి గడించారని అన్నారు. అస్పృశ్యత, అంటరానితనం, కులవివక్షత వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు ఆమె చేసిన పోరాటం, చూపిన తెగువ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆ మహనీయురాలి స్ఫూర్తితో మహిళల అభ్యున్నతి కోసం కృషి చేయాలని, అప్పుడే ఆమె ఆశయ సాధనకు కృషి చేసినట్లు అవుతుందని అన్నారు. సావిత్రిబాయి సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఇకనుండి ఆమె జయంతిని పురస్కరించుకుని ప్రతియేటా జనవరి 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ వెంకటాచారి, ఈడి ఎస్సి కార్పొరేషన్ రమేష్, డీపిఆర్ఓ అబ్దుల్ కలీం, కలెక్టరేట్ ఏఓ సధానందం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో పర్యటించిన మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్



విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని సర్దార్ పటేల్ నగర్ కాలనీలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ శుక్రవారం పర్యటించారు. కాలనీలో నెలకొన్న పలు సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. స్ట్రీట్ నెంబర్ 2లో నాలా పైకప్పు (స్లాబ్) తొలగించి మరల నూతనంగా 40 ఫీట్ల వెడల్పుతో పైకప్పు(స్లాబ్) నిర్మిస్తుండటంతో దీని వల్ల వర్షాకాలంలో నీటి ప్రవాహం పెరిగి కాలనీ లోని స్ట్రీట్ నెంబర్ 1,2,3లో ఉనటువంటి ఇళ్లలోకి నాలా లోని మురుగు నీరు చేరి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని ఆయనకు స్థానికులు తెలియజేశారు. కాలనీలో పర్యటించి ఆయన నాలా సమస్యపై జిహెచ్ఎంసి కమిషనర్, డి.ఈతో చర్చించి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జయసింహ, జాకోబ్, కమల్, విశ్వనాథం, జమాల్, అనిత, పుష్పమ్మ, స్వాతి, సూర్యమణి, మణెమ్మ, లలిత, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: తెలంగాణ రాష్ట్రంలోని క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని శాట్స్ చైర్మన్ శివసేన రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ డిస్టిక్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో యూఎస్ఏ క్రికెట్ బోర్డ్ చైర్మన్ వేణు రెడ్డి సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కప్పు పేరుతో గ్రామీణ మండల జిల్లా స్థాయిపోటీలను మార్చ్, ఏప్రిల్ మాసంలో నిర్వహిస్తామని తెలిపారు.తద్వారా క్రీడల్లో రాణించిన వారిని స్పోర్ట్స్ అకాడమీ ద్వారాఎంపిక చేసి జాతీయ అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు తొడ్పాటు అందిస్తామన్నారు.సీఎం కప్ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు అకాడమిక్ విద్యలో వెయిటేజ్ మార్క్ లను కలిపేందుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతము పాఠశాలల వరకు ఉన్న స్పోర్ట్స్ ను ఉన్నత విద్య వరకు పొడిగిస్తామన్నారు. స్పోర్ట్స్ కోటాలో పారాఒలంపిక్స్ లో కాన్సెప్ట్ పథకం సాధించిన దీప్తిజీవాంజికి రాష్ట్ర ప్రభుత్వ గ్రూప్ 2 ఉద్యోగాన్ని కల్పించి 500 గజాల స్థలాన్ని ఇవ్వడం జరిగిందని వివరించారు. వచ్చే ఆకాడమీ కల్లా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేలా ప్రయత్నాలు కొనసాగుతున్నాయిన్నారు.ఏరాష్ట్రంలో కూడా లేనివి ధంగా 370 కోట్ల రూపాయలను స్పోర్ట్స్ అథారిటీకి ప్రభుతం కేటాయించడం హర్షనీయమన్నారు.ఈ సందర్భంగా యు.ఎస్.ఎ క్రికెట్ బోర్డు చైర్మన్ వేణురెడ్డిని అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి, చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి ఘనంగా సన్మానించారు.అనంతరం వేణురెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా క్రికెట్ ను అమెరికా ప్రోత్సహిస్తుందన్నారు. కానీ సౌకర్యాల లేమివల్ల అవకాశాలు రాలేదన్నారు.బీసీసీఐతో కలిసి పనిచేస్తామన్నారు.అంతర్జాతీయ క్రికెట్ పోటీలలో అమెరికా గెలుపొందాలన్నదేతన లక్ష్యమన్నారు.ఈసమావేశంలో ఈశ్వర్ రెడ్డి,రామ్ రెడ్డి,ఎన్నారై బాసి రెడ్డి, టీఎస్జీవో ప్రధాన కార్యదర్శి (ముజీబ్) ఎం ఎస్ హుసేని, సినీ నటుడు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు యూనివర్సిటీలో నూతన భవనాలకు అనుమతులివ్వండి:ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాలమూరు విశ్వవిద్యాలయం లో నూతనంగా ప్రారంభించనున్న న్యాయ, ఇంజనీరింగ్ కళాశాలల భవనాల నిర్మాణాలకు అనుమతులు కోరుతూ శుక్రవారం మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, పాలమూరు యూనివర్సిటీ విసి శ్రీనివాస్ రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రిన్సిపల్ సెక్రెటరీని ఇతర అధికారులను కలిశారు.

పాలమూరు యూనివర్సిటీకి న్యాయ, ఇంజనీరింగ్ కళాశాలలకు సంబంధించిన అన్ని అనుమతులు వచ్చాయని, వీటి నిర్వాహణకు అవసరమైన నూతన భవనాల నిర్మాణం చేపట్టేందుకు వెంటనే అనుమతులు ఇవ్వాలని వారు ప్రిన్సిపాల్ సెక్రెటరీని కలిసి కోరారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న కోర్సులకు ఎలాంటి ఆటంకం లేకుండా, సాఫీగా తరగతులను నిర్వహించుకోవడానికి సహకరించాలని, న్యాయ, ఇంజనీరింగ్ కళాశాలల భవనాల నిర్మాణాలకు కావాల్సిన అన్ని అనుమతులను వెంటనే మంజూరు చేయాలని ఆయన ప్రిన్సిపాల్ సెక్రెటరీని ఈ సందర్భంగా కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

విశాలాంధ్ర, హైదరాబాద్ : జలమండలి పాలక మండలి సమావేశం నిర్వహించడంపై బోర్డు టీజీవో శాఖ హర్షం వ్యక్తం చేసింది. అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ఖాదర్, జనరల్ సెక్రటరీ చంద్రజ్యోతి మట్లాడుతూ బోర్డు ఆవిర్భావం తర్వాత ఏటా పాలక మండలి సమావేశాలు జరిపి సమస్యలు పరిష్కరించే వాళ్లు అని తెలిపారు. అయితే గత 11 ఏళ్లుగా ఒక్క మీటింగ్ కూడా నిర్వహించలేదన్నారు. కానీ కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరమే మీటింగ్ నిర్వహించడం సంతోష దాయకమన్నారు. పెండింగ్ సమస్యల్ని, నిర్ణయాలు ఆమోదించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. జలమండలి ఆర్థిక స్వావలంబన సాధించడం దిశగా తీసుకున్న నిర్ణయాలు హర్షణీయమని కొనియాడారు.

CHANGE OF SURNAME

I, **DONDETI SIVA SINDHU** (Old Name), W/o. **Kamireddy Prasadareddy**, Resident of F.No.204, Sunwaynest Apartment, KRCR Colony, Road No:6, Bachupally, Bachupally Mandal, Medchal - 500090, Telangana. I have changed my surname as **KAMIREDDY SIVA SINDHU** (New Name) W/o. **Kamireddy Prasadareddy**. Hereafter my surname is known as **KAMIREDDY SIVA SINDHU** (New Name) W/o. **Kamireddy Prasadareddy**.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర-దుండిగల్: నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్ రెడ్డితో బిజెపి నాయకులు పీసరి కృష్ణారెడ్డి కలిసి శుక్రవారం మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్‌ను ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్మాణం కొరకు మరింత స్థలం కేటాయించగలరని, ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు అదనపు భోజనశాల భవనం ఏర్పాటు చేయగలరని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం బిజెపి నాయకులకు కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు రామ్ రెడ్డి ఈటెల రాజేందర్ ను శాలువాతో సత్కరించారు. బౌరంపేట్ బీజేపీ నాయకులు గోనె మల్లారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : నూతన సంవత్సరం సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు శివ, ప్రకాష్ ఎమ్మెల్సీ కవితను తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్ పాల్గొన్నారు.

నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకుందాం : మేయర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగరాభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేయాలని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. న్యూ ఇయర్‌ని పురస్కరించుకుని జిహెచ్ఎంసి వివిధ విభాగాల అధికారులు, జోనల్ కమిషనర్లు, కార్పొరేటర్లు శుక్ర వారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ 2025 నూతన సంవత్సరం సందర్భంగా అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం హైదరాబాద్ నగర అభివృద్ధికి ప్రజలు, అధికారులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మరింత నిబద్ధతతో కృషి చేస్తామని అన్నారు. నగరాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్ళడానికి అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. శుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు నగర అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తూ జీహెచ్ఎంసీ ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. ప్రజల సహకారంతో హైదరాబాద్ నగరాన్ని దేశంలోనే అతిపెద్ద నగరంగా అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని మేయర్ అన్నారు. మేయర్‌ను కలిసిన వారిలో జీహెచ్ఎంసీ వివిధ విభాగాల ఉన్నతాధికారులు, జోనల్, డిప్యూటీ కమిషనర్లు, కార్పొరేటర్లు, ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

వడ్డెరలను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: సంచార శ్రమ జీవులైన వడ్డెరలను దేశంలోని కొన్ని రాష్ట్రాలలో ఎస్‌సి లుగా, ఎస్‌టి లుగా పరిగణిస్తున్నట్లుగానే తెలంగాణ రాష్ట్రంలో కూడా వడ్డెర జాతిని గిరిజన తెగల (ఎస్‌టి)లో చేర్చాలని, వడ్డెరలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అఖిలభారత వడ్డెర, వోడ్, బోవి, బేల్దార్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వడ్డెరల రాష్ట్ర సదస్సు బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగింది. సదస్సులో తెలంగాణ రాష్ట్ర ఎంబిసి చైర్మన్ జెరిపాటి జైపాల్, అఖిలభారత వడ్డెర, వోడ్, బోవి, బేల్దార్ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్, ఐ.ఎన్.టి.యు.సి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు వేముల తిరుమల దేవి, ప్రధాన కార్యదర్శి గుంజ రేణుక, యువజన విభాగం జాతీయ అధ్యక్షులు మంజల రమేష్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మంచపు రమ తదితరులు ప్రసంగించారు. ఎంబిసి చైర్మన్ జెరిపాటి జైపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో వడ్డెర్లకు అన్యాయం జరిగిందని, ప్రస్తుతం వడ్డెరలంతా ఐక్యతతో పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్ మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా వడ్డెర జాతికి అన్యాయం జరుగుతున్నదని, వడ్డెరలను ఎస్ టి జాబితాలో చేర్చేందుకు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐ.ఎన్.టి.యు.సి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ వడ్డెర్లు, ఎరుకుల, యానాది, లంబాడీలు, డి.ఎన్.టి సంచార జాబితాలో ఉన్నారని, 1970లో అనంతరం ఏర్పడిన కమిషన్ ఎరుకుల, యానాది, లంబాడీలను, ఎస్.టి (గిరిజన తెగలు)లో చేర్చి, లిపి లేని కారణంగా వడ్డెరులను బిసిఎలో చేర్చి వడ్డెర్లకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. సదస్సులో వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంజల హనుమయ్య, కార్మిక విభాగం అధ్యక్షులు సాతల గోపాల్, ప్రధాన కార్యదర్శి ఇడగోటి నగేష్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఇడగోటి పార్వతి, యువజన అధ్యక్షులు బొంత చిరంజీవి, బోదాసు శ్రీనివాస్, సంఘం అధ్యక్షులు రేపన్ గిరిబాబు సదస్సులో పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : నాటి మనువాద సంప్రదాయాలలో భాగమైన కుల వివక్ష వంటి సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేసిన ప్రగతిశీల సామాజిక సంస్కరణల విప్లవకారిణి సావిత్రీబాయి పూలే అని భారత జాతీయ మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు పి. ప్రేమ్ పావని కొనియాడారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద శుక్రవారం భారత జాతీయ మహిళా సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్య సంయుక్తాధ్వర్యంలో భారతీయ సంఘ సంస్కర్త, విద్యావేత్త సావిత్రీబాయి పూలే 194వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పి. ప్రేమ్ పావని తోపాటు భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి, అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసఫ్, ఏఐటీయూసీ సీనియర్ నాయకులూ యు.రత్నాకర్ రావు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ముదుపు నళిని రెడ్డి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు పడాల నళిని, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఆర్.బాలకృష్ణ తదితరులు సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పి. ప్రేమ్ పావని మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే సామాజిక న్యాయం, మహిళా సాధికారతకు పర్యాయపదంగా నిలుస్తుందని అన్నారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకురాళ్లు షహనా అంజూమ్, జె.శ్రీదేవి, ఏఐవైఎఫ్ నేతలు షేక్ మహమూద్, కే కళ్యాణ్, పి అనిల్ కుమార్, హేమంత్ కుమార్, అరుణ్, పంజాల జగన్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్‌లో: సావిత్రిబాయి జయంతి వేడుకలు జరుపుకున్నారు. సావిత్రీబాయి పూలే పునాది వేశారని మహిళా విద్యకు ప్రాధాన్యం కల్పించారని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తోపాటు ప్రజా ఉద్యోగ సంఘాలతో పాటు నాయకులు, జర్నలిస్టులు బీసీ సంఘం నేతలు హాజరై సావిత్రిబాయి పూలేలకు పెద్ద ఎత్తున పూలమాలలతో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకు తమ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మాజీ జెడ్పిటిసి వెంకటరామిరెడ్డి, రఘు నాయక్, చెంది తిరుపతి రెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, బాలరాజు గౌడ్, అగ్గనూర్ ఇబ్రహీం, భార్గవ్ కుమార్ రెడ్డి, అందే మోహన్, జాంగారి రవి,ముబారక్, ఖదీర్,తుపాకుల శేఖర్, బాధే పల్లి సిద్దార్థ,దిలీప్ కుమార్, అన్వర్, శ్రీనివాస్ రెడ్డి, బుడ్డ నర్సింహులు, మనపటి ప్రదీప్, మంగ అశోక్, మదవులు యాదవ్, గడ్డం శ్రీనివాస్, అశోక్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

హైదరాబాద్ రవీంద్ర భారతిలో : మహిళల విద్యా ప్రదాత సావిత్రి బాయి పూలే అని ముఖ్యంగా ఆమె మహిళలు చదువుకునేందుకు తొలి అడుగు వేశారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం రవీంద్ర భారతిలో బీసీ మహిళ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రి బాయి పూలే 194వ రాష్ట్ర స్థాయి జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో మొదటి మహిళా పాఠశాల స్థాపించి దళిత, అణగారిన వర్గాలకు విద్యానందించిన మహిళ ఉపాధ్యాయురాలని కొనియాడారు.

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరిలో: సావిత్రి భాయి పూలే జయంతిని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవమును నిర్వహించారు. దీనిలో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పాఠశాలలో గల మహిళా ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధాన చేశారు. ఈ కార్యక్రమంలో అత్యధికస్త్ర&ంగా మహిళా ఉపాధ్యాయులను ఆయా పాఠశాలలో ఉపాధ్యా బృందం, విద్యార్థులచే గౌరవ సత్కారము గావించారు.

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్‌లో : భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయు రాలు సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో వివక్ష లేని సమాజం కోసం పోరాడదామని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్నారు. శుక్రవారం సావిత్రి బాయిపూలే 194వ జయంతిని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే 1831లో మహారాష్ట్రలోని సతరా జిల్లాలోని నయాగ్రామ్ అనే గ్రామంలో సావిత్రిబాయి పూలే జన్మించారని అన్నారు. చిన్న వయసులోనే బాలిక విద్య ప్రాముఖ్యతను గ్రహించి 1852లోనే మహిళా మండలిని స్థాపించి బాలికలకు ఉచిత విద్యను అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు భగత్, ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, శ్రీకాంత్, కర్ణాకర్, శ్రీనివాస్, భూపతి, వెంకటేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మల్కాజిగిరిలో : బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్త్రీ విద్య సాధికారత కోసం అజ్ఞానానికి వ్యతిరేకంగా పోరాడిన చదువుల తల్లి చైతన్య మూర్తి సావిత్రిబాయి పూలే 194వ జయంతి సందర్భంగా గౌతమ్ నగర్ చౌరస్తాలో విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు టి.యాదయ్య గౌడ్ పాల్గొని మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయులైన సావిత్రిబాయి పూలే జీవితం అత్యంత ఆదర్శమైందని సమాజ నిర్మాణంలో చదువు ఎంతో ముఖ్యమైనది అని ఆమె భావించడం వల్లనే ఇవాళ అనేక మంది విద్యలో రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు కాసర్ల నాగరాజు పి.సత్యనారాయణ, బి.యాదగిరి, బి.లింగం, బి.బాలరాజు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

గౌతమ్ నగర్ డివిజన్‌లోని ఆమె విగ్రహానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే భారతీయ గౌతమ్ నగర్ డివిజన్ లోని, ఉపాధ్యాయిని, రచయిత్రి, నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసి, కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి అని అన్నారు. కార్పొరేటర్ సునీత యాదవ్, రావుల అంజయ్య, బద్దం పరశురామ్ రెడ్డి, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కాప్రాలో: మహిళా ఉపా ధ్యాయ దినోత్సవం సందర్భంగా మల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశా లలోని మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరిం చిన నెమలి సురేష్ (ఎన్.ఎస్.ఆర్) ఫౌండేషన్‌సభ్యులు ఆధునిక భారత చరిత్రలలో ధృవతార, ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన మహిళా చైతన్యమూర్తి, సామాజిక ఉద్యమకారిణి మన సావిత్రీభాయ్ పూలే అని నెమలి అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి, మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మల్లాపూర్ డివిజన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను నెమలి సురేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ నెమలి అనిల్ కుమార్, (ఎన్ ఎస్ ఆర్) కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ యాదగిరి రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ పద్మారావు, ఫౌండేషన్ సభ్యులు పీజీ.సుదర్శన్, ఎన్.సురేష్, కె.రాజేష్, శ్రీనివాస్, సాయి పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఎల్.బి.నగర్‌లో : ఎల్బీనగర్ నియోజకవర్గం బీసీ హక్కుల సాధన సమితి ఉడుతల మల్లేష్ గౌడ్ అధ్యక్షతన ఎస్.ఏ.డాంగే భవన్‌లో సావిత్రిబాయి పూలే 194వ జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ విచ్చేసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్త్రీ జాతి ఆణిముత్యం ఆమె కరుడుగట్టిన బ్రాహ్మణిజం కంబందాహస్తాల నుంచి స్త్రీ జాతికి విముక్తి కల్పించిన మహా సంకల్పి అని కొనియాడారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు భాతరాజు నరసింహ స్థానిక నాయకులు ఎర్రోళ్ల ఉషశ్రీ, చెట్ల వెంకటయ్య, ఎం.డి.హమీద్ భాయ్, రవి కుమార్ యాదవ్ పాల్గొనడం జరిగినది.

విశాలాంధ్ర - మేడిపల్లిలో: భారతదేశంలో ప్రధమంగా బ్రాహ్మణీయ కులతత్వ సంస్కృతి మత ఉన్మాద వ్యవస్థలపై యుద్ధాన్ని ప్రకటించిన సాంఘిక విప్లవ వీరులు ఆదర్శ దంపతులు మహాత్మ జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే లని నేదునూరి జ్యోతి అన్నారు. శుక్రవారం ఉదయం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి. జె.లక్ష్మి అధ్యక్షతన ఇసిఐయల్‌లో సాంఘిక సామాజిక విప్లవ నారీమణి సావిత్రిబాయి పూలే 194వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నేదునూరి జ్యోతి భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాజరై మాట్లాడుతూ విద్యను ఆయుధంగా పీడితుల చేతిలో పెట్టి అధర్మ వ్యవస్థపై ధర్మ యుద్ధాన్ని ప్రకటించిన సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని మహిళా లోకం మహిళా హక్కుల కొరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షురాలు వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేశ్వరి, ఎస్ లత, స్వరూప, ప్రమీల, మహేశ్వరి, ఎస్ జ్యోతి, ఎన్ పద్మ, సంతోష, మహాలక్ష్మి, నర్సమ్మ, పి.సిందూరి, యాదమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - శేరిలింగంపల్లిలో : ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వరంలో సిపిఐ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే 194 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శేర్లింగంపల్లి కార్యదర్శి టి రామకృష్ణ పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలు వేసి మాట్లాడుతూ నిజమైన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే మహిళ హక్కులె మానవ హక్కులను తొలిసారిగా నినదించింది. కే వెంకటస్వామి డీహెచ్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే చందు యాదవ్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు, కే సుధాకర్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు కూన కాసిం బిటిసి. కే శివకుమార్ ఏఐవైఎఫ్ కార్యదర్శి. ధర్మ తేజ ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి. టీ నితీష్ ప్రెసిడెంట్ ఎస్.కొండలయ్య ఆటోరంగం బాలస్వామి. గోపి ప్రజానాట్యమండలి. కురుమయ్య పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో చందానగర్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర సావిత్రిబాయి పూలే 194వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకులు, పాత్రికేయులు ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కేవీపీఎస్ మండల కార్యదర్శి ఎస్ శ్రీనివాసులు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఆదర్శ విప్లవ స్త్రీ మూర్తి అని అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి సి.శోభన్. సిఐటియు మండల కార్యదర్శి కృష్ణ, రేణుక, లక్ష్మమ్మ, నిర్మల, పాత్రికేయులు సదా నరేష్ శ్రీను, రాజేష్, వరుణ్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర-బషీర్ బాగ్‌లో: మహాత్మా జ్యోతిరావు పూలే దంపతులకు భారత రత్న ప్రకటించాలని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే 194 వ జయంతి సందర్భంగా సావిత్రీబాయి పూలే జయంతి ఉత్సవ అధ్యక్షురాలు పరమేశ్వరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సావిత్రి భాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సావిత్రి భాయి పూలే ఫౌండేషన్ చైర్మన్ మీనగ గోపి, బిసి పొలిటికల్ జేఏసీ సలహాదారు బడేసాబ్, నాయకులు రామ్మూర్తి గౌడ్, కల్పన దత్త, వనం తిరుపతయ్య యాదవ్, వివి గౌడ్,రాఘవేందర్, అంజన్న యాదవ్,మహేందర్ నాయుడు,దేవర శివ,వనం మల్లేష్ యాదవ్, వైనం శివన్న యాదవ్, మహమ్మద్, వసంత చారి పాల్గొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - మేడిపల్లి: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శుక్రవారం ఉదయం ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ డాక్టర్ కె. సుభాష్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు.

చిత్ర పురి సొసైటీ అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరిపించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డ హైదరాబాద్, ఖాజాగూడ చిత్ర పురి కాలనీ సొసైటీ అవినీతి కమిటీ సభ్యత్వాలు రద్దు చేసి వారి ఆస్తులు జప్తు చేయాలి ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేసారు. తెలుగు సిని వర్కర్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అక్రమాలు తెలుసుకొని శుక్రవారం చిత్రపురి కాలనీని సందర్శించి కమిటీ నేతలు అక్రమంగా అమ్ముకున్న భూములను, ప్లాట్‌లను డాక్టర్ దిడ్డి సుధాకర్ పరిశీలించి బాధితుల నుండి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సినీ కార్మికులు ఇళ్ళు, ప్లాట్‌లు కోసం విడతల వారి డబ్బు చెల్లించిన తర్వాత వారికీ కేటాయించక మరొకరికి అక్రమంగా అమ్ముకోవడం దుర్మార్గమన్నారు. చిత్రపురి అవినీతి కమిటీకి సపోర్ట్ చేస్తున్న కో ఆపరేటివ్ అధికారులపై సస్పెండ్ చేసి, అఫిషల్ ఫైవ్ మెన్ కమిటీ కాకుండా అడ్ హాక్ కమిటీని ప్రభుత్వమే నియమించాలని దీనితోపాటు చిత్ర పురి సొసైటీ అక్రమాలపై సిబిఐ దర్యాప్తు జరిపించాలని అయన డిమాండ్ చేసారు. అన్యాయానికి గురైన వందలాది సినీ కార్మికుల భాదితుల పోరాటానికి ఆమ్ ఆద్మీ పార్టీ అండగా ఉంటుందని, వారు చేస్తున్న పోరాటానికి మద్దతుగా జనవరి 6న హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ అఖిల పక్ష రౌండ్ టేబిల్ సమావేశం నిర్వహిస్తుందని డాక్టర్ దిడ్డి సుధాకర్ వెల్లడించారు. ప్రముఖ సినీ నిర్మాత మద్దినేని రమేష్, ఆప్ యువజన విభాగం అధ్యక్షులు విజయ్ ముల్లంగి, మహిళా విభాగం అధ్యక్షులు నర్సింగ్ యమునా గౌడ్, డాక్టర్ విభాగం అధ్యక్షులు లక్ష్య నాయుడు, అధికార ప్రతినిధి జావీద్ షరీఫ్ పాల్గొన్నారు.

చిత్తారమ్మ దేవి జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: శ్రీ చిత్తారమ్మ దేవి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని, ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 125 - గాజులరామారం డివిజన్ శ్రీ చిత్తారమ్మా దేవి ఆలయం నందు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు, పురోహితులు ఎమ్మెల్యే కేపీ వివేకానందకి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలుకుగా, చిత్తారమ్మ దేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనవరి 17వ తేదీ నుండి 25వ తేదీ వరకు నిర్వహించనున్న జాతర స్వర్ణోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధ్యక్షతన ఆలయ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ కోరిన కొర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తులతో పూజలందుకుంటున్న శ్రీ చిత్తారమ్మ దేవి జాతరకు ప్రతీయేటా హైదరాబాద్ నగరంలోని నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఇక్కడికి విచ్చేస్తారన్నారు. ఈ సంవత్సరం నిర్వహించే శ్రీ చిత్తారమ్మ దేవి జాతర ప్రత్యేకమని స్వర్ణోత్సవ వేడుకలలో ముఖ్యంగా జాతర నిర్వహించే ఆదివారం రోజు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటుచేసి జాతరను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆలయకమిటీ సభ్యులు ఎమ్మెల్యేని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, దేవాలయ చైర్మన్ కూన అంతయ్య గౌడ్, మున్సిపల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి, జీడిమెట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఆంజనేయులు, ట్రాఫిక్ సిఐ శ్రీనివాస్, జిహెచ్ఎంసీ ఈఈ కిష్టప్ప, ఎస్ఐ ప్రేమ్ సాగర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాల ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలే పండుగలు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కారించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో గల 35 కాలనీలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుంది. ప్రతి కాలనీలో పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ మరియు 5 ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుంది. దీనిలో భాగంగా శుక్రవారం చందానగర్ డివిజన్ పరిధిలో గల వెంకటాద్రి కాలనీ నందు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. విజేతలకు బహుమతి ప్రదానం చేసిన అనంతరం కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు కొమిరిశెట్టి సాయిబాబా, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవులు మాట్లాడుతూ "పరిశుభ్రత, ఆరోగ్యం, అలంకరణల మేళవింపే ముగ్గులు" అని అన్నారు. పట్టణీకరణ నేపథ్యంలో అపార్టుమెంట్ల సంస్కృతి పెరిగిన తరువాత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు నానాటికి కనుమరుగవుతున్నాయి. ప్రతి మహిళ కూడా ప్రత్యేకించి ఈ ధనుర్మాసం మొత్తం నెలరోజులు అత్యంత ఉత్సాహంగా వేకువ ఝామున లేచి ముగ్గులు వేయడం ప్రారంభిస్తారు" అని అన్నారు. పోటీలలో విజేతల ఎంపికలో తాటిచర్ల వరలక్ష్మి, అనూషా జడ్జీలుగా వ్యవహరించారు. ఈ పోటీలలో 25 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా నాయకురాలు కుమారి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యురాలు ఉమా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

22 లీటర్ల నాటు సారా స్వాధీనం



విశాలాంధ్ర - ఆమనగల్లు : కడ్తాల్ మండలంలో శుక్రవారం నిర్వహించిన ఎక్సైజ్ దాడులలో 22 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని 8 కేసులు నమోదు చేసినట్లు ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్య చౌహాన్ చెప్పారు. ఈ సందర్భంగా మండలంలోని పల్లె చెలక తండా, వాసుదేవ్ పూర్, కొర్లకుంట తండా లలో దాడులు నిర్వహించి పది కిలోల పటిక, 40 కిలోల బెల్లం స్వాధీనం చేసుకొని 550 లీటర్ల బెల్లం పాకం ధ్వంసం చేసినట్లు ఆయన వివరించారు. దాడులలో ఎస్సైలు కృష్ణ ప్రసాద్, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

మంత్రి పార్థసారథి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అటవీ భూములకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చినా అటవీ శాఖాధికారులు... సాగు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఘటనలపై ప్రభుత్వం దృష్టి సారించి, సమస్యలు పరిష్కరించాలని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళగిరి సీసీఎల్‌ఏ రాష్ట్ర కార్యాలయంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం ప్రాంతీయ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని సమస్యలను ప్రస్తావించి, వాటిని పరిష్కరించాలని కోరారు. రెవెన్యూ, అటవీ సంయుక్త కమిటీ ఏర్పాటు చేయాలి... సర్వే చేసి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన సూచించారు. అన్ సర్వే భూములకు కొత్త నంబర్లు కేటాయించాలన్నారు. ఆలయాలకు వందల ఎకరాలను దాతలు ఇచ్చారని, అవి కబ్జాకు గురయ్యా యని, దేవాలయ భూసమస్యలను పరిష్కరించాలని పార్థసారథి కోరారు. సదస్సులో ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు, ఎమ్మెల్యేలు బొండా ఉమా మహేశ్వరరావు, కామినేని శ్రీనివాస్, గద్దే రామ్మోహన్, వసంత కృష్ణ ప్రసాద్, శ్రీరాం రాజగోపాల్, వర్ల కుమార్ రాజా, కొలికపూడి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు రామరాజు, అశోక్ బాబు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోదియా, సీసీఎల్‌ఏ జయలక్ష్మీ, 12 జిల్లాల కలెక్టర్లు, జేసీలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కార్బైడ్ వ్యర్థాల తరలింపుపై నిరసన

ఇద్దరు వ్యక్తుల ఆత్మాహుతి యత్నం

పిథంపూర్‌లో ఉద్రిక్తత

ధార్: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ లో వేలాది మంది ప్రాణం తీసిన విషపూరిత గ్యాస్ లీక్ దుర్ఘటనకు 40 ఏళ్లు... అప్పట్లో లీకైన విష వాయువుకు సంబంధించిన వ్యర్థాలను యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ ఆవరణలో జాగ్రత్తగా నిల్వ చేశారు. ప్రస్తుతం ఈ వ్యర్థాలను తొలగించే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. తొలుత ఫ్యాక్టరీ ఆవరణలో నిల్వ చేసిన సుమారు 337 టన్నుల వ్యర్థాలను పిథంపూర్ ఇండస్ట్రియల్ ఏరియాకు తరలించి, ఇంజనీరింగ్ నిపుణులతో వాటిని మండించనున్నారు. కాగా ప్రమాదకర వ్యర్థాలను తమ ప్రాంతానికి తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం పిథంపూర్‌లో స్థానికులు ఆందోళనకు దిగారు. పిథంపూర్ బచావో సమితి ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా దుకాణాలు, మార్కెట్‌లు మూతబడ్డాయి. సమితి నిర్వహించిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఇద్దరు వ్యక్తులు ఒంటికి నిప్పంటించుకుని ఆత్మాహుతికి యత్నించడంతో ఒకింత ఉద్రిక్తత చోటుచేసుకుంది. తోటి నిరసనకారులు వెంటనే మంటల్ని ఆర్పివేయడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఇండోర్ నుండి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న టౌన్‌షిప్‌కు ప్రమాదకర పదార్థాలను తరలించడం వల్ల తమకు ఆరోగ్యపరంగా ముప్పు ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా వ్యర్థాల తరలింపులో భాగంగా బుధవారం రాత్రి విషపూరిత రసాయన వ్యర్థాలను 12 సీల్డ్ కంటైనర్లలో లోడ్ చేశారు. వంద మంది కార్మికులు షిఫ్టుల వారీగా (అరగంట చొప్పున) పనిచేశారు. పని పూర్తయ్యాక కార్మికులకు అధికారులు వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం కంటైనర్ ట్రక్కులు అక్కడి నుంచి 250 కిలోమీటర్ల దూరంలోని పిథంపూర్ కు బయలుదేరాయి. ట్రక్కులు జాగ్రత్తగా వెళ్లేందుకు ట్రాఫిక్ పోలీసులు గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేశారు. పిథంపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఈ వ్యర్థాలను రామ్‌కీ ఎన్విరో ఇంజినీరింగ్ కళాశాల ఇంజనీర్ల ఆధ్వర్యంలో ధ్వంసం చేయనున్నారు. ఇందుకు 153 రోజులు పడుతుందని అధికారుల అంచనా. కాగా, 1984 డిసెంబరు 2 అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు ఉదయం వరకు యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలో ప్రమాదకర మీథైల్ ఐసోసైనెట్ (ఎంఐసీ) గ్యాస్ లీక్ అయింది. ఈ విషవాయువు గాలిలో కలిసి ఫ్యాక్టరీ పరిసరాలతో పాటు భోపాల్ నగరంలోకి వ్యాపించింది. విషవాయువు కారణంగా ఫ్యాక్టరీ కార్మికులతో పాటు భోపాల్ లో మొత్తం 3,800 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికీ అక్కడి ప్రజలపై ఈ విషవాయువు దుష్ప్రభావాలు కనిపిస్తూనే ఉన్నాయి. చాలామంది వైకల్యంతో బాధపడుతున్నారు.

సమస్యలపై వినతి

బెజవాడ భూపరిపాలన కేంద్ర కార్యాలయంలో శుక్రవారం వివిధ సమస్యలపై రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రధాన కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేసి ముచ్చటిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ. పక్కనే బాపట్ల జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళీ, సీపీఐ రాష్ట్ర నేత అక్కినేని వనజ.

విశాలాంధ్ర-విజయవాడ

ఢిల్లీ కాలేజీకి సావర్కర్ పేరా?

తీవ్ర అభ్యంతరకరం: నారాయణ

విజయవాడ: చదువుల దేవాలయానికి హిందూత్వవాదానికి ఆద్యుడైన సావర్కర్ పేరు పెట్టడం పూర్తి అభ్యంతరకరమని సీపీఐ కార్యదర్శి డా.కె. నారాయణ పేర్కొన్నారు. మతం ఆధారంగా సమాజాన్ని విభజించే వాదాన్ని ప్రేరేపించి... భారత స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీ అహింసాయుత క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించిన చరిత్ర సావర్కర్‌కు ఉందని, అలాంటి వ్యక్తి పేరును దేశ రాజధానిలో ఏర్పాటు చేసే విద్యల ఆలయానికి పెట్టాల్సిన అవసరం ఏమిటని నారాయణ ప్రశ్నించారు. లౌకిక భావాలు, సర్వమత సమాధికారం అనేవి భారత సమాజపు విలువలకు వెన్నెముక వంటివని, వాటిని వ్యతిరేకించి... ఉద్యమాలు చేసి... చివరకు మహాత్ముని హత్య కేసులో నింది తుడిగా అనుమానించబడిన సావర్కర్ పేరు సరస్వతీ నిలయానికి పెట్టాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ఇప్పుడు సావర్కర్ పేరు పెట్టిన మోదీ సర్కారు...భవిష్యత్‌లో మరో విద్యాలయానికి గాడ్సే పేరు పెడుతుందని నారాయణ విమర్శించారు. మోదీ సర్కారు నిర్ణయాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన తెలిపారు.

జులైలో తానా నవలల పోటీ

విశాలాంధ్ర-హైదరాబాద్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) 24వ మహాసభల సందర్భంగా నవలల పోటీ నిర్వహిస్తున్నట్లు తానా ప్రకటించింది. ప్రతి రెండేళ్లకు నిర్వహించే నవలల పోటీని ఈసారి 2025 జులై 3, 4, 5 తేదీలలో అమెరికాలోని డిట్రాయిట్‌లో నిర్వహించనున్న ట్లు ప్రకటించింది. ఈ సంవత్సరం కూడా రెండు లక్షల రూపాయల బహుమతితో పోటీ కొనసాగించాలని తానా కార్యవర్గం నిర్ణయించింది. 1997 నుంచి తానా నవలల పోటీ నిర్వహిస్తోంది. మధ్యలో కొంతకాలం విరామం వచ్చినప్పటికీ 2017 నుంచి తిరిగి నిర్వహించిన నవలల పోటీలో బహుమతికి ఎన్నికైన శప్తభూమి, నీల, ఒంటరి, కొండపొలం, మున్నీటి గీతలు, అర్థనారి నవలలు సాహితీలోకంలో ఒక కదలికను తీసుకొచ్చాయి. శప్తభూమి నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. కొండపొలం నవల సినిమాగా రూపొందింది. మున్నీటి గీతలు నవలకు సంబంధించి త్వరలో అరేబియన్ కడలి పేరిట వెబ్ సిరీస్ రాబోతోంది. ఈ పోటీల వల్ల తెలుగు నవలారంగంలో కొంతకాలంగా కనబడుతున్న స్తబ్ధత తొలగిపోయింది. తెలుగు సాహిత్యంలోనూ, ప్రపంచ సాహిత్యంలోనూ కలకాలం నిలబడే నవలలను వెలికి తీసుకురావాలనే తానా ప్రయత్నానికి స్పందించి ఈ పోటీలో పాల్గొనవలసిందిగా తెలుగు రచయితలందరికీ తానా విజ్ఞప్తి చేసింది. పోటీకి పంపే రచనలు అందవలసిన ఆఖరు తేదీ: 15 ఏప్రిల్ 2025. **రచనలు పోస్టులో పంపవలసిన చిరునామా:** అక్షర క్రియేటర్స్, ఎజి-2, 'ఎ' బ్లాక్, మాతృశ్రీ అపార్ట్‌మెంట్స్, హైదర్ గూడ, హైదరాబాద్-500029. ఇతర వివరాలకు: 98493 10560, 99496 56668. **Email: tana.novel.2025@gmail.com.**

బుడమేరు వరద నియంత్రణకు కేంద్ర సాయం

మంత్రులు రామానాయుడు, నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బుడమేరు వరదలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామని, ఇందుకు సంబంధించి కేంద్రానికి నివేదించి కేంద్ర ప్రభుత్వ సహకారం కోరతామని మంత్రులు నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణ తెలిపారు. బుడమేరు వరద నియంత్రణపై విజయవాడ ఇరిగేషన్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మునిసిపల్ వ్యవహారాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కన్నబాబు, సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, ఇరిగేషన్ ఈఎన్సీ వెంకటేశ్వరరావుతో పాటు ఇరిగేషన్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, సర్వే అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సమగ్ర నివేదిక అందించేందుకు ఆయా శాఖల అధికారులతో బుడమేరుపై సమగ్ర సమీక్ష చేశారు. సమీక్ష అనంతరం మంత్రి రామానాయుడు మాట్లాడుతూ బుడమేరు నష్టాన్ని అందరం చూశామని, ఒక్కరోజే 50,000 క్యూసెక్కుల వరద నీరు రావడం, మూడు చోట్ల గండ్లు పడటం జరిగాయన్నారు. బుడమేరు డైవర్షన్ కెనాల్ సామర్థ్యం ప్రస్తుతం 17,500 క్యూసెక్కుల నుంచి 37,500 క్యూసెక్కులకు పెంచేలా, పెండింగ్ పనులు పూర్తి చేసేలా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కార్యాచరణను సిద్ధం చేసి సీఎంకు అందిస్తామన్నారు. వెలగలేరు రెగ్యులేటర్ నుంచి కొల్లేరు వరకు ఓల్డ్ ఛానెల్ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచనలు చేశామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితమే బుడమేరు ముంపునకు కారణమన్నారు. 2014-19 కాలంలోనే ఎనికేపాడు యూటీ నుంచి కొల్లేరు వరకు వెళ్లే ఛానల్ విస్తరణ పనులను గత ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. బుడమేరు ఛానెల్‌కు సమాంతరంగా ఓల్డ్ ఛానెల్‌ను కూడా 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కొల్లేరు నుంచి ఎటువంటి అడ్డంకులు లేకుండా సముద్రానికి వెళ్లేలా ఉప్పుటేరును అభివృద్ధి చేస్తామన్నారు. ఇదే అంశం మీద ఈ నెల 18న మరోసారి సమీక్ష చేస్తామన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ బుడమేరు వరదల వల్ల విజయవాడ నగరంలోని 34 వార్డుల్లోని 5 లక్షల మంది నాలుగు రోజులు నీటిలోనే ఉండటం బాధాకరమన్నారు. ఆ సమయంలో వారికి కనీసం రోజు వారీ అవసరాలకు కూడా నీరు అందని పరిస్థితి ఉందన్నారు. అయినా సీఎం అందించిన స్ఫూర్తితో ప్రజలకు రోజుకు 20 నుంచి 30 లక్షల మంచినీటి బాటిళ్లను పంపిణీ చేశామని, దానిని కూడా కొంతమంది రాజకీయం చేశారని చెప్పారు. గత ప్రభుత్వం బుడమేరు టెండర్లు రద్దు చేయకుండా ఉంటే విజయవాడకు ఈ పరిస్థితి వచ్చేది కాదని తెలిపారు. బుడమేరు, కృష్ణానదికి ఒకేసారి వరద వస్తే ఏం చేయాలన్న దానిపై కూడా ప్రధానంగా చర్చించామన్నారు. దీనిపై విపత్తు నిర్వహణ విభాగంతో చర్చించాల్సి ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి అపార అనుభవం వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇప్పుడిప్పుడే గాడిన పడుతుందన్నారు. బుడమేరు వరద నియంత్రణకు సంబంధించి కేంద్రానికి నివేదించి కేంద్ర ప్రభుత్వ సహకారం కోరతామని నారాయణ తెలిపారు.

విశాఖ కేంద్ర కారాగారంలో సెల్ ఫోన్ కలకలం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ కేంద్ర కారాగరంలో తరచూ అనేక సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. సెంట్రల్ జైల్లో డ్రగ్స్ సరఫరా గంజాయితో పట్టుబడిన ఓ భద్రతా సిబ్బందిని ఇటీవల సస్పెండ్ చేయగా, ఖైదీలకు బట్టలు విప్పి అవమానపరిచారన్న ఆందోళన నేపథ్యంలో 39 మంది వార్డెన్‌లను బదిలీ చేశారు. తాజాగా కేంద్ర కారాగారంలో మరోసారి సెల్ ఫోన్ బయటపడటం సంచలనంగా మారింది. నర్మదా బ్లాక్ వద్ద శుక్రవారం అధికారులు తనిఖీలు చేస్తుండగా స్టోర్ రూమ్ ఫ్లోరింగ్ మార్బుల్ కింద కీ ప్యాడ్ మొబైల్‌ను ప్యాక్ చేసి పెట్టారు. తనిఖీల సందర్భంగా అధికారులకు అనుమానం రావడంతో ఆ ప్రాంతంలో తవ్వి చూడగా సెల్ ఫోన్ బయటపడినట్లు ఎస్పీ మహేశ్ బాబు తెలిపారు. కేంద్ర కారాగారంలో ఖైదీలుండే పెన్నా బ్యారక్ సమీపంలో పూల కుండీల వద్ద డిసెంబరు 31న జైలు అధికారులు అనుమానంతో తనిఖీ చేశారు. అక్కడ కట్టుదిట్టమైన ప్యాకింగ్ బయటపడగా, తొలుత గంజాయిగా భావించారు. తెరిచి చూస్తే అందులో రెండు సెల్ ఫోన్లు, ఒక బ్యాటరీ, ఒక పవర్ బ్యాంక్ గుర్తించారు. గొయ్యి తీసి ఫోన్లు ఉన్న కవరు అందులో పెట్టి పూడ్చి, రెండు రాళ్లతో కప్పి ఆపైన పూల కుండీలను పెట్టినట్లు తేలింది. విషయాన్ని జైళ్లశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి సూచనతో ఆరిలోవ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాజా పరిణామాలు, కేసు నేపథ్యంలో విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ నేరుగా రంగంలోకి దిగారు. అయితే సెల్ ఫోన్‌లో సిమ్ కార్డులు లేవు. సిమ్ కార్డులు ఎక్కడ దాచారో విచారణలో తేలాల్సి ఉంది. అది బయటపడితే కాల్ లిస్టు ఆధారంగా ఎవరు ఎవరితో మాట్లాడారనే విషయాలు వెలుగులోకి వస్తాయి. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతున్న సమయంలోనే తాజాగా శుక్రవారం మరో సెల్ ఫోన్ బయటపడటం సంచలనంగా మారింది.

విద్యుత్ చార్జీలపై 7 నుంచి ప్రజాభిప్రాయసేకరణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: 2025-26 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ చార్జీల(టారిఫ్) ప్రతిపాదనలపై జనవరి 7, 8, 10 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు ఏపీఈఆర్సీకి సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక(ఏఆర్ఆర్)పై ఏడు, ఎనిమిది తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీ లోని 'ఏ' కన్వెన్షన్ సెంటర్ నుంచి, పదవ తేదీన కర్నూలు ఏపీఈఆర్సీ కార్యాలయంలో ప్రతీ రోజు ఉదయం 10.30 గంటల నుంచి ఒంటిగంట వరకు నేరుగా, రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో వినియోగదారులు, అభ్యంతరాలున్నవారు తమ అభిప్రాయాలు వెల్లడించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఈఆర్సీ అధికారులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఇంధనశాఖ, ఏపీ ట్రాన్స్‌కో, జెన్కో ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఏపీఈఆర్సీ చైర్మన్ (ఇన్ ఛార్జ్) ఠాకూర్ రామసింగ్ అధ్వర్యంలో జరిగే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో అభిప్రాయాలు చెప్పదలుచుకున్నవారు తమ సమీప విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం(ఎస్ఈ ఆఫీస్) లేదా డివిజన్ కార్యాలయం(ఈఈ ఆఫీస్) ద్వారా పాల్గొని అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏపీఈఆర్సీ రాష్ట్రవ్యాప్తంగా మూడు విద్యుత్ పంపిణీ సంస్థల కార్పొరేట్, సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాక్ పబ్లిక్ హియరింగ్ నిర్వహించిన్నట్లు తెలిపారు.

ఆహార శుద్ధి రంగం మరింత బలోపేతం

మంత్రి టీజీ భరత్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని ఫుడ్ ప్రాసెసింగ్ రంగం బలోపేతానికి కృషి చేస్తున్నామని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో ఆహార పరిశ్రమల ప్రోత్సాహక సౌలభ్య వన్-స్టాప్ హెల్ప్‌లైన్ 040 4590 1100ను మంత్రి ప్రారంభించారు. భరత్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలలో పారదర్శకతను, ఆహార ప్రాసెసింగ్ రంగంలో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, వారి సమస్యలకు పరిష్కారం చూపడం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ప్రాజెక్టు నివేదిక సమర్పించినప్పటి నుంచి అవసరమైన దశల్లో ప్రభుత్వ అనుమతులు పొందే వరకు నూతన పరిశ్రమలకు సహకారంలో ఈ హెల్ప్‌లైన్ కీలకమని చెప్పారు. తద్వారా కొత్త పెట్టుబడులకు త్వరితగతిన అనుమతులు లభిస్తాయని అన్నారు. పారిశ్రామిక రంగంలో సరళీకృత వ్యాపార కార్యకలాపాలు మెరుగవుతాయని చెప్పారు. ఈ హెల్ప్‌లైన్ ప్రభుత్వ అనుమతులు, ఇతర పరిపాలనా సమస్యలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు వినియోగమవుతుందని భరత్ చెప్పారు.

అభ్యుదయవాది చిరంజీవి

జయంతి సభలో విశ్వేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ (సాహిత్యం): పేరుకు తగ్గట్లు నార్ల చిరంజీవి అమరజీవి అని శ్రీశ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావు అన్నారు. చిరంజీవిలో ఒక అభ్యుదయ కవి, గొప్ప కథకుడు ఉన్నాడన్నారు. ఆయన పుట్టి 100 సంవత్సరాలు అయినా ఆయన గురించి మనం స్మరించుకుంటున్నామంటే దానికి కారణం ఆయనలో ఉన్న అభ్యుదయ భావాలు ఆయనను చిరంజీవిగా నిలిపాయని తెలిపారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా రెండవ రోజు శుక్రవారం నార్ల చిరంజీవి శతజయంతి సభ జరిగింది. ఈ సభకు విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఖమ్మం నుంచి విచ్చేసిన సీతారాం మాట్లాడుతూ చిరంజీవి గొప్ప కథకుడు, నాటకకర్త, బాల సాహిత్యకారుడు అని కొనియాడారు. విశాలాంధ్ర దినపత్రికలో కొంతకాలం 'చిన్నారులం' అనే బాలశీర్షిక నిర్వహించారన్నారు. మంజుల కృష్ణకుమారి మాట్లాడుతూ చిరంజీవి కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, అభ్యుదయ రచయితల ఉద్యమంలోనూ, అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న పోరాట యోధుడన్నారు. 1949 నుంచి 1950 వరకూ విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో ఆయన పని చేశారని తెలిపారు. 1925 మే 1న కృష్ణా జిల్లా గన్నవరం తాలూకా కాటూరు గ్రామంలో జన్మించిన వ్యక్తి కావటం మనకు గర్వకారణమన్నారు. ఆయన పెద్దగా చదువుకోక పోయినప్పటికీ సంస్కృతం, తెలుగు, హిందీ భాషల్లో పట్టు సంపాదించారన్నారు. ఆయన రచనల విషయానికొస్తే... ఎర్ర గులాబీ, తెలుగు పూలు, కిర్రు చెప్పులు, పేను పెసర చేను. ఆయన రాసిన వాటిలో 'భాగ్యనగరం' అనే గేయ నాటిక బాగా ప్రాచుర్యం పొందిందని అన్నారు. అంతేకాకుండా ఆయన సినిమా రంగంలో ప్రవేశించి కొన్ని చలనచిత్రాలకు రయితగా పనిచేశారు. ఆయన కొన్ని సినిమాలకు పాటలు రాశారు. 1962లో వచ్చిన ఆరాధన అనే సినిమాకు ఆయన పాటలు రాసినట్లు తెలిపారు. చిరంజీవి జీవిత చరిత్ర 'అగ్ని సరస్సున వికసించిన వజ్రం నార్ల చిరంజీవి' అనే పుస్తకంగా ప్రచురితమైంది.

భూముల కబ్జాపై సజ్జల సమాధానం చెప్పాలి: మర్రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సజ్జల దోచుకున్న ప్రైవేటు ఆస్తులు, ప్రభుత్వ సంపదను కూటమి ప్రభుత్వం కక్కిస్తుందని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ పాపాలు నేడు ప్రజలకు శాపాలయ్యాయన్నారు. సామాన్య జర్నలిస్టు సజ్జల రామకృష్ణారెడ్డి వేల కోట్లకు అధిపతి ఎలా అయ్యాడో చెప్పగలరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో13 లక్షల ఎకరాల భూమి వైసీపీ నాయకులు కబ్జా చేశారని ఆరోపించారు. సజ్జలపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సకల శాఖా మంత్రిగా పేరుపొందిన సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు కోట్ల విలువైన అటవీ భూములనే స్వాహా చేశారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు.

మోదీ విశాఖ పర్యటనకు ఏర్పాట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 8న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నం పర్యటన విజయవంతానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన వీడియో సమావేశం ద్వారా సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు ఇప్పటికే సాధారణ పరిపాలన శాఖ ద్వారా ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు. ఏ చిన్న పొరపాటుకు ఆస్కారం లేని రీతిలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్ సహా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఇంకా మినిట్ టు మినిట్ కార్యక్రమం ఖరారు కావాల్సి ఉందని, ఈలోగా వివిధ శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. 8వ తేదీ సాయంత్రం ప్రధాన మంత్రి విశాఖపట్నం చేరుకుని సంపత్ వినాయక ఆలయం నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసే సభా వేదిక వరకూ రోడ్ షో నిర్వహించనున్నారని సీఎస్ చెప్పారు. రోడ్ షోలో పాల్గొనేందుకు పెద్దఎత్తున ప్రజలు, ప్రజా ప్రతినిధులు రానున్నందున వారి వాహనాల పార్కింగ్‌కు అవసరమైన చర్యలు, అలాగే రోడ్ షో, సభా వేదిక, వివిధ పార్కింగ్ స్థలాల్లో తగిన విద్యుత్ దీపాలను, తాగునీరు, అల్పాహారం, భోజన వసతి, తాత్కాలిక మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని విద్యుత్, మునిసిపల్ శాఖల అధికారులను ఆదేశించారు. తొలుత జీఏడీ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్... ప్రధాన మంత్రి పర్యటనకు సంబంధించి విశాఖపట్నం జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్ సహా వివిధ శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విశాఖ జిల్లా కలెక్టర్ హరీంద్ర ప్రసాద్ వర్చువల్‌గా పాల్గొని మట్లాడుతూ ప్రధాని పర్యటనకు నగరంలో లక్షా 20 వేల మందిని, విశాఖ గ్రామీణ ప్రాంత మండలాల నుంచి 10 వేల మందిని, అనకాపల్లి జిల్లా నుంచి 40 వేల మందిని తీసుకువచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. విశాఖ పోలీసు కమిషనర్ ఎస్.బాగ్చి వర్చువల్‌గా పాల్గొని మాట్లాడుతూ నగరంలో 22 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి డీజీపీ ద్వారకా తిరుమల రావు, సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న, టీఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లు విజయకృష్ణన్, డా.బీఆర్ అంబేద్కర్, స్వప్నిల్ దినకర్, ఎస్పీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ప్రైవేట్ పరం దుర్మార్గం: వైసీపీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలోనే అత్యంత అద్భుత పథకంగా ఉన్న ఆరోగ్యశ్రీని తమ స్వార్థం కోసం ప్రైవేటు బీమా కంపెనీకి అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైసీపీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆక్షేపించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచితంగా అందిస్తున్న వైద్య సేవల బాధ్యత నుంచి తప్పుకునేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా ఈ నిర్ణయం తీసుకుందని ఆయన ఆరోపించారు. నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతున్న ఆరోగ్యశ్రీ పథకాన్ని కాపాడుకునేందుకు వైసీపీ ప్రజా ఉద్యమం చేపడుతుందన్నారు.

సంక్షేమ పథకాలపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదు: యార్లగడ్డ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సంక్షేమ పథకాలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు గానీ, ఆ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి గానీ లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... వైసీపీ నేతలు సూపర్ సిక్స్ అమలు గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, వారి పాలనలో నవరత్నాల్లో ఆరు నెలల్లో ఎన్ని అమలు చేశారని ప్రశించారు. దీనిపై బహిరంగంగా చర్చకు సిద్ధమా.. అంటూ సవాల్ చేశారు. పింఛన్ పెంచేందుకు వైసీపీకి ఆరు నెలలు సమయం పట్టిందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా అభివృద్ధి ఎలా ఉందో రోడ్లు చూస్తే అర్థం అవుతుందన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వాన్ని చూసి పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద పెద్ద సంస్థలు క్యూ కడుతున్నాయన్నారు. మంత్రి నారా లోకేశ్ సైతం యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నారని తెలిపారు. వైసీపీ హయాంలో కనీసం ఒక్క ఐటీ కంపెనీ కూడా తీసుకువచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కోరడం ఎంత వరకు న్యాయం..అని ప్రశ్నించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.